# అవీ-ఇవీ

- గొల్లపూడి మారుతిరావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 140

# అవీ – ఇవీ

## (గొల్లపూడి మారుతీ రావు)


| ఏడాది | నెల | శీర్షిక  పేరు | పేజి |
|---|---|---|---|
| 2007 | 01 | విశ్వనాధ ఆత్మకథ | 2 |
| 2007 | 02 | రెండు ఉత్తరాలు | 6 |
| 2007 | 03 | సినీ రచన  నాడు – నేడు | 9 |
| 2007 | 04 | విశ్వాసం | 14 |
| 2007 | 05 | పొరుగింటి పుల్ల కూర | 16 |
| 2007 | 06 | భారత ఎద్దు | 18 |
| 2007 | 07 | తెలుగు తెగులు | 20 |
| 2007 | 07 | నా ప్రారంభానికి నిస్వార్ధ సాక్షి – శ్రీ కోడి రామకృష్ణ | 22 |
| 2007 | 08 | అమ్మ కడుపు చల్లగా | 25 |
| 2007 | 08 | దేవుణ్ణి ఛాలెంజ్ చేసిన మనిషి – చిరంజీవి | 32 |
| 2007 | 09 | సినీ రచన  నాడు – నేడు | 35 |
| 2007 | 09 | అశీస్సులు – కీ శే శ్రీ డి వి నరసరాజు | 39 |
| 2007 | 10 | రేచకుడు | 42 |
| 2007 | 10 | ఆయన ఒక ఆగని వర్షం – శ్రీ అజయ్ శాంతి | 47 |
| 2007 | 11 | యశస్వి  – ఎస్పీ | 50 |
| 2007 | 11 | మైత్రి  – కీ. శే. శ్రీ అల్లు రామలింగయ్య | 51 |
| 2007 | 12 | అమ్మ | 54 |




## విశ్వనాథ 'ఆత్మకథ'

# అనుభవాల కలంనుంచీ అనేక విషయాలు



చిన్నప్పుడు పసివాడు బొమ్మల పుస్తకాన్ని 'చూస్తాడు'. కాస్త ఎదిగాక పెద్దబొమ్మలు, చిన్న కథలూ ఉన్న పుస్తకాన్ని 'చదువుతాడు'. మరికాస్త పెరిగాక రెక్కల్తో ఎగిరే మనుషులూ, వరాలిచ్చే దేవతలూ, ఆలోచనల్ని ఆకాశంలో నిలిపే అభూత కల్పనలల్ని ఆహ్వానిస్తాడు. ఇంగ్లీషు చదువులయితే హారీ పోటర్, తెలుగు చదువులయితే ప్రహ్లాద చరిత్రలాంటివి ఆకర్షిస్తాయి. ప్రహ్లాదుడుని కొండల మీదనుంచీ తోసేసినా చచ్చిపోకుండా పాటలు పాడటం, మనిషీ, జంతువూ కాని పెద్ద ఆకారం దుర్మార్గుడిని చంపటం వంటి మెలోడ్రామా పసి మనస్సుని ఆహ్లాద పరుస్తుంది. (ఈ తరం వారికి ఆ కథలు తెలియకపోతే తప్పు వాళ్ళది కాదు. తల్లిదండ్రులది.) మరికాస్త ఎదిగాక కాశీ మజిలీ కథలు నచ్చుతాయి. మనస్సు ఊహించే కల్పనలు, ఉచ్చులూ ఆకర్షిస్తాయి. యువరక్తం నిలదొక్కుకుంటున్నప్పుడు నవలలూ, కథల వేపుకి మనస్సులాగుతుంది. జీవితం మధ్య వయస్సులోకి వచ్చినపుడు తన వెనక చరిత్రని తెలుసుకోవాలనే ఆసక్తి కలుగుతుంది. చరిత్రా, వాస్తవం ఎరగాలనే దశ అది. జీవితం సాయంకాలం వేపు మొగ్గు చూపినప్పుడు - వెనక్కి వెళ్ళి చెప్పిన ఆత్మకథ వేపు మనస్సు పోతుంది. మహానుభావుల జీవికలూ, వారిజీవితం నేర్పే పాఠాలూ ఆకర్షిస్తాయి. మరి కాస్త ముందుకు పోతే - వృద్ధాప్యం 'ఈ జీవితం తరువాత ఏమిటి?' అనే ప్రశ్నని సిద్ధం చేస్తుంది. సత్కర్మ, సంస్కారం కలిసివస్తే పురాణాలూ, భగవద్గీత చేతికి వస్తాయి. ముసలితనం ముసురుకున్నప్పుడు - పోయినవాళ్ళ వార్తల్ని చదవాలనిపిస్తుంది - తన తరం వాళ్ళు ఎవరు సెలవు తీసుకుంటున్నారో తెలుసుకోవడానికి. ఇది మనిషి ఆలోచనల పరిణామం.

డేవిడ్ నివెన్ అనే హాలీవుడ్ నటుడు 'ది మూన్ ఈజె బెలూన్' అనే ఆత్మకథ రాశాడు. 'మనిషి ముందుకు చూసి ఆత్మకథ రాశాడు. దాని ముందు మాటలో 'మనిషి ముందుకు చూసి సాధించగలిగిందేమీ లేనప్పుడు - వెనక్కి తిరిగి ఆత్మకథ రాస్తాడు' అన్నాడు. ఈ వాక్యం నా అహాన్ని రెచ్చగొట్టి చాలా కాలం ఆత్మ కథ మొదలుపెట్టకుండా నన్ను ఆపింది. కానీ పి.వి.నరసింహారావుగారిని వారి చివరి రోజుల్లో కలిసినప్పుడు: 'ఆలశ్యం చెయ్యకండి మారుతీరావుగారూ, రోజూ నాలుగు వాక్యాలయినా రాయండి. తరువాత సవరణలు చేసుకోవచ్చు. నేనలా రాయకపోతే ఇన్‌సైడర్ రాయగలిగేవాడిని కాదు' అంటూ ఆ గ్రంథాన్ని యిచ్చారు. తదాదిగా 'అమ్మ కడుపు చల్లగా' అనే ఆత్మకథని ప్రారంభించాను. ఇది దాదాపుగా ముగింపు దశకి వచ్చిందీనాటికి.

ఆత్మ కథ జీవుని వేదనను వివరిస్తుంది. ఆ వ్యక్తి జీవితాన్ని సమీక్షిస్తుంది. ఆత్మకథ ఓ వ్యక్తి జీవితానికి అందమయిన అధోజ్ఞాపిక (foot note). నన్ను చాలా బాగా ఆకర్షించిన ఆత్మకథలు రెండు భాషల్లోనూ రెండేసి ఉన్నాయి. ఇంగ్లీషులో చార్లీ చాప్లిన్ 'మై ఆటోబయోగ్రఫీ', స్వామి పరమహంస యోగానంద 'ఆటోబయో గ్రఫీ ఆఫ యోగి'. తెలుగులో ఆదిభట్ల నారాయణదాసుగారి 'నా యెరుక', శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి 'అనుభవాలూ - జ్ఞాపకాలూ'. మరొక హృద్యమైన స్వీయకథ ఆచంట జానకీరామ్‌గారి 'సాగుతున్న యాత్ర'. అలాగే ఇంగ్లీషులో చెప్పవలసి వస్తే ఎమ్.సి.చాగ్లా 'రోజెస్ ఇన్ డిసెంబర్'.

ఇదిగో, ఈ సందర్భంలో డాక్టర్ పప్పు వేణు గోపాలరావుగారు చెప్పారు - విశ్వనాథవారి ఆత్మకథ తన దగ్గర ఉందని. ఈ తరం వారికి విశ్వనాథ వారిని తెలియకపోవచ్చు. తెలిసిన వారికీ వారు ఆత్మ కథ రాశారని తెలియకపోవచ్చు. తెలిసిన ఆ కొద్ది మందికీ ఆత్మకథ చదివే అవకాశం రాకపోవచ్చు - అది ముద్రణలో లేదు కనుక.

మా తరానికి విశ్వనాథ మేరుశృంగం. ఆయన 1971లో ఆత్మ కథ ప్రారంభించి కేవలం 65 పేజీలు రాశారు. తెలుగు సాహిత్యానికి జరిగిన పెద్ద నష్టం వారు ఆత్మకథని పూర్తి చెయ్యకపోవడం. పుస్తకం నాచేతికి రావటానికి - పుస్తకాలు మరొకరికి ఇవ్వడానికి సందేహించే పప్పుని (ఆ అలవాటు నాకూ ఉంది) బెల్లించి, ఫోన్లు చేసి, ప్రతిజ్ఞలు చేసి - చాలా శ్రమ పడి తెచ్చుకున్నాను. తీరా పుస్తకం చేతికి వచ్చాక కేవల 65 పేజీలు చదివిన తర్వాతే పుస్తకాన్ని కింద పెట్టగలిగాను.

ఆత్మ కథ మీద ఆసక్తికి మొదటి ప్రేరణ - ఆ కథకి కారణమయిన వ్యక్తి ప్రాచుర్యం, ఆ వ్యక్తి పట్ల మనకి ఉన్న ఆకర్షణ, గౌరవం. మహాత్ముడిని 'జాతిపిత' అని తెలిశాక వారి జీవితం తప్పనిసరిగా మనకి ఆసక్తిని కలిగిస్తుంది. మదర్ థెరిస్సా ఆత్మకథ రాసి ఉంటే నేను క్యూలో నిలబడి మొదటి కాపీని కొనుక్కుంటాను. ఒక తరాన్ని తన అందంతో వెర్రెత్తించిన హెడీ లామర్ (శాంసన్ అండ్ డెలైలా హీరోయిన్) తన ఆత్మకథని రాసింది 'టియర్స్ అండ్ స్మైల్స్' అని. అంతా ఆ రోజుల్లో విరగబడి చదివారు.

విశ్వనాథవారు ఆత్మకథ గురించి అద్భుతమైన వివరణ మొదట్లోనే యిచ్చారు. 'ఎలుక ఎంతవరకు తన వైపునకే తవ్వుకొనునన్నట్లు ఆ కవి యొక జీవుడు, వాడనుభవించినాడు. వాడు స్వానుభవాభిముఖంగానే చెప్పును. సుగ్రీవుడు శ్రీరామచంద్రునితో తనకు తన అన్నగారు చేసిన ఉపకారము తన దృష్టితో చెప్పినాడు. దానినే వాలిని చెప్పమన్నచో నది యెట్లుండును? ఇది వాల్మీకి దోషము కాదు. లోకములో జరిగెడి కథలయందు సహజముగా నున్న దోషము'.

మరొక గొప్ప మాట. కవిత్వం రసానుభూతిని కలిగిస్తుంది. కానీ కవి జీవిత విశేషం బుద్ధిని మాత్రం చమత్కృతం చేస్తుంది. రసానుభూతిని కలిగించే శక్తిలేదు. నాకు బొత్తిగా తెలుగులో చెప్పడంరాదు. It may not be good poetry, but it qualifies the poet.

విశ్వనాథవారి రచనల్నీ, వారి అహంకారాన్నీ, పెళుసుదనాన్నీ ఎరిగిన వారికి ఆయన మాటల్లో చదువుతూంటే నాలాంటి వాడికి వెర్రెక్కుతుంది: 'మనస్సులో చచ్చెడు యహంకారము. నేనెవ్వరికిని నపకారాము చేయను. చేయలేను. నా మొగము చూచినచో, నేను మాటాడెడు పద్ధతిని తిలకించినచో వానికి నే నహంకారినని పొగరుబోతునని యూహ కలుగుట... వానికి శారీరకముగా శిక్ష చేయవలెనన్న ఊహ ఏర్పడును.. వాడుక భాషలో చెప్పినచో వానిని తన్నవలెననిపించును. ఈ స్థితి నా కుండెడిది.'

అయితే దానికి కారణాన్నీ వారే చెప్పుకున్నారు. వారి ఊరు నందమూరులో 'మేమే ప్రభువులము. ఆ గ్రామము మాది. ఈ కారణములచేత మాకుదురులో

నొక దురహంకారము - ఒక ఠీవి - ఎవడన్నను లెక్క చేయని యొక లక్షణము, చప్పున మాట తూలుట - మన మాటయే సాగవలయునన్న యొక అహంకారము కలవు. ఈ లక్షణములు నాలో క్రమక్రమముగా వృద్ధిపొందినవి.'

వారి ఊరు నందమూరు మనకి తెలియకపోతే - ఈ పుస్తకం చదివితే చాలు రవిగాంచని ఎన్నో వైభవాలను వివరిస్తారు. ఆ ఊరి పంటపొలాలు, చావిళ్ళు, వ్యక్తులు - అంతా కళ్ళ ముందు నిలుస్తారు. వారి ఋతుసంహారంలో కనిపించే ప్రతీ మేఘం, వర్షించిన ప్రతీ వర్షపు చినుకూ, తడిసిన ప్రతీ గడ్డి పరకా - చిన్న తనం నుంచీ వారి అనుభవంలోకి తొంగి చూసినవేనని మనకి తెలుస్తుంది.

మల్లంపల్లి సోమశేఖర శర్మగారు, మద్రాసు విశ్వవిద్యాలయంలో చరిత్రశాఖ అధ్యాపకులు నట్లూరి వెంకట రమణయ్య గారు ప్రతి దినం విశ్వనాథం వారు రాసిన పద్యాలను విని 'మెచ్చుకొనలేక విరగబడి పోయెడివారు' అన్నారు. ఆ గ్రంథాన్ని మల్లంపల్లి వారికి 1924 ప్రాంతంలోనే అంకితం యిస్తూ 'డిగ్రీలు లేని పాండిత్యం.. వన్నెకు రాని పాడు కాలాన బుట్టి' అన్న పద్యాలు రాసినట్టు ఉటంకించారు.

వారు చదువుకి వెళ్ళిన వెలినూతల నుంచీ నాగవరప్పాడి ప్రయాణాన్ని ఇలా చెపుతారు: 'కొత్తగా కాలువకు ప్రతీ ఏడు నీరు వచ్చును. అది పెద్ద పండుగ. అయిదారు దినములూరంతయూ బిందెలు పుచ్చుకుని ఈ మైలున్నర నడిచి కాలువకు బోయి స్నానాలాడి తబకలాడి తవ తమ కనుకూలమయిన పాత్రలలో - తియ్యని కృష్ణ నీరు తెచ్చికొందురు, అప్పటికి మింటిలో మెయిళ్ళు పట్టవు. నీటి కెబ్బడనము లేదు. నీరు కొబ్బరిపాల వలెనుండును' - ఇలాంటి తెలుగు భాష, ఇంత చక్కటి నుడికారం ఇంగ్లీషు మరిగిన ఈ తరానికి అరగని భోజనం. ఈ అనుభవంతో వారు తన కల్పవృక్షములో భగీరథుడు తెచ్చిన గంగానది వర్ణన చేశానంటారు.

జీవితంలోని వ్యక్తులు కావ్యాల్లో పాత్రలెలా అవుతారో విశ్వనాథవారు చేసి చూపారు. 'మా నాయనమ్మ వృద్ధురాలు. మానాయనగారు ఇందుపల్లిలో మాకు వంట చేయుటకు మా నాయనమ్మను పెట్టెను. ఆ ఊరిలో పురాతనమయిన యొక విష్ణ్వాలయమున్నది' - ఆవిడ గురించి తెలుసుకోవాలంటే ఆయన ప్రథమ కళత్రం పోయాక వ్రాసిన వరలక్ష్మీ త్రిశతియనే వియోగ కావ్యం చదవాలి.

కొల్లూరు దగ్గర అనతవరము అనే గ్రామం ఉంది. అక్కడ విశ్వనాథ వారి అన్నయ్య మేనమామ సీతారామశాస్త్రిగారు భిక్షాటనము చేసుకుని బతికేవాడు. ఆయన వైశ్వదేవపరుడు. జన్మలో రైలెక్కలేదు. అగ్నిహోత్రము మానలేదు. బ్రాహ్మణుడు ఆపద్ధర్మముగా వ్యవసాయము చేయవచ్చుగాని భిక్షాటనము వదిలి పెట్టి మరియొక వృత్తి చేయరాదన్న నియమమును జీవితాంతము నెరిపినవాడు. విశ్వనాథవారి తండ్రి పేరు శోభనాద్రిగారు. విశ్వనాథవారి మాటల్లో వారి పెళ్ళి ఎలా జరిగిందో చదవండి: 'ఆయన మా నాయనగారి మీద నొక నింద వేసెను నేను భిక్షాటనము చేయువాడను అని శోభనాద్రిగారు నా మేనల్లునికి నా కూతురునిచ్చుకొంద మనుచుండగా తాము సంపత్తు కలవారని నా సంబంధము చేసినాడు' శోభనాద్రిగారు ఆయన వద్దకు పోయి 'ఓరీ శాస్త్రులు! నాకా ఊహ లేదు. నీవు పేదవాడివని నీయందు తక్కువ చూపు లేదు. నీ కూతురును నాకొడుకునకు చేసికొందును' - అని చెప్పి - చెప్పుట ఏమి లగ్నము పెట్టుట ఏమి! ఇంటికి వచ్చుట ఏమి! మేము పదిపదేను బళ్ళమీద తరలి వెళ్ళుట ఏమి! వడ్లు దంపించి అయిదారు బస్తాల బియ్యంతో చేసుకుని తిరిగి వచ్చుట ఏమి!

రామాయణ కల్పవృక్షములో దశరథ మహారాజునందు 'మా నాయనగారి లక్షణము నిరూపించి వ్రాసితిని' అని చెప్పుకున్నారు.

నందమూరులో విశ్వేశ్వుని భక్తిగా తలుచుకుంటూ 'మా స్వామికి నా కవిత్వము నిండా పట్టాభిషేక మొనర్చితిని. కల్పవృక్ష ప్రతి ఖండాంతరమునందు మా విశ్వేశ్వర స్వామియే యున్నాడు... మా నాయనగారి శివ భక్తి నా శివ భక్తి మా స్వామి నన్నేలికున్న లక్షణ్ము సువుదితము కాగలదు' అన్నారు.

ఈరోజుల్లో కులాలు మనుషుల్ని విడదీసి స్పర్థలు పెంచుతున్నాయి. కాని ఆనాటి వ్యవస్థ ఎంత గొప్పగా సాన్నిహిత్యాన్ని పెంచుకుందో చెప్పడానికి ఆత్మకథలో రెండు ఉదాహరణలు. 'ఈ దినములలో ఆ కులము పేరు చెప్పుట తప్పు. కానీ ఊరందరు సాలె శేషయ్య అనెడివారు. పిల్లలము మేమనుటకు వీలు లేదు. ఆయన వరుసకు మాకు పినతండ్రి. శేషయ్య బాబాయి అనవలసినదే వట్టి పేరుతో నన్నచో నీవు శేషయ్యకు బొడ్డు కోసి పేరు పెట్టితివా శేషయ్య బాబాయి అనలేవా అని మా పెద్దవారు దండించెడివారు'.

వారి ఊరిలో బ్రహ్మన్న అనే కమ్మవారుండేవారు. వారి ప్రసక్తి: 'ఆయన వియ్యంకుడొకనాడు బ్రహ్మయ్యగారితో నన్నాడట! 'బ్రహ్మయ్యగారూ! అంతా బాగుగనే ఉన్నదికానీ ఈబ్రహ్మడు మిమ్ము'యేరా!' అనుట బాగాలేదు' అని. అప్పుడు బ్రహ్మయ్యగారు 'అది ఏమిటండీ! మేమిద్దరము మేనత్త మేనమామ బిడ్డలము. ఆయన నాకంటే తేలికగా ఏడెనిమిదేండ్లు పెద్దవాడు.. నన్ను గారనవచ్చునా! అన్నచో నాకు ఆయుష్షు నష్టము కదా! ఆయన నన్ను 'ఏరా' అని పిలుచుట మీ కిష్టము లేనిచో మా సంబంధము మాని వేయుడు'అని ...ఆ బ్రహ్మన్నగారు భార్య మీద కోపము వచ్చి అలిగి అన్నము తినకుండా పండుకున్నచో - వారి ఇంట్లో శేషమ్మ అత్త అని ఒకామె ఉండెడిది. ఆమె వచ్చి నాన్నతో చెప్పుట, ఈయన వెళ్ళి కోప్పడి జబ్బ పట్టుకుని లేవదీసి అన్నము తినిపించి మరీ ఇంటికి వచ్చెడివాడట.

ఈ వ్యవస్థ, ఈ అనుబంధాలూ నిన్న మొన్నటివని వినడానికే ముచ్చటగా, అపూర్వంగా ఉన్నాయి. ఆయన తన గ్రామ గురించి చెపుతూ 'పరమేశ్వరుని దయచేత నెవని జీవన సంపుటిలో కవితా శక్తియు, నార్ద్రతయు నుండునో అట్టివాడు మా గ్రామమున పుట్టినచో మహాకవి కాక చచ్చునా!! అన్నారు. ఇది నా అనుభవము. నేను పొందిన బాధ. నేను పడిన కష్టము. ఈ బాధకు నీ కష్టమునకు నేనిందెవరిని పేర్కొందునో వారు బాధ్యులు కారు.. అపకారము చేసినవాడో ఉపకారము చేసినవాడో నిమిత్తమాత్రుడన్న భావము నాకు దృఢమయినదని మనవి చేయుచున్నాను... ఈ గ్రంథములో నా ప్రధానమయిన ఉద్దేశమేమనగా - నా వైరాగ్యము నా భగవద్భక్తి నా సంప్రదాయబద్ధ బుద్ధి లక్షణము - కవితా విద్యయందు నేను పొందిన అభివృద్ధి..' చెప్పడం. అప్పటికి వారి వయస్సు 74 సంవత్సరాలు. ఈ ఆత్మకథని 1979 లో ప్రచురించారు.




# రెండు ఉత్తరాలు

## అనుభవాల కలంనుంచీ అనేక విషయాలు



నా జీవితంలో గొప్ప అదృష్టం - ఆలిండియా రేడియోలో ఉద్యోగం. నేనుఉద్యోగంలో చేరారని తెలియగానే చెలం గారు ఉత్తరం రాశారు. 'మీరు రేడియోలో చేరారని తెలిసి చాలా విచారించాను. "A delicate wasted in dirt" అని. మిత్రులు నవభారత్ ప్రకాశరావుగారూ నా మీద ఆశ వదులుకున్నారు. గవర్నమెంట్ ఉద్యోగం నాలోని రచయితని లొంగదీసి, కృంగదీస్తుందని -

కాని ఆ ఉద్యోగం ద్వారా మహామహులతో సాహచర్యం - అనునిత్యం మౌలికమయిన కృషి చేయాలనే స్ఫూర్తి, అందుకు వారి ప్రోత్సాహం - యివన్నీ నా సాహితీ జీవనాన్ని తీర్చిదిద్దాయి. నిజానికి ఈ 20 సంవత్సరాలలో రెండు భువనవిజయాలు ఓ యువ రచయిత జీవితాన్ని పరిపుష్టం చేశాయి.

మొదటి భువన విజయం హైదరాబాదు రేడియో స్టేషన్, దేవులపల్లి కృష్ణశాస్త్రి, నాయని సుబ్బారావు, మునిమాణిక్యం నరసింహారావు, బుచ్చిబాబు, శ్రీవాత్సవ, బాలాంత్రపు రజనీకాంతరావు, దాశరధి, వింజమూరి వరదరాజ అయ్యంగార్, మంచాల జగన్నాధరావు, స్థానం నరసింహారావు, రావూరి భరద్వాజ, ఉషశ్రీ శంకరమంచి సత్యం, తురగా కృష్ణమోహనరావు, పాకాల సావిత్రీదేవి, వేలూరి సహజానంద, పాలగుమ్మి విశ్వనాధం - ఇదీ వాతావరణం. రచనా వ్యాసంగాన్ని నమ్ముకున్న 20 యేళ్ళ యువకుడికి యింతకన్న సుక్షేత్రం మరొకటి దొరకదనుకుంటాను. అయిదేళ్ళు ఈ వ్యక్తులతో జీవనం ఓ తన్మయత్వం.

రెండవ భువనవిజయం - విజయవాడ రేడియో స్టేషన్. జలసూత్రం రుక్మిణీనాధ శాస్త్రి, ఆమంచర్ల గోపాలరావు, డాక్టర్ జి.వి కృష్ణారావు, వింజమూరి శివరామారావు, ప్రయాగ నరసింహశాస్త్రి, బందా కనకలింగేశ్వరరావు, ఎన్.సి.హెచ్. కృష్ణమాచార్యులు, కందుకూరి రామభద్రరావు, శ్రీరంగం గోపాలరత్నం, వోలేటి వెంకటేశ్వర్లు, నండూరి సుబ్బారావు, సి. రామమోహనరావు, ఎన్.సి.సి.హెచ్. జగన్నాధాచార్యులు - యిదీ వాతావరణం. ఇక్కడికి మళ్ళీ మిత్రులు ఉషశ్రీ, శంకరమంచి వచ్చి చేరారు. అప్పటికే లత పదవీ విరమణ చేశారు. వారితో సాహచర్యం మరో గొప్ప అవకాశం.

ఈ అతిరధులలో - నన్నుఅభిమానించి, అల్లంత దూరం నుంచే నా అభివృద్ధిని గమనిస్తూ, నన్ను ఆశీర్వదించిన పెద్దలు కందుకూరి రామభద్రరావుగారు. ఆయన నిండుకుండ, గంభీరమైన చిరుదరహాసం, ముక్తసరయిన పలకరింత, ఏనాడూ అనవసరమైన, వృధా ప్రసంగాలకి తావివ్వని సరళత్వం - అదీ రామభద్రరావుగారు. ఏనాడూ 'ఫోకస్' కోసం తాపత్రయపడడమో, ప్రోగ్రాం మీటింగులలో విరుచుకుపడడమో చేసేవారు. అది గంభీరమైన కితాబు నాలాటివాళ్ళకి. ముఖ్యంగా నాకు ప్రత్యేకమయిన స్ఫూర్తినిచ్చేది. ఆయన దేశభక్తి, సమాజ

అభ్యుదయకాంక్ష - ఇవన్నీ సరేసరి. లలిత సంగీత కార్యక్రమాలలో అవి గుబాళించేవి.

రామభద్రరావుగారి కుటుంబానికి, మా ఆవిడ చాలా సన్నిహితం. మా పిల్లలకోసం మాంటిస్సోరి స్కూలుకి వెళ్ళి, బడి వదిలే వరకూ వారింట్లో కూర్చునేది. వారి శ్రీమతికి మా ఆవిడంటే అభిమానం. ఇక ఆ కుటుంబంతో నాకు మూడు తరాల సాన్నిహిత్యం, కందుకూరి వారితో రేడియో ఉద్యోగం, శశాంకగారితో సాహితీ పరిచయం, దరిమిలాను వారబ్బాయి వోలేటి పార్వతీశంతో కలిసి కడప రేడియో ఉద్యోగం, అభిరుచి, సంస్కారం, విద్యుత్తు కలబోసిన కుటుంబాలవి.

రామభద్రరావుగారి పనుపునే అమలాపురం కాలేజీ వార్షికోత్సవాలకి వారబ్బాయి పుండరీకాక్షుడుగారు తీసుకెళ్ళగా వెళ్ళాను. ఏటేటా కందుకూరి వారి స్మృతి చిహ్నంగా ఆత్రేయపురం కళాశాల జరిపే ఉత్సవానికి నేనూ, శలాక రఘునాధ శర్మగారూ వెళ్ళాం. ఆ సందర్భంలో వారి స్వస్థలం రాజవరం వెళ్ళడం - అదొక మధురమైన జ్ఞాపకం.

కందుకూరి రామభద్రరావుగారితో నా సాన్నిహిత్యానికీ, వారికి నా పట్ల గల అవ్యాజానురాగాలకీ రెండు గొప్ప నిదర్శనాలు - వారు నాకు రాసిన రెండే రెండు ఉత్తరాలు. రెండు సందర్భాలూ నేను ఊహించినవి కావు - ముఖ్యంగా కందుకూరి వారి వంటి విద్యావేత్త నుంచి.

1969 సెప్టెంబరు 30న ప్రయాగ, కందుకూరి, గుమ్మలూరి సత్యనారాయణగారు - పదవీ విరమణ చేశారు రేడియో స్టేషన్ నుంచి. ఆ తర్వాత రామభద్రరావుగారు అమలాపురంలో వారబ్బాయిగారి దగ్గర ఉన్నారనుకుంటాను.

1970 సెప్టెంబరులో విజయవాడ రైల్వే ఇన్స్టిట్యూట్లో ఆంధ్రనాటక కళాపరిషత్ నాటకోత్సవాలు జరిగాయి. అది నాటకరచయితగా నా జీవితంలో మకుటాయమానంగా చెప్పుకోదగిన సందర్భం. పరిషత్ చరిత్రలో మొట్టమొదటిసారిగా అటు నాటకాలకీ ఇటు నాటికలకీ నా రచనలు - కరుణించని దేవతలు, కళ్ళు - ఉత్తమ రచన బహుమంతులందుకున్నాయి. రెండు వేర్వేరు న్యాయనిర్ణేతల బృందాలు ఈ బహుమతులను నిర్ణయించాయి. అందులో దాడి గోవిందరాజులు నాయుడుగారు. కె.రామలక్ష్మి, ప్రభాకరగుప్తా వంటివారున్నారు. కాగా, ఉత్తమ ప్రదర్శన - కళ్ళు, ఉత్తమ నటుడు - ఎమ్. వాసుదేవ మూర్తి (రెండు రెళ్ళు ఆరు), ఉత్తమ నటి - గూడూరు సావిత్రి (కరుణించని దేవతలు), ఉత్తమ నటుడు - ఎమ్.వి.రామారావు (కరుణించని దేవతలు). అదొక అపూర్వమైన ఘట్టం - నా జీవితంలో. సెప్టెంబరు 9న బహుమతి ప్రదానోత్సవం జరిగింది.

సెప్టెంబరు 16న కందుకూరి రామభద్రరావుగారు ఉత్తరం రాశారు. ఆ ఉత్తరాన్ని ఇంగ్లీషులోనే ఇక్కడ ఉటంకిస్తున్నాను:

"Believe me, I felt so glad that, mentally I was transferred to Vijayawada for a couple of minutes. I know this is not the be-all and end-all of your achievements. As time advances and life deepens, your special talent for writing intellectual plays carries you into higher and much greater recognition. The late Amancharla Goplalarao used to discuss your plays with enthusiasm and admiration. "

ఎంత గొప్ప ఆశీర్వాదం! వాక్శుద్ధిగల ఓ సాహితీస్రష్ట నోట పలికిన భవిష్యత్ వాణి అది!

జీవితం మరో ఆరు సంవత్సరాలు సాగింది. సినీ రంగంలో మరిన్ని సోపానాలు ఎక్కే అవకాశం లభించింది. విశ్రామమెరుగని పరుగు. ఒకే దూకుడు. ఒకే లక్ష్యం వేపు దృష్టి సారింపు. సాహితీ జీవితం గంభీరమైన రచనా వ్యాసంగం నుంచీ మామూలు సామాజికుడిని అలరించే మీడియం వైపు మొగ్గు చూపింది. అది కోరి చేసిన ప్రయాణం కాదు. సినీమా తనకు తానే నావేపు దూసుకు వచ్చిన ప్రభంజనం.

ఆ సమయంలో అనుకోకుండా రామభద్రరావుగారి నుంచీ రెండో ఉత్తరం వచ్చింది. అది కాస్త నాకాశ్చర్యమూ, ప్రత్యేకమైన ఆనందమూ కలిగించిన విషయం. కారణం - ఓ నాటక రచయితని అభినందించడం మొదటి ఉత్తరం ఉద్దేశమైతే - ఈ మీడియంతో ఏ మాత్రమూ సంబంధం లేని రామభద్రరావుగారి

లాంటి సాహితీపరులు నా సినిమా వ్యాసాంగాన్ని అభినందిస్తూ ఉత్తరం వ్రాయడం.

తేదీ 28.8.76 విషయం" ఈ మధ్య మీరు మాటలు వ్రాసిన కొన్ని సినిమాలు చూశాను. అవి చాలా రక్తిగా ఉన్నాయి. ఆ సంభాషణలు నడపడంలో, ఊహా పోహలలో, ఉక్తివైచిత్రిలో ప్రతిభావంతమైన మీ ప్రత్యేకత స్పష్టంగా కనిపిస్తుంది. మానవ స్వభావాన్ని మెరిపిస్తూ, రక్తిని ఉన్నతస్థాయిలో చిత్రమంతా నిలబెడుతుంది. ఇందుమూలంగా మీరు సంఘానికి ఎనలేని సేవచేస్తున్నారని, ముందితోధికంగా చేస్తూ చాలా ప్రతిష్టనార్జిస్తారని విశ్వసిస్తున్నాను'.

ఇది నా సినీ రచన మీద నాకందిన అతి గొప్ప ప్రశంసగా భావిస్తాను. ఇప్పటి సినీ రచయితలూ, దర్శకులూ - అంతా - ఈ వాక్యాలు గుర్తుంచుకోవాలంటాను. 'ఆ సంభాషణలు - రక్తిని ఉన్నత స్థాయిలో చిత్రమంతా నిలబెడుతుంది.' అన్నది.

రక్తికోసం నానా దేబిరింపులూ, కేవలం నేలబారు స్థాయిలో సాహిత్యాన్నీ, నటననీ (ఈ రెండూ ఈనాటి సినిమాల్లో అవసరమని చాలా మంది భావిస్తున్నారని అనుకోను) దిగజార్చే తరుణంలో - నిన్నటి తరం పెద్దమనిషి వ్రాసిన ఈ సమీక్ష అందరికీ కనువిప్పుగా, నాకు అపురూపమయిన కితాబుగా భావిస్తాను.

సరిగ్గా నలభై రోజుల తరువాత రామభద్రరావుగారు కన్నుమూశారు. ఈ ఉత్తరం నా హితైషి ఆఖరి ఆశీర్వాదంగా భావిస్తాను నేను.

### సరదా..సరదాగా

*పార్వతమ్మ గారు హడావిడిగా లలితమ్మ గారి దగ్గరకొచ్చారు.*

*"ఏమండీ! విశాలాక్షిగారికి నేను ఎవరితోనూ చెప్పొద్దన్న రహస్యం మీరు చెప్పేశారని ఆవిడ నాతో చెప్పింది. నిజమేనా?"*

*"నిజమేననుకోండి! కానీ నేనావిడకు రహస్యం చెప్పేసిన విషయం మళ్ళీ మీతో చెప్పొద్దని ఆవిడతో అప్పుడే చెప్పానుగా!" చిరాకుగా అంది లలితమ్మ గారు.*

*"సరే పోనీలెండి! అయిందేదో అయింది. మీరావిడకు చెప్పిన రహస్యం ఆవిడ మళ్ళీ నాతో చెప్పిన విషయం గురించి నేను మీతో చెప్పినట్లు మళ్ళీ ఆవిడతో చెప్పకండి..!"*

*యర్రంశెట్టి శాయి*




# సినీరచన - నాడూ, నేడు

## అనుభవాల కలంనుంచీ అనేక విషయాలు



1931 లో 'భక్త ప్రహ్లాద' నాటకాన్ని కెమేరా ముందు ప్రదర్శించారు. ఎంతో కొంత సినీమా గురించి అవగాహన ఉన్న పెద్ద మనిషి, ఓ ఎడిటరూ దాన్ని ప్రదర్శన యోగ్యం చేశారు. నాటకాన్ని చూడటానికి అలవాటు పడిన ప్రేక్షకులు - అదే నాటకాన్ని, నటుల్నీ, పద్యాల్నీ తెరమీద కదిలే బొమ్మలు చూపుతుంటే అబ్బురంగా చూసి ఆనందించారు. ఈ విధంగా సినీరంగంలోకి దొడ్డిదారిన నాటకరంగం ద్వారా సినీ రచయిత రంగ ప్రవేశం చేశాడు.

అలనాడు సి.పుల్లయ్యగారు 'పాదుక' నాటకంలో నటించిన నటుల్ని కలకత్తా తీసుకెళ్ళి కెమేరా ముందు నిలిపారు. ఆ రోజుల్లో ఎవరికీ సినీమాకి కావలసిన ఇతివృత్తాన్నో, ప్రక్రియనో తయారు చేసుకోవాలనే ఆలోచన ఉన్నట్టు కనిపించదు. కొత్త ప్రక్రియని లొంగదీసుకోవటం, ప్రేక్షకులు ఆనందించే ఇతివృత్తాలను అందించడం - ఇదే లక్ష్యం. అదృష్టవశాత్తూ - ప్రేక్షకులు ఆనందించే ఇతివృత్తాలు మృష్టాన్న భోజనాలలాగ నాటకరంగంలో కనిపిస్తున్నాయి. ప్రఖ్యాత హాలీవుడ్ దర్శకులు సిసిల్ బి.డి.మిల్లీ ఓసారి 'టెన్‌కమాండ్‌మెంట్స్' గురించి ప్రస్తావిస్తూ "రెండు వేల సంవత్సరాలుగా జన బాహుళ్యంలో ఉచితంగా పబ్లిసిటీ సంపాదించిన క్రీస్తు కథని నేనెందుకు వదులుకోవాలి?" అన్నారు.

చాలా మందికి కోపం రాకుండా ఉంటే - నిన్న మొన్నటి దాకా అప్పుడప్పుడు - అలవాటు మరిచిపోతే తప్ప నటులూ నాటకాన్నే కెమేరా ముందు ప్రదర్శిస్తున్నారు. Cinema is an accident on the screen. ఇలా చెపుతున్నప్పుడు - మన రచయితల, దర్శకుల సామర్థ్యాన్ని కించపరచడం ఉద్దేశం కాదు. ఎందుకనో మొదటి నుంచీ - కేవలం సంభాషణలు రచన చేసే పని రచయితదీ, వాటిని తెరమీదకి మలిచే పని దర్శకునిదీ అయి కూచుంది. This has become an unwritten rule.

నిజానికి - సినీమాని కాగితం మీద చిత్రించే దర్శకుడు రచయిత, సెల్యులాయిడ్ మీద రచించే రచయిత దర్శకుడు అన్నాను నేను. మంచి సినీమాలో ఈ రెండు పనులూ ఇద్దరూ చేస్తుండాలి. లేకపోతే ఆ చిత్రం రాణించదు.

స్క్రీన్‌ప్లే సాధారణంగా ముగ్గురు కలయికతో రూపుదిద్దుకుంటుంది. ముగ్గురి మేధస్సు సమన్వయం అది. రచయిత, దర్శకుడు, ఎడిటరు. గొప్ప స్క్రీన్‌ప్లేలన్నీ ఈ ముగ్గురి సమన్వయంతో తయారయినవే. ఏ విదేశీ చిత్రంలోనయినా ఈ ముగ్గురి పేర్లూ లేనిదే స్క్రీన్‌ప్లేని పేర్కొనడం జరగదు. 'షిండ్లర్స్ లిస్ట్' లాంటి అద్భుతమైన చిత్రానికి స్టీవెన్ స్పీల్‌బర్గ్ ఆస్కార్ బహుమతిని పుచ్చుకుంటూ ఆ చిత్రానికి స్క్రీన్‌ప్లే రాసిన రచయితకి పెద్ద పీట వేసారు.

ఎర్నెస్ట్ లేమన్, ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్, ఎల్మర్ రైస్, టెన్నిసీ విలియమ్స్, షిడ్నీ షెల్డన్ గొప్ప స్క్రీన్‌ప్లే రచయితలకి ఉదాహరణలు. స్క్రీన్‌ప్లే లో ఎడిటింగు అవగాహన ప్రాణపదం, ఆయువుపట్టు. అందుకనే గొప్ప ఎడిటర్స్ గొప్ప దర్శకులు కావడాన్ని చరిత్ర చెపుతుంది. బిమల్‌రాయ్, హృషీకేశ్ ముఖర్జీ,

రాజకపూర్, ఆదుర్తి సుబ్బారావు లాంటి వారిని ఇక్కడ గుర్తుచేసుకోవచ్చు.

20th Century Fox అధినేత డెరిల్ జానక్ ఒకప్పుడు మామూలు రచయిత. రచయితగా హాలీవుడ్‌లో రాణించలేకపోయాడు. తర్వాత ఫాక్స్ స్టూడియోల అధినేత అయాడు. ఆయన కాంట్రాక్టులో ముఖ్యభాగం - ఏ దర్శకుడు ఎంత గొప్ప చిత్రాన్ని తీసినా చివరలో దాన్ని ఎడిట్ చేసే హక్కు ఆయనదే. ఆకారణంగానే ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ ఆ స్టూడియోకి చిత్రాలు తీయడానికి నిరాకరించాడు.

నేను అన్నపూర్ణా ఆఫీసులో మొదటిసారిగా కె.వి.రెడ్డిగారి 'దొంగరాముడు' స్క్రీన్‌ప్లే చదివాను. అద్భుతమైన స్క్రీన్‌ప్లే రచయితలలో కె.వి.రెడ్డిగారొకరు. అయితే దక్షతతో ఇందాక చెప్పినట్టు కాకపోయినా, మనసులో ఒక రూపాన్ని దిద్దుకుని కాగితం మీద దాని స్వరూపాన్ని తెచ్చే మరో గొప్ప స్క్రీన్‌ప్లే రచయిత కె.ఎస్.ప్రకాశరావుగారు. నా ఉద్దేశంలో 'తాసిల్దారుగారమ్మాయి' ఒక నమూనాగా చెప్పుకోదగినంత విలక్షణమయిన స్క్రీన్‌ప్లే. నా అనుభవంలో స్టూడియోలో అడుగుపెట్టే ముందు నిర్దుష్టంగా కెమేరా కదలికలతో సహా పేపరు మీదకి తెచ్చుకునే మరో డైరక్టరు ఒకాయన ఉన్నారు. ఆయన ఎన్టీరామారావు. ఆయన రామాయణం స్క్రీన్‌ప్లేని, సంభాషణల్ని నాకు స్వయంగా చదివి వినిపించగా విన్నాను. ఎప్పుడో బాపూగారు డైలాగ్ పేపరు మీద ఆయా షాట్ల స్కెచెస్ వేసుకోవడం చూశాను. అలాంటి పనినే సత్యజిత్ రే చేసేవారట. ఇదంతా విపులంగా చెప్పడానికి కారణం - అందరూ ఒకే విధంగా స్క్రీన్‌ప్లే రాసుకోనక్కర్లేదు. ఒక్కొక్కరికి ఒక్కో ఒడుపు ఉంటుంది. వైవిధ్యం ఉంటుంది.

కానీ దురదృష్ట వశాత్తూ మన రచయితలకి షాట్ గురించి ఆలోచించే అవకాశాన్ని కూడా ఏ దర్శకుడూ కల్పించినట్టు కనిపించదు. నా తరంలో మాట నేను చెప్పేది. "మీరు సంభాషణలు రాసి ఇవ్వండి సార్ దర్శకుడు వాటిని చూసుకుంటారు" అంటారు. కానీ దర్శకుడు చెయ్యాల్సిన పని రచయిత ముందుగా పేపరు మీద చెయ్యాలని చాలా మందికి తెలియదు. మీరు క్షమిస్తే చాలా మంది దర్శకులకే తెలీదు.

మన సినీరచనకి ఓ ఉదాహరణని ఉట్టంకిస్తాను. సాధారణంగా మన రచయిత ఇలా రాస్తాడు.'

'పెద్ద భవనం అది. పోర్టికోలో కారు వచ్చి ఆగింది.

భవనం మెట్ల మీద ఒకావిడ నిలబడి ఉంది.

కారులోంచి శేఖర్ దిగాడు. సరాసరి వెళ్ళి ఆమె కాళ్ళకి నమస్కరించాడు.

శేఖర్: అమ్మా!

నవ్వు వినిపించింది. శేఖర్ ముఖంలో ఆశ్చర్యం.

అటు చూశాడు. వామనరావు దగ్గరికి వచ్చాడు.

వామన: ఆమె అమ్మ కాదు బాబూ, అమ్మ అని పదిమందిని నమ్మించడానికి నేను నిలబెట్టిన బొమ్మ. ఇక నుంచీ ప్రపంచానికి ఆమే నీ అమ్మ.

శేఖర్ ముఖంలో షాక్.

ఇదీ ధోరణీ. నిజానికి స్క్రీన్‌ప్లే ఇలా సాగాలి.

వైడ్ యాంగిల్ షాట్ - పెద్ద భవనం.

కెమేరా పోర్టికో మెట్ల మీద నిలబడిన స్త్రీ వెనుక ఉంది. (సజెషన్ షాట్)

అంటే ఫ్లోర్ గ్రౌండులో స్త్రీ వీపు తెలుస్తోంది. దూరం నుంచీ కారు కెమేరా వైపు వస్తోంది. పోర్టికోలో ఆగింది.

మిడ్ షాట్ - కారులోంచి శేఖర్ దిగాడు. కెమేరా వైపు చూశాడు.

కౌంటర్ మిడ్ షాట్: స్త్రీ మూర్తి తెలుస్తోంది. ఆమె ముఖం మీద నీడ. ముఖం స్పష్టంగా తెలియడం లేదు.

దాదాపు ఇలా సాగాలి. నిజం చెప్పాలంటే చాలా మంది సినీ రచయితలు ట్రాలీ గురించీ, టాప్ యాంగిల్ షాట్ గురించీ ఆలోచిస్తారనుకోను. ఆపని డైరెక్టర్‌దీ అని వారి భావన. నిజానికి చాలామంది భావన అదే.

మొదట్లో సినీమా టెక్నిక్ బొత్తిగా వంట పట్టని రోజులు. అయినా సినీమాల్ని ప్రజలు ముమ్మరంగా చూశారు. ఎందుకు? తెరమీద కదిలే బొమ్మల కొత్తదనం. అంతకుమించి తమకు ఇదివరకే తెలిసిన - స్టేజి నటులు చూపే నటన అవే సన్నివేశాలు.

ఇంకా చెప్పాలంటే ప్రజాజీవనంలో నలిగిన పౌరాణిక, చారిత్రిక ఇతిహాసాలూ, కథలూ - పల్నాటి యుద్ధం, బొబ్బిలి యుద్ధం, కాశీమజిలీ కథలు, కాటమ రాజు కథ, దేశింగు రాజు కథ - ఏదయినా కానీ. ఇతివృత్తం సినీమాకి బలమైన గ్యారంటీ. టెక్నిక్ లోపాల్ని భర్తీ చేసే ఆయుధం. ప్రజల మోజు మరొక గొప్ప ఊతం.

మెల్ల మెల్లగా సాంఘిక సమస్యలు, ఇతివృత్తాలు వచ్చాయి. అవీ బలమయిన, అతి స్థూలమయిన ప్రాచుర్యంలో ఉన్న ఇతివృత్తాల నకళ్ళు. పురాణ పురుషులకి మోడరన్ చొక్కాలు తొడిగారు. శ్రీరాముడు అవతార పురుషుడు. ఏకపత్నీవ్రతుడు. రామారావు ఆదర్శమూర్తి. ఏకపత్నీ వ్రతుడు. తగాదా లేదు. అర్జునుడు అన్నగారి మాట జవదాటడు. వెంకట్రావు అన్న రాఘవయ్య మాట జవదాటడు. హరిశ్చంద్రుడి సత్యవాక్య పరిపాలనకే అంతిమ విజయం. అప్పలాజు నిజాయితీకే అంతిమ విజయం. ఇవన్నీ స్థూలమయిన మెలోడ్రామాలు. సావిత్రి యముడితో పోరాడి మొగుడి ప్రాణాన్ని రక్షించుకున్న మహా పతివ్రత. అప్పలమ్మ కూడా అంతే. ఆమె చివరలో గ్రామ దేవత అయింది. హిందీలో అయితే 'మదరిండియా' అవుతుంది. ఈ కథ రాణించకుండా పోయే అవకాశం లేదు. రావణుడు చివరికి మరణించాలి. అతను దుర్మార్గుడు కనుక. మోతుబరి నాగరాజూ మరణించాలి. అతడు చెడు ప్రవర్తన కలవాడు కనుక. పేర్లు స్టైబిలైజ్ అయిపోయాయి. దుర్మార్గులంతా - నాగరాజు, ఫణీంద్ర, జగ్గూలు. హీరోలంతా - సత్యం, రామారావు, శివయ్య, విష్ణుమూర్తి. స్త్రీలయితే సీత, సావిత్రి, అనసూయ, పద్మిని. ఇవన్నీ గ్యారంటీ ఇతివృత్తాలు. హీరో 'సత్యానికే జయం' అని పాట పాడతాడు. హీరోయిన్ మంగళ సూత్రం తన ప్రాణం కన్నా ఎక్కువని ఆవేశపడుతుంది. పాతివ్రత్యాన్నీ, ఏకపత్నీవ్రతాన్నీ, వెంకటేశ్వరస్వామిని సినీమావాళ్ళు వాడినంత విరివిగా నిజజీవితంలోనూ ఎవరూ ఉపయోగించరేమో. ఇవి ఆయువుపట్లు.

అయితే సమాజ ధోరణి మారి అవినీతి, అక్రమాల ప్రభావం హెచ్చినప్పుడు మరికొన్ని కొత్త ఇతివృత్తాలు ఉద్భవించాయి. వీటిలో పీడించే పంచాయితీ ప్రెసిడెంటు నాశనం కావాలి. రిక్షా లాగే యాదగిరికి న్యాయం, జరగాలి. ఎర్రజెండా మీద పాట ఉండాలి. డప్పు మోగాలి. జనసందోహం ఊరేగాలి. ఇది సినీమావారికి తెలిసిన, లేదా ప్రేక్షకుడిని బులిపించగల మరో మత్తుమందు. సమస్యకి పరిష్కారం విధ్వంసమే. ఇది గల్లా పెట్టిని దృష్టిలో ఉంచుకుని ప్రేక్షకులకి మప్పిన స్టయిలైజ్డ్ వామ పక్ష సిద్ధాంతపు సినీమా రుచి.

అంటన్ చెఖోవ్ 'స్లీప్', డోస్టవిస్కీ 'ఓవర్‌కోట్' స్థాయి కథలు ఎవరికీ అక్కరలేదు. వారికి కావల్సింది crude generalisation. ఆ మాటకి వస్తే ముందు చెప్పిన కథలూ అంతే. కాలేజీ లెక్చెరర్ దగ్గర్నుంచీ, మిల్లు కూలీదాకా, ఆఫీసు ఉద్యోగి నుంచీ, ఇల్లాలి వరకూ చిత్రం రక్తి కట్టాలంటే ఇతివృత్తం వీలయినంత జనరలైజ్ కావాలి.

న్యాయం వర్ధిల్లాలి అనడం సుళువు. అది అందరూ ఆశించే, అర్థంచేసుకునే స్లోగన్.

కాగా సినీమా ప్రేక్షకులు - ఎక్కువగా మధ్యతరగతి, క్రింది తరగతి వర్గానికి చెందినవారు. వీరికి జీవితంలోనూ, కళలోనూ మెలోడ్రామాయే ప్రాణం. ఏనాటికయినా దుర్మార్గుడయిన ఆఫీసరు బదిలీ కావాలని, డబ్బు ఎగ్గొట్టే రిక్షా యజమాని కాలు విరగాలని - తద్వారా అతనికి బుద్ధి రావాలని ఆశిస్తాడు. తను నిత్య జీవితంలో చెయ్యలేనివీ, చెయ్యాలని కలలు కనే పనులన్నీ తెర మీద హీరో చెయ్యడం అతనికి ఉపశమనం. దొంగ సెక్యూరిటీ!

రాణించిన ఇతివృత్తాలు పదే పదే పేర్లు మార్చుకుని ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. నేనే నా కెరీర్‌లో ఓ కథని నాలుగుసార్లు రాశాను. అన్ని పౌరాణిక ఇతివృత్తాలకీ సాంఘికమయిన నమూనాలు వచ్చాయి. అవి రాణించాయి. ఉమ్మడి కుటుంబం, భర్త పోయిన పతివ్రత కథ, పట్టెడన్నం తిన్న స్వామి భక్తి, దేశభక్తి, త్యాగం - ఇవన్నీ సేఫ్ కథలు.

పతివ్రత శ్రీలక్ష్మమ్మ కథని ఇద్దరు నిర్మాతలు ఒకేసారి తీశారు. రైతుల కథలు కోకొల్లలు. పీడిత వర్గ విజయాల మీదే కొందరు బాంకు ఎకౌంట్లు పెంచుకున్నారు. కమ్యూనిస్టు నిర్మాతలు కూడా

వెంకటేశ్వర స్వామి మీదే ముహూర్తం షాట్ తీశారు. నిజానికి వెంకటేశ్వరుడు సినీమా వారికి కొంగు బంగారం. ఇది వారికి హిపోక్రసీ కావచ్చు. కాని ప్రేక్షకులకి అలవాటయిన ప్రపంచం.

పౌరాణిక ఇతివృత్తాలను దాటి సాంఘికాల వైపు నడిచిన రోజుల్లో కూడా రచనలో పౌరాణిక ఇతివృత్తాల ఛాయలు మిగిలాయి. 1940 ప్రాంతాల్లో వచ్చిన కాశీమజిలీ కథ గొల్లభామ. ఓ రాజుగారు గుర్రం మీదపోతూంటే ఆమె చల్లకుండ పగిలి ఆయన మీద చిందింది. కోపంగా చూశాడు.

రచయిత అక్కడ పద్యం రాశాడు.

*భూపతి చంపితిన్ మగడు భూరి భుజంగము జేత చిక్కెనే*
*ఆపద చెంది ఉదయార్కుని పట్టణ మేగి వేశ్యనై*
*పాపము గట్టుకొంటి, ఆట పట్టి విటుండయి రాగ జూచి*
*తాపము జెంది అగ్నిబడి దగ్ధముగాకిటు గొల్లభామనై*
*ఈ పని కొప్పుగొంటి, నృపతీ వగపేటికి చల్ల చిందినన్*

ఆరోజుల్లోనే కథంతా ఫ్లాష్‌బాక్‌లో చెప్పారు. అదీ అప్పటి పురోగతి.

ఇవాళ ప్రేక్షకులకి చెప్పు తీసి కొట్టినట్టు హత్తుకోవాలని 'నా సెల్యూలర్ ఫోనా, లేడీస్ టాయిలెట్ సోపా' అని రాస్తున్నారు గానీ - ఆ రోజుల్లో - అంటే ఛందస్సు నడుం విరగ్గొట్టమని కవులు రొమ్ములు విరుచుకున్న రోజుల్లో సాంఘిక ఇతివృత్తంలో పద్యం పాడితే రాణించింది. ఆ సినీమా ముమ్మరంగా వసూళ్ళు చేసింది.

మరీ 'ఘటోత్కచ అనే సినీమాలో రాక్షసులు 'పిబ మధురం, మనోహరం - పిబ జ్ఞతి పిబ పిబ ' అని పాడారు.

ఈ రోజుల్లో ప్రేక్షకులను రంజింపచేయడానికి దేబిరింపు ఎక్కువయింది. అభిరుచి దారిద్ర్యం చోటు చేసుకుంది. బాడ్ టేస్టుకి సినీమా వాళ్ళు సాకులు వెదుకుతున్నారుగానీ, ఈ దేశంలో 1940 ప్రాంతంలో పై పల్లవిని ప్రేక్షకులు చూశారు. ఆనందించారు.

ప్రేక్షకులకి అవసరమయిన ఇతివృత్తాన్ని గర్వంగా అలంకరించే దశనుంచీ ప్రేక్షకుల ఆనందానికి ఇతివృత్తాన్ని దొంగ తోవలు పట్టించే దశకి సినీమా జారిపోయింది. సినీమా కూడా క్రమంగా వినియోగ వస్తువయిపోయింది.

టెక్నిక్ ఊహించనంత గొప్పగా పెరిగిపోయింది. సాంకేతిక నిపుణులు ఏ దేశం వారికీ తీసిపోనంత స్థాయిని సాధించారు. కథ గ్లోబలైజ్ అయింది. విశాఖలో ఉద్యోగం చేసే వెంకట్రావు అనే హీరో సుగుణని ప్రేమించి స్విట్జర్లాండులో పాట పాడతాడు. పాడాలని ప్రేక్షకులు ఎదురుచూస్తారు. టెక్నిక్, డబ్బు, అలరించాలనే ఆతృత కారణంగా ఇతివృత్తం వల్గర్ అయింది Idealistic hero మారి dialectical hero వచ్చాడు. ఇతివృత్తంలో మెలో డ్రామాకి బదులు అట్టహాసం పెరిగింది. సమస్యలు వెనకబెంచీలోకి పోయాయి. ప్రజల ఆదర్శాల్లోంచీ ఆలోచనల్లోకి, అక్కడి వారి కలల్లోకి, వారి ఊహాగానాలలోకి ఇతివృత్తం పరకాయ ప్రవేశం చేసింది. తత్కారణంగా వాస్తవికతని పోగొట్టుకుంది. అయినా గిల్టు నగకి మెరుగులు దిద్దినట్టు టెక్నిక్ సినీమాకి అలంకరించి బుకాయించాలని చూస్తోంది.

టెక్నిక్ సహకారం లేని రోజుల్లో బలమయిన generalised themes, టెక్నిక్ మాత్రమే కాపాడే అవాస్తవికత దాకా సినీమా ప్రయాణం చేసింది. ఇది మన దేశానికీ, భాషకీ మాత్రమే కాదు ప్రపంచ సినీమాకీ - ముఖ్యంగా హాలీవుడ్‌కీ వర్తిస్తుంది. అయితే నలుగురితో చావు పెళ్ళితో సమానమని చంకలు గుద్దుకునే దురదృష్టమిది.

ఓ అన్నగారు తమ్ముడు ప్రేమించిన అమ్మాయినే ప్రేమించాడు. తమ్ముడు ప్రేమిస్తున్న కారణంగా అతని మీద ఈర్ష్యనీ, అసహనాన్నీ పెంచుకున్నాడు. ఆ పిల్లను అనుభవించబోయాడు. గ్రహించి ఎదురించబోయిన తమ్ముడిని చంపాడు. తెలుసుకున్న ఆ అమ్మాయి అతన్ని చంపింది. ఈ కథని ప్రస్తుతం తమిళ ప్రజలు ముమ్మరంగా చూస్తున్నారు. డబ్బింగ్ చేసిన చిత్రాన్ని తెలుగు ప్రజలూ చూస్తున్నారు. పాదుకా పట్టాభిషేకం నుంచీ మనం ఎంతదూరం ప్రయాణం చేశామో గుర్తుచేసుకోవడానికి ఇది ఒక సైన్ పోస్ట్.

భార్య పురిటికి వెళ్ళింది. భర్త ఓ అందకత్తె వ్యామోహంలో పడ్డాడు. సుఖాల్లో మునిగి తేలాడు. భార్య తిరిగి వచ్చింది.

అందకత్తెని వదిలించుకుందామనుకున్నాడు. ఆమె వదలలేదు. వెంట బడింది. వేధించింది. చివరికి ఆమెని చంపవలసి వచ్చింది. ఇదీ ఓ అక్రమమైన మెలోడ్రామాయే. దుర్మార్గం నశించింది కనుక. కానీ ఇందులో సెక్సుని అలంకరించారు అద్భుతమైన టెక్నిక్‌తో. ఆ సినీమా పేరు బేసిక్ ఇన్‌స్టింక్ట్. బేస్ ఇన్‌స్టింక్ట్ కూడా!

సినీమా అందమైన కత్తి. అతి క్రూరమైనకత్తి. అప్రమత్తంగా ఉండకపోతే పీకని కత్తిరిస్తుంది. టెక్నిక్ 'చెడు'నీ గ్లామరస్‌గా తీర్చి దిద్దగల Good technique, more often than not, over emphasizes the idea. If you cannot quallfy the idea, it hits the moral fiber of the society.

ప్రేక్షకుడి మీద ఈ ధోరణుల ప్రభావం ఏమిటి? ఈ ప్రశ్న ఎవరు వేసుకుంటున్నారు? ఎవరు వేసుకోవాలి?

Camera narrates truth 24 times per second అన్నాడు గొదార్డ్. సినీమానే నమ్ముకుని అమ్ముకుంటున్న టీవీ ఛానళ్ళు they are narrating truth 40 times per second అంటాను. ఆ truth distort అయి, distortion glamorize అయి, అమ్మకదారుడి చేతిలో పడినప్పుడు సమాజం గతి ఏమిటి?

ఏమో, ఈ ప్రశ్నకు ఎవరు సమాధానం చెప్పాలో తెలియదు!

*(హైదరాబాదు ఫిలిం క్లబ్బు స్వర్ణోత్సవాల సందర్భంగా జరిగిన సదస్సులో చదివిన ప్రసంగ పాఠం. తదుపరి తెలుగు సమాఖ్య చతుర్థ మహా సభల ప్రత్యేక సంచిక 'తెలుగు జగతి' లో ప్రచురితమైంది. )*

## సరదా..సరదాగా..!

*ఓ సుప్రసిద్ధ తెలుగు నటుడు ఓ గొప్ప పండితుని కలుసుకున్నాడు.*

*" నా నటనకు తెలుగు ప్రజలంతా బ్రహ్మరథం పడుతున్నారనుకోండి..అయితే ఒక్క అనుమానం పీడిస్తోందినన్ను!" అన్నాడు గంట బోర్ కొట్టి.*

*"ఏమిటది?" అడిగాడు పండితుడు.*

*"నేను ఈ రంగం నుంచీ నిష్క్రమించాకకూడా తెలుగు ప్రజలు నన్నింతగా ఆదరిస్తారంటారా?" అడిగాడతను.*

*"ఇంతకంటె ఎక్కువ ఆదరిస్తారు" అన్నాడు పండితుడు చిరునవ్వుతో..*

***

*బోనులో వున్న సినీ నటిని ఓ సారి పరీక్షగా చూసి " నీ వయసెంత?" అనడిగారు జడ్జిగారు.*

*ఆమె జవాబు చెప్పేలోగా మళ్ళీ ఠక్కున తనే అన్నారు.*

*"చూడమ్మా! అన్నీ నిజాలే చెప్తానని ఇంతకుముందే ప్రమాణం చేసి వున్నావ్! కనుక విషయం దృష్టిలో వుంచుకుని జవాబు చెప్పు.."*

*యువతి ఓ క్షణం లోచించి "ఇరవై రెండేళ్ళుపైన కొద్ది నెలలు.." అంది.*

*"కొద్ది నెలలు అంటే ఎన్ని?" అనుమానంగా అడిగారు జడ్జిగారు.*

*"నూట పద్నాలుగు!" అందామె తడుముకోకుండా..!*

*-యర్రంశెట్టి శాయి*




# విశ్వాసం

## అనుభవాల కలంనుంచీ అనేక విషయాలు



విశ్వాసం గుడ్డిది. ప్రేమించి **పెంచుకుంటే** దొడ్డది.

ఈ దేశంలో - బహుశా ఈ ఒక్క దేశంలోనే మహానుభావులు 'విశ్వాసం' కళ్ళు తెరిచారు. రామకృష్ణపరమహంస జీవితం, ఫ్రెంచి జిజ్ఞాసి పాల్ బ్రంటన్ అనుభవాలు, పరమ హంస యోగానంద ఆత్మకథ, స్వామీ రామా హిమాలయాల అనుభవాలు - ఇలా పరిశీలించగలిగితే ఋజువులు కోకొల్లలు. దాదాపు 50 ఏళ్ళ కిందటే సత్య సాయిబాబాని తన పత్రిక బ్లిట్జ్‌లో దుయ్యబట్టి, పరిశీలనకు నిలదీసి తదుపరి తానే భక్తుడయ్యాడు ఆ పత్రిక అధిపతి ఆర్.కె.కరంజియా.

ఇది ఒక పార్శ్వం.

మధురలో ఊరేగింపులు జరిపి రాముడు, కృష్ణుడు బొమ్మలకి చెప్పులు తొడిగి, నడిరోడ్డుమీద వాటిపై మూత్రవిసర్జన చేయించారు ఒకానొక నాయకులు రామస్వామి నాయకర్. యూదులతో చెమటోడ్చే ఒక వ్యక్తి - జీసస్- కి ముళ్ళ కిరీటం తొడిగారు ఆయన తరం ప్రబుద్ధులు. సోక్రటీస్‌కి విషం చేతికిచ్చి - ఆయన నమ్మని దేవుడిని ప్రార్థించమన్నారు. " ఓ దేవుడా! ( నీవంటూ వుంటే!) నా ఆత్మని (అదంటూ వుంటే) కాపాడు " అని ప్రార్థించాడు. మరొకరి విస్వాసానికి ఆ నాడు ఓ వేదాంతి అతి దగ్గరగా వచ్చిన 'బూతు' అది.!

ఈ మధ్య టి.వి. తెరవగానే "ఎవరి మహాత్ముడీయన?"(గాంధీ) అనే పెద్ద ప్రశ్న కనిపించింది. చాలా గొప్ప మేధావులు - మహాత్ముడు ఏ విధంగా - ఓ పరిమితమైన వ్యవస్థనే ప్రాభావితం చేశారో చర్చిస్తున్నారు. శుభం.. మనం చాలా దూరం ప్రయాణం చేశామని 'గర్వం' కలిగింది.

మొన్ననే 'తెలుగు తల్లి' ఎవరి తల్లి అని కొందరు రాజకీయ నాయకులు నిలదీశారు. గణతంత్రమూ, గాడిద గుడ్డూ అంటు మరికొందరు మేధావులు కోడిగుడ్డు మీద వెంట్రుకలు పీకారు.

ఇటీవలే 'వందేమాతరం' అనే జాతీయ గీతాన్ని మేం ససేమిరా పాడమని హైదరాబాదులోనే ఈ మైనారిటీ వర్గం(?) మొరాయించింది.

ఈ మధ్య సత్యసాయిబాబా గారు "దేశాన్ని చీల్చవద్దు" అన్నందుకు ఆయన పటాలకి చెప్పులు కట్టి, నిప్పు పెట్టారు. ఓ కుర్రాడు "నువ్వు దేవుడివైతే మా ప్రాంతానికి నీళ్ళియ్యి" అని కెమేరా ముందు ఆవేశపడ్డాడు. "ఆయన చాలా ప్రాంతాలకి నీళ్ళిచ్చారు బాబూ" అని చెప్పేవాడు పక్కన లేకపోయారు. దేవుడంటే నమ్మకంలేని, దేవుళ్ళకి చెప్పులు వేలాడదీసిన పార్టీనుంచీ వచ్చిన ఓ మేధావి ముఖ్యమంత్రి కరుణానిధిగారు " మా రాష్ట్రంలోకి తెలుగు గంగని 'పూండి' నుంచీ తెచ్చి పుణ్యం కట్టికోండి" అని బాబా గారిని అడిగారని పత్రికల్లో చదివాను.

ఇది రాజకీయ కాలమ్ కాదు. బాబాలని సమర్ధించడనికి తాపత్రయపడే కాలమూ కాదు. ఆ అవసరం బాబాకి లేదు. ఉన్నా ఆ పని నాది కాదు.

ఆదిశంకరులు 'అమ్మని' కీర్తిస్తూ - నేను మహా పాపిని. అయినా నువ్వు నన్ను ఆదరిస్తావని నాకు తెలుసు. ఎందుకంటే ఈ లోకంలో చెడిన 'కొడుకు'లుండవచ్చుకానీ మాతృత్వాన్ని కోల్పోయిన తల్లి వుండదు - అన్నారు.

"ఎవడబ్బ సొమ్మని కులుకుచు తిరిగేవు!" అని కోపంతో దూషించిన భక్తుడినీ స్వామి ఆదరించి అండగా నిలిచాడని పెద్దలు చెప్తారు. ఇలాంటి platitudes ఎత్తుకున్నప్పుడు కాదంటూనే నేనూ దేవుడిని వెనకేసుకు వస్తున్నానేమో నన్న అనుమానం కలుగుతోంది. అయితే నా లాంటి బలహీనపు మద్దతు దేవుడికి అక్కరలేదు.

రాజకీయ లబ్ధి - ఎవరికి సంబంధించినది వారికి వుండవచ్చు. ఒక మతం హిపోక్రసీ మీద మరో మతం వారికి కోపం ఎంతైనా వుండవచ్చుగాక. కాని చెప్పుల స్థాయి గురించే యీ నాలుగు వాక్యాలూ. ( దళితులకు కనీసం ప్రాథమికమైన జీవన సరళిని కల్పించలేని మతం మీద ఆగ్రహంతో ఒకాయన బౌద్ధాన్ని స్వీకరించారు. ఆయన పేరు అంబేద్కర్.)

ఇప్పుడు చాలా మంది పరాయి మతాల విగ్రహాలను కూలదోస్తున్నారు. శ్రీరంగంలో రంగనాథుడి ఆలయం ముందు పెరియార్ విగ్రహాన్ని నిలిపి పోలీసులు నిఘా ఉన్నారు.

మరొక్కసారి - యిది రాజకీయల గురించిన ప్రస్తావన కాదు. కాని, కేవలం సామాజికమైన రాజకీయమయిన ప్రయోజనాలకోసం- నైతికమయిన స్థాయిలో మాత్రమే ప్రశ్నించుకోవలసిన 'విలువల్ని' కూల్చుకుంటూ పోతే - తీరా లబ్ధిని సాధించాక - 'విలువల' స్థానంలో నిలపడానికి ఏమీ మిగలవు.


ఒక మహాత్ముడినీ, ఒక తల్లినీ, ఒక జాతీయ గీతాన్నీ, ఒక దేవుడినీ (అది ఎవరికి చెందిన వారయినా కానీ) కూల్చడం - వ్యవస్థల్ని నేలమట్టం చేయడం లాంటిది. ఒక సమాజ నేపథ్యంలోంచి కాదు - ఒక సంస్కృతిలోంచి, ఒక జాతి సనాతన ధర్మంలోంచి, జనజీవన కల్ప తరువుగా ఒక 'విశ్వాసం' రూపు దిద్దుకుంటుంది.

వ్యవస్థలో మార్పులకి ఎన్ని రకాలయిన పోరాటాలయినా జరపవచ్చు. కానీ వ్యవస్థనే కూల్చుకోవడం - వెన్నెముకని విరగ్గొట్టి 'కంటి'కి చికిత్స చేయడం లాంటిది.

ఆఖరుగా ఒక్కమాట -

విశ్వాసం దొడ్డది. ప్రేమించి, **పెంచకుంటే** గుడ్డిది.








# పొరుగింటి పుల్లకూర?!

## అనుభవాల కలంనుంచీ అనేక విషయాలు



ఇప్పుడుప్పుడు అణ్వస్త్రాల గురించి పేపర్లలో చర్చలు జరుగుతున్నాయి. అమెరికా, రష్యా, ఆస్ట్రేలియాల గొంతులు వినిపిస్తున్నాయి. ప్రపంచ చరిత్రలో ఇంతవరకు ఒకే ఒక్కసారి - భయంకరమైన పరిణామంతో అణ్వస్త్ర ప్రయోగం జరిగింది - జపాన్‌లో హిరోషిమా, నాగసాకీల మీద. మానవాళి అప్పటికీ ఇప్పటికీ నిశ్చేష్టమయిపోయింది. దాదాపు 60 సంవత్సరాల తర్వాత ఇప్పటికీ ధార్మిక శక్తి ప్రభావానికి విచ్చిన్నమయిపోతున్న జీవితాలు అక్కడ కనిపిస్తాయి. మా పెద్దబ్బాయి, మనుమలూ ఆ మధ్య హిరోషిమా వెళ్ళారు. ఆ తర్వాత నాగసాకి వెళ్ళడానికి ధైర్యం చాలలేదన్నారు. మా మనుమరాలు నాకా భయంకరమయిన సంఘటనలు చెపుతూ ఏడ్చేసింది.

అయితే - ఇది ఒక వేపు నుంచీ చూస్తే కనిపించే దృశ్యం. ఈ 60 సంవత్సరాలలో - ఓ చిన్న ద్వీపంలో ఉన్న జపాన్ ప్రపంచ దేశాలన్నిటినీ తలదన్నే పురోగతిని సాధించింది. ఎలక్ట్రానిక్ రంగంలో అయితే అమెరికా, ఫ్రాన్స్, అరబ్ దేశాలలో కూడా జపాన్ లేబులే ఉంటేనే నమ్మకం, మన్నిక. ఏమిటి ఈ జాతి రహస్యం? నడుం విరిగే విధ్వంసాన్ని తట్టుకుని గోమటేశ్వరుడిలాగ ఆకాశంలోకి దూసుకుపోవడానికి ఈ జాతికున్న ప్రత్యేకత ఏమిటి?

ప్రముఖ హాలీవుడ్ తార షిర్లీ మాక్లయిన్ జపాన్‌లో పెరిగిన అమెరికన్‌ని పెళ్ళిచేసుకుంది. ఆమె ఆత్మకథలో జపాన్ ప్రసక్తి వింటే - ఆ ప్రశ్నకి అర్థం బోధపడుతుంది. (మన గురించి మనవాళ్ళు చెపితే గొప్పతనం ఏముంది? పొరుగింటి వాళ్ళు చెప్పాలి.)

జపాన్‌లో అర్జంటు పనుల్లేవు. అక్కడ ముఖ్యమైన విషయం మనిషికీ మనిషికీ ఉన్న సంబంధాలు. వీలయినంత వరకు, వీలయినప్పుడల్లా 'వత్తిడి'ని వదులుకోవాలి. పడమటి దేశాల్లో మర్యాదలకి ఓ విలువుంది. కానీ జపాన్ మర్యాద ఓ కళ. దాన్ని వారు ఆరాధిస్తారు. ఇద్దరు కలిసినప్పుడు చిరునవ్వు దగ్గర్నుంచీ, శరీరంతో వంగి పలకరించడం వరకు - ఆ పని వారి సంస్కృతిలో భాగం. కేవలం మర్యాద కాదు. ప్రకృతికి ఒదిగి బ్రతుకుతారు. లొంగదీసుకోడానికి ప్రయత్నించరు. "వెదురుని చూసి పాఠం నేర్చుకో. గాలితో పాటు, గాలి కంటే ముందు వొంగు. తలవొంచు. ఎప్పటికీ వీగిపోవు" ఇది సామెత. తలవొంచడం ఓటమికి చిహ్నం కాదు. గెలుపుకి దగ్గర త్రోవ. నీటినీ, అడవుల్నీ, చెట్లనీ అదుపులో ఉంచాలని చూడరు. కాగితాన్ని కూడా 'కళ'గా మలచిన సంస్కృతి అది.

అతి ముఖ్యమయిన విషయం. అక్కడ మంచికీ, చెడుకీ మధ్య పెద్దవార లేదు. అన్నివేపుల నుంచీ సమస్యని గమనిస్తారు. తగాదా వస్తే మధ్యవర్తిని ఆశ్రయిస్తారు. మంచికి పట్టం కట్టమని కాదు. ఎవరికీ ఇబ్బంది కలగని రీతిలో - అవసరమయితే మంచిని ఆ మాత్రం రాజీ చేసి ఓ "సంయమనం" ఏర్పరచడానికి. ఇదెంత గొప్ప విషయం!

అర్జంటు పరిష్కారాల్ని అనుమానంతో చూస్తారు. ఫలితం కన్న ఎంచుకున్న మార్గం ముఖ్యం. (ఈ మాట మహాత్ముని గొంతులో మనం విన్నాం)

మరొక అద్భుతమయిన విషయం. మనిషి బాగా ఆలోచించాలి, ధ్యానంలో ఉండాలంటే కడుపులో ఏ మూలో కాస్త 'ఆకలి' మిగలాలి. పూర్తిగా వెచ్చదనం, ఖుషీ జీవితం తగదు. అవసరమయింది కాస్త వదులుకోవడం ద్వారానే జ్ఞాన ప్రదీపన సాధ్యం. ఇది బౌద్ధం. డబ్బున్నవాడు కూడా 'ఉండాలి కనుక' అని ఏదీ కొనడు. సంపన్నుడి గొప్పదనం సాధించిన వాటిలో తప్ప కూడ బెట్టిన వాటిలో చూసుకోడు.

ఇక సరదా అయిన విషయాలు. హోటల్ క్లర్క్‌ని "ఫలానా మనిషి దగ్గర్నుంచీ ఫోనొచ్చిందా?" అనడిగిందట షిర్లీ. రాలేదని సమాధానం. తర్వాత పదిహేను మంది పంపిన సందేశాల లిస్టు వచ్చింది. "మరి చెప్పలేదేం?" అంటే "మీరు అడగలేదు కదా?" అని సమాధానం.

టెలీఫోన్‌లో మాట్లాడుతున్న జపాన్ మనిషిని పలకరించండి. రిసీవర్ పక్కన పెట్టి ఎంతసేపయినా మాట్లాడతాడు - అవతల మనిషి ఫోన్‌లో వేచి ఉన్నా. ఎందుకు? మిమ్మల్ని కించపరచకపోవడం మర్యాద.

ఓ చిన్న పనికి పది రూపాయలు (ఉదాహరణకి) ఇచ్చి పంపింది. నిజానికి ఆ పనికి రెండు రూపాయలు చాలు. ఈలోగా ఏదో పని మీద నగరంలో మరో మూలకి వెళ్ళాల్సి వచ్చింది. కొన్ని గంటల తర్వాత ఆ కుర్రాడు ఆమెను వెదుక్కుంటూ ఆ మూలకి వచ్చి ఎనిమిది రూపాయలు ఇచ్చి వెళ్ళిపోయాడు!

ఒక పత్రికా ప్రతినిధి ఆమెని 'టీ'కి ఆఫీసుకి ఆహ్వానించాడు. మధ్యలో లేచి బయటికి వెళ్ళాడు. 45 నిమిషాలు గడిచినా తిరిగి రాలేదు. ఆయన కోసం బయటికి వస్తే వరండాలో అద్భుతంగా ఏర్పాటు చేసిన పుష్పాల అలంకరణ ముందు మోకరిల్లి ఉన్నాడు. ఆ దృశ్యం చూడగానే అతనిలో పరవశం కలిగింది. మనస్సు ప్రశాంతమయింది. ప్రశాంతత కన్నా ముఖ్యమైనది మరొకటి లేదు. ధ్యానం గొప్ప ఉపశమనం.

రోడ్డు మీద నూడుల్స్ బండి వెళ్తోంది. టాక్సీ దాన్ని గుద్దుకుంది. నూడుల్స్ సరుకంతా చిందర వందరయింది. బండీ, బండి వాడూ ఎగిరి నేలమీద పడ్డారు. టాక్సీ డ్రైవరు దిగాడు. కారుకి పెద్ద లొట్ట అయింది. బండివాడికి దెబ్బలు తగిలాయి. లేచాడు. ఇద్దరూ ఒకరి ముందు ఒకరు వంగి క్షమాపణలు చెప్పుకున్నారు. అంతే. టాక్సీ డ్రైవరు కారు నడుపుకు వెళ్ళిపోయాడు. నేల పాలయిన నూడిల్స్‌ని కాలువలోకి తోసి బండివాడు కుంటి బండితో తన దారిన పోయాడు! మర్యాదకి మన్నన లభించింది. మరి నష్టం? ఇది అమెరికా కాదు - కోర్టెక్కడానికి. ఇండియా కాదు జుత్తు పట్టుకోవడానికి.

ఇద్దరు రోడ్డుమీద నడుస్తున్నారు. ఒకడు ముతక జోక్ చెప్పాడు. రెండోవాడికి నవ్వొచ్చింది. అంతలో అవసరం వచ్చింది. పక్కకి తిరిగి మూత్ర విసర్జ చేస్తున్నాడు. వెనుక నడుస్తున్న స్త్రీ ఏమీ చూడనట్టు నడుచుకుపోయింది. జపాన్‌లో ఎవరయినా తాము చూడాలనుకున్నదే చూస్తారు. చూడక్కరలేనిది చూపు నుంచీ జారిపోతుంది.

ఒకాయన రోడ్డు మీద పడ్డాడు - అనారోగ్యంతో ఎవరూ అతని గురించి పట్టించుకోలేదు. ఎందుకని? అతని కర్మ ముందే నిర్ణయించబడింది..అనుభవిస్తున్నాడు. అక్కరకు వెళితే ఆ కర్మకి మనం అడ్డుపడినట్టు. దానికి ఫలితం మనం బతికినంత కాలం అనుభవించాలి. ఈ విషయం పడిన వాడికీ తెలుసు. చేయూతనివ్వని వాడికీ తెలుసునని పడిన వాడికి తెలుసు.

ఈ ఒక్క విషయంలో - ఇంకా మనం 'కాస్త ముందు' ఉన్నామేమో! అది మన 'కర్మ'

******




# భారత ఎద్దు

## అనుభవాల కలంనుంచీ అనేక విషయాలు



మనం ఎన్నిరకాల ప్రాంతీయాభిమానాన్ని ఎన్ని విషయాల్లో చూపించినా తెల్లవాడి ప్రభావం ఇప్పటికీ వదులుకోలేదన్నది నిర్వివాదాంశం.

వదులుకునే ఉంటే తమిళభాష మాట్లాడేవాళ్ళు చక్కటి సమ్మర్ క్రాఫ్‌తో కనిపించరు. అలాగే తెలుగు భాష మీద అభిమానం చూపించే ఏ ఒక్కరూ ఇవాళ పంచె, కండువాతోనో వేష్టితోనో కనిపించేవారు. మార్పు అన్నది సహజం, అవసరం. అంతవరకూ అయితే ఆహ్వానించదగ్గదే అభినందనీయమే.

తెల్లవాడు మనదేశంలో ఏం సాధించినా, సాధించకపోయినా (నిజానికి తెల్లవాడు సాధించినదయినా మనం సాధించలేకపోతున్నాం.) క్లైవు దొరగారు చెయ్యగలిగిన జాతీయ రహదారిని సుగమం చేసే వాజ్‌పేయీ ప్రభుత్వం ప్రయత్నాన్ని, ఆ ప్రభుత్వం గద్దె దిగిన మరుక్షణమే అటకెక్కించేశాం. మద్రాసు నుంచీ దిండీవనం వచ్చే సగం మార్గమే నాలుగు రోడ్ల రహదారి (దీన్ని వాజ్‌పేయి రోడ్డు అంటారు డ్రైవర్లు) మిగతా రోడ్లు ఆయా నాయకుల 'ఫలహారాల' రోడ్లు.

చేసే ప్రతి పనిలోనూ 'చిత్తశుద్ధి' లోపమే మన దేశం ఇంకా ఇలా ఉండటానికి కారణం. ఈ దేశాన్ని పాలించడానికి వచ్చిన దొరలు - మన దేశంలో మన భాషతో పాటు, మన అవసరాలను, మన నమ్మకాలను, మనకు విశ్వాసాన్ని కలిగించే పనులను చేశాకే - వాళ్ళకి అవసరమయిన పనులు చేయించుకున్నారు. ఏదీ? పొరుగువాడికి అర్థం కావాలన్న ఆసక్తి తమిళనాడులో ఒక్కచోట వెదకండి. ఒక్క ఆఫీసు బోర్డు తమరు అర్థం చేసుకోలేరు. అదీ మనకీ తెల్ల దొరల ఆలోచనా సరళికీ తేడా.

వృత్తి పనులో, మరే పనులో చేసుకునే వ్యక్తుల్ని ఇంగ్లీషు చదువుల్లోకి దింపి - వాళ్ళకి అవసరమయిన గుమాస్తాలుగా మార్చారు. ఆ రోజుల్లో స్వంత వృత్తి వదిలి ఇంగ్లీషు చదువు చదువుకోవడం గ్లామరు - గ్రామాలు వదిలి "మా వాడు పట్నంలో ఉంటున్నాడు (అడుక్కు తింటున్నా) అని చెప్పుకోవడంలాగ. లాభం రిటైరయాక చచ్చేదాకా ఫింఛని ఇచ్చే సదవకాశం. మా అమ్మకి నేను మద్రాసులో రచయిత కన్నా విశాఖపట్నంలో గుమస్తా కాలేదని బాధపడేది. కారణం? గుమస్తాకి ఫించను వస్తుంది. 55 సంవత్సరాలు నోరెత్తకుండా, తనకి అవసరం లేని, అక్కరలేని పనిని - మరొకరి సౌకర్యానికి చేసిపెట్టి - చచ్చేవరకూ భత్యాన్ని పొందే విధానం పట్ల ఇప్పటికీ మనకు గ్లామరు ఉన్నది.

మీ అబ్బాయి ఏం చదువుతున్నాడని కాక ఎందుకు చదువుతున్నాడని అడగండి. మొదట ఆ ప్రశ్నకే షాక్ అవుతారు. "ఇంకెందుకు? అమెరికాలో ఉద్యోగానికి" అని సమాధానం.

లేదా ఫలానా కంపెనీలో ఇంజనీరు కావడానికి.

"లాభం?"

"అయ్యో, బోలెడు జీతం"

చదువుకి ప్రయోజనం గొప్ప ఆదాయాన్నిచ్చే గొప్ప జీతమనే ఆలోచన తప్ప దాదాపు నూటికి నూరు శాతం ఈ తరం తల్లిదండ్రులు కానీ చదువుకునే విద్యార్థులు కానీ ఆలోచిస్తున్నట్టు కనిపించరు.

ఎక్కడో ఒక నారాయణ మూర్తి, ఒక ముఖేష్ అంబానీ, ఒక గోపీనాథ్, ఒక రామలింగరాజు కనిపిస్తారు. మిగతా అందరూ ఆయా కంపెనీలలో గుమస్తాలే అవుతారు.

దీనికి ఆలోచించే అవసరంకానీ, ఆలోచించవచ్చుననే పరిస్థితి కానీ ఇవాళ చాలా గొప్పగా చదువుకున్న 'మేధావి' అయిన కుర్రవాడికీరాదు.

ఏ అబ్దుల్ కలాం వంటి వారో రాష్ట్రపతి పదవి అయాక - నేను మళ్ళీ యూనివర్శిటీకి పోతాను - అంటారు. వారే ప్రస్తుత భారత దేశంలో భారత రత్నలవుతారు. మిగతావారు - చాలావరకు - కార్పొరేట్ కంపెనీల్లో ఖరీదయిన గుమస్తాలవుతారు.

మురళీ మనోహర్ జోషీ వంటి వారు పరాశరుడు, సుశ్రుతుడు, చరకుడు గురించి చెపితే - మళ్ళీ టైం మిషన్‌లో వెనక్కి వెళ్ళే పని చేస్తున్నారని నేడు గుమస్తా చదువులు చదివే చాలామంది మేధావి యువ క్లర్కులకి అనిపించవచ్చు.

పోనీ, ఇంగ్లీషు భాషలో చెప్పాలంటే ఒక గ్రాహం బెల్, ఒక థామస్ అల్వా ఎడిసన్, లేదా తెల్లవారి ఉద్యోగపు పనులలో వచ్చి - వృత్తికి మించి పెరిగి ఆలోచించ గలిగిన బ్రౌన్, మెకంజీ, కాటన్‌ల సాపత్యమో మనం తెచ్చుకునే అలవాటు ఎవరూ చెయ్యరు.

ఈ మధ్య ఎవరో కుర్రాడు హెలికాప్టర్ తయారు చేశాడట. ఫలితం ఏదయినా ప్రయత్నం గొప్పది.

జోషీగారు మొన్న 'సాంకేతిక పరిజ్ఞానపు భారతీయ వారసత్వం' అనే విషయంపై జాతీయ సదస్సుని ప్రారంభిస్తూ భారతదేశం ప్రపంచానికి క్లర్కుల దేశమని చెప్పారు. ఆయన ఆ మధ్య బ్రెజిల్ వెళ్ళారట. అక్కడి నుంచీ ఎద్దుల్ని మన దేశం తెచ్చుకోవాలని భారత దేశం ప్రయత్నిస్తోందట. ఈ ఎద్దు వారసత్వాన్ని గురించి వాకబు చేస్తే - 'అయ్యా, దీని బీజం ఇండియా నుంచే వచ్చింద'ని వారు పేర్కొన్నారట.

మన ఎద్దు మళ్ళీ మనదాకా వస్తోంది, సంతోషం. మరి మన "ఆలోచనా సరళి" ఈ ఎద్దుపాటి చెయ్యకూడదా?!




# తెలుగు తెగులు

# అనుభవాల కలంనుంచీ అనేక విషయాలు



మొన్న చెన్నైలో జరిగిన తెలుగు మహాసభలలో చాలా కొత్త విషయాలూ, గొప్ప విషయాలూ తెలిసొచ్చాయి. పై రాష్ట్రాలు, దేశాలలో ఉన్న తెలుగువారు తరాల క్రింద వదిలిపోయిన తల్లి భాషని కాపాడుకోవాలని ఎంతగా తాపత్రయ పడుతున్నారో చెప్పుకున్నారు. మలేషియాలో మలయ్ భాషని నేర్చుకుంటూ, ఒరిస్సాలో ఒరియాని నేర్చుకుంటూనే - తెలుగులో ఎంతో గొప్పగా, చక్కగా ప్రసంగించారు వీరంతా. తమిళనాడులో ఓ తెలుగు ఎమ్మెల్యే శాసన సభలో ఎప్పుడూ తెలుగులోనే మాట్లాడి ఎలా ఎకసెక్కాల పాలవుతుంటాడో చెప్పి, అయినా తెలుగే మాట్లాడతానని గర్వంగా చెప్పుకున్నాడు. పది కాలేజీలు నడిపే ఓ విద్యావేత్త - తెలుగుభాషలాగే తెలుగువారూ అందమయినవారంటూ పదిహేను నిముషాలు 'అరిగిపోయిన' తెలుగులో మాట్లాడారు. ఇవన్నీ విడ్డూరమయిన విషయాలు. ఎందుకంటే తెలుగుదేశంలో తెలుగు మీద ఎవరూ అంత శ్రద్ధ చూపడం లేదు కనుక. తెలుగు పిల్లలకు తల్లిదండ్రులు గర్వంగా ఇంగ్లీషు చదువులు చెప్పించుకుంటున్నారు కనుక. చదువు పర్యవసానం అమెరికాలో మాయమవడమేనని - ఇప్పుడిప్పుడు ప్రతీ ఇంట్లోంచీ కనీసం ఒక్కరయినా అమెరికాకు అంకితమవుతున్నారు కనుక. చదువు ఉద్దేశం ప్రస్తుతం ఉద్యోగం - తద్వార డబ్బు - సంపాదించడమే ధ్యేయం కనుక. (ఇప్పుడు చాలామంది అడగవచ్చు - చదువుతో మరేం సాధించాలని. చదువు ఎలా అబ్బుతుందని. చదువుకి ఈ దేశంలో ఏనాడూ ఎవరూ డబ్బు చెల్లించలేదనీ, నిజానికి గురువులు శిష్యుల్ని పోషించి చదువులు చెప్పేవారని, డబ్బు చదువులు ఇంగ్లీషు వారి నిర్వాకమని ఈ తరానికి తెలియకపోతే ఆశ్చర్యం లేదు.) ఏ తెలుగువాడూ ఏనాడూ పార్లమెంటులో తెలుగులో మాట్లాడిన వైనం (అటు ఉత్తరదేశం వారు భోజ్‌పురీ, హిందీలలో మాట్లాడుతుండగా) మనం వినలేదు కనుక.

తెలుగువాడికి ఆవేశం ఉంది. ఆత్మాభిమానం ఉంది. దేశభక్తి ఉంది. పట్టుదల ఉంది. కానీ వెన్నెముక లేదు. తమిళ, కన్నడ, మహారాష్ట్ర, బెంగాలు - మీ ఇష్టం - మిగతా వారందరికీ ఇవన్నీ ఏ పాళ్ళలో ఉన్నాయో గానీ - ఒక్కటి మాత్రం ఉంది. తమకి అవసరం అయిన దాన్ని 'సిగ్గులేకుండా' సాధించుకునే శక్తి.

చిన్న ఉదాహరణ. రేడియో కేంద్ర పాలిత శాఖ. కేంద్రం పద్ధతులు చెల్లాలి. కానీ చెన్నైలో స్టూడియోల బోర్డులన్నీ తమిళంలో ఉన్నాయి. ఎవరూ ఆక్షేపించలేదేమి! ఈ పని హైదరాబాదు రేడియోలో జరగగలదా? జరిగితే ఒవైసీ గారూ, మరెందరో ప్రముఖులు

ఉర్దూలో ఉండాలని శాసనసభలో వివాదం లేవనెత్తరా? ఇక్కడ భాషేతర కార్యక్రమాలు ప్రసారమవుతాయి. మరి వారికి ఏ స్టూడియో ఏదో ఎలా తెలుస్తుంది? తామనుకున్నది చేసి చూపే ఘనులు తమిళులు. ఈ మాట అభినందన పూర్వకంగా అంటున్నాను.

మా రాష్ట్రంలో మా భాష నేర్చుకు తీరాలన్నారు - తమిళ ప్రభుత్వం వారు. చచ్చినట్టు అంతా నేర్చుకుంటున్నారు. అన్ని స్కూళ్ళలోనూ కన్నడ నేర్చుకోవాలంది కర్ణాటక ప్రభుత్వం. ఇది సబబయిన మాట. ఆ రాష్ట్రంలో ఉంటూ ఆ భాష నేర్వడం ఆక్షేపణ కానక్కరలేదు. ఏదీ? తెలుగుదేశంలో చదువుకునే ప్రతి కుర్రాడి చేతికీ (ఇంగ్లీషు చదువులతో సహా) ఏ దశలోనయినా 'తెలుగు పుస్తకం' చేరుతోందా?

వెన్నెముక లేనిది - ప్రభుత్వాలకి.

ఏడు సంవత్సరాలుగా మందుల్లో కల్తీకి కారణమయి, లంచాలు పుచ్చుకుని ఎందరో పసిపిల్లల చావుకు కారణమయిన ఓ చైనా ఆహార, మందుల శాఖ అధిపతికి చైనా న్యాయస్థానం మరణ శిక్షని విధించింది. ఈ అధికారి పేరు జెంగ్ కియోయు. ఇది చాలా అద్భుతమయిన శిక్షగా నాకనిపిస్తుంది. మరి అక్కడ మానవతావాదులు, మానవ హక్కుల సంస్థలున్నాయో లేదో మనకు తెలీదు. కాశ్మీరులో ఉన్నట్టు దేశభక్తులున్నారో లేదో తెలీదు. పదిమంది మనుషుల్ని హత్య చేయడం కన్నా, ఓ తరం పసివారి ఆరోగ్యాన్ని - కేవలం డబ్బుకోసం నిర్దాక్షిణ్యంగా బలితీసుకున్న ఉద్యోగి - దేశద్రోహం కన్న పెద్ద నేరం చేసినట్టు.

మన దేశంలో పార్లమెంటులో మారణ హోమానికి కుట్ర చేసిన నేరస్థుడిని - సుప్రీం కోర్టు ఉరి తీయాలని శిక్షవేస్తే - శిక్ష అమలు జరిపే దిక్కులేదు. నేరాన్నీ - దాని పూర్వపరాల్నీ పక్కని పెట్టి - ఘనత వహించిన మానవ హక్కుల సంఘాల వారు నడుం బిగిస్తారు. ఆయా మతాల వారు పక్క చూపులు చూస్తారు. మరి చచ్చిపోయిన వారు మానవులో కారో మనకు తెలీదు.

వ్యవస్థ చిత్తశుద్ధి వ్యక్తికి శ్రీరామ రక్ష. ఏం చేసినా ప్రభుత్వం తలవొంచడానికి డబ్బు, అధికారమూ కల్సి వస్తుందన్న గుండె ధైర్యమే బిట్టీ మహంతీ, పెరైరా, మనూశర్మ కేసులు చెప్పే నీతులు.

తమ దేశంలో తమ భాషలని నేర్వాలన్న చట్టాన్ని సజావుగా అమలు చెయ్యలేని ప్రభుత్వానికి - భాష గురించి మాట్లాడే హక్కేముంది? పూంపుహార్ వెళ్ళండి. తమిళంలో తప్ప బోర్డులు కనిపించవు. కొన్ని కార్యాలయాలు ఏమిటో తెలియాలన్నా చెన్నైలో తమిళం వచ్చి తీరాలి.

ప్రాంతీయ అభిమానమో, దురభిమానమో కారణంగా - "మామీద హిందీ రుద్దితే ఒప్పుకోం" అనే ఒక్క ఉద్యమంతో పాతికేళ్ళ కిందట ద్రవిడ పార్టీ పదవిలోకి వచ్చి ఇప్పటికీ రాజ్యమేలుతోంది. భాషయినా, ఆచారమయినా, గుడిలోకి వెళ్ళే సంప్రదాయమయినా, మరేదయినా - వ్యవస్థ సమర్థన లేకపోతే నిలవదు.

జాతి ఆదర్శానికి ఉద్యమ స్ఫూర్తినిచ్చిన ఘనత ద్రవిడ పార్టీలది. ఏదీ? తెలుగునాట తెలుగు గతి ఏమిటి? ఒక్క వేమన పద్యాన్ని ప్రాథమిక స్థాయిలో మా కుర్రాళ్ళకి నేర్పించండి బాబూ - అని అడగడం తప్పా? తలచుకుంటే - వెన్నెముక ఉన్న ప్రభుత్వానికి అసాధ్యమా?

లోపం - చిత్తశుద్ధి. కల్తీ నేరానికి పొరుగు దేశాలు - హెచ్చరికగా - నేరస్థుల్ని ఉరితీస్తున్నాయి. మనం విదేశాంగ మంత్రుల్ని తోడు పంపి హంతకుల్ని పొరుగుదేశాలకి అప్పగించి వస్తున్నాం.

పోనీ, ఇవన్నీ పెద్ద విషయాలు - మన 'తెలుగు' మాటేమిటి!

గొల్లపూడి గారితో నెలకో ప్రముఖుని జ్ఞాపకాలు కిందిపేజీల్లో..



# నా ప్రారంభానికి నిస్వార్థ సాక్షి

## శ్రీ కోడి రామకృష్ణ

నేను పాలకొల్లులో సెవెంత్‌ఫార్మ్ చదివుతున్నప్పటి మాట. నాటకాలను, రంగస్థలాన్ని ప్రేమించే clan చెందిన వాడిగా మారుతీరావుగారు అంటే చెప్పలేని ఆరాధనా భావం వుండేది. ఎందుకంటే రంగస్థలానికి సంబంధించి ఎందరో రచయితలుండొచ్చు; అయితే, ఓ ప్రత్యేకతతో, తనదైన ట్రెండ్‌తో థియేటర్ మీడియాలో గ్లామర్‌ని అందుకున్న ఒక స్టార్‌గా ఆయన్ని గురించి వినేవాణ్ణి.

'కళ్ళు' నాటిక ఆయన రాసిన రోజుల్లో అదొక సెన్సేషన్. ఏదో కొత్తదనం వైపు తిరిగి చూడాలని అన్ని దిక్కుల్ని అన్వేషిస్తున్న మాకు 'కళ్ళు' నాటిక ఇన్స్‌ఫిరేషన్‌ని ఇచ్చింది. 'గుడ్డితనం' అనే అవిటితనాన్ని ఇతివృత్తంగా నాటిక రాయాలని ఆలోచించి, రాసి, ఆంధ్రరాష్ట్రంలో ఓ 'ఊపు'ని సృష్టించిన ఆయనలోని సృజనాత్మకతకు, థియేటర్‌నే ఓ కొత్త అడుగు వేయించిన ఆయన ధైర్యానికి మేమంతా ఆ రోజుల్లో పగలూ రాత్రీ ఆయన గురించి చర్చించుకునే వాళ్ళం. చెప్పాను కదా, మేం రంగస్థలానంద పిపాసులం అని!

వ్యక్తిగతంగా ఆయన్ని చూసింది మద్రాసులోనే. మా రాఘవగారి దగ్గర తొలి పిక్చర్ అవకాశం గురించి ప్రయత్నం చేస్తున్న సమయం. డైరెక్ట్ రూట్‌లో వెళితే త్వరగా ఆఫీసుకి వెళిపోతాం. కథ గురించి ఆలోచించుకునే సమయం తగ్గిపోతుందని చుట్టు తిరుగుడుగా మారుతీరావుగారింటి వైపు నుంచీ వెళ్ళేవాణ్ణి! శారదాంబాళ్ వీధి రూట్ అది. అట్నుంచీ వెళుతున్న టైంకి మారుతీరావుగారు మార్నింగ్ వాక్ నుంచీ వస్తుండేవారు. నన్ను ఆయన చూసేవారు. ఆయన్ని నేను చూసేవాణ్ణి. పరిచయం లేదు. ఆయన్ని తెల్సు. నన్నే ఆయనకి తెలీదు. మా రాఘవగారికి 'ఇంటలెక్చ్యువల్స్' అంటే చాలా గౌరవం. ఆ కారణంగానే ఆయన మారుతీరావు గార్ని అపారంగా గౌరవించేవారు. నేను చెప్పాల్సిన కథని ముందు మారుతీరావుగారికి చెప్పమని పంపారు. ఆ విధంగా ఆయనతో నాకు తొలి పరిచయం కలిగింది. కుర్రాళ్ళకి ఆయనందించే ప్రోత్సాహం ఆయన మాట్లాడే ప్రతీ మాటలోనూ చాలా పవర్‌ఫుల్‌గా కనబడేది. మొదట తరంగిణి కథ చెప్పాను. ఆ కథా చర్చలు జరుగుతున్నప్పుడు మధ్యలో ఓ సారి 'ఇంట్లో రామయ్య - వీధిలో కృష్ణయ్య' కథ ప్రస్తావన పూర్వకంగా చెప్పాను. ఆ కథకి ఆయన ఓటేసారు. రాఘవగారికి కూడా చెప్పారు. కథ బావుందని. అదే నా ప్రయాణంలో నా తొలి అడుగు. దానికి సూత్రధారి మారుతీరావుగారే.



ఆయన నన్ను ప్రోత్సహిస్తూ కథా చర్చల్లో పాల్గొనేవారు. అప్పుడాయన కడపలో పనిచేస్తుండేవారు. ఆయనతో పాటు నన్ను కూడా తీసుకువెళ్ళేవారు. నా భోజనం ఖర్చులు, ఇతరత్రా అన్నీ ఆయనే చూసుకునేవారు. ట్రైన్‌లో వెళుతున్నప్పుడు గేట్ దగ్గర స్టెప్స్ మీద కాళ్ళుపెట్టుకుని ప్రక్కనున్న హేండిల్స్ పట్టుకుని కథను డిస్కస్ చేసుకుంటూ ఆయనతో నా రైలు ప్రయాణాలు సాగేవి.

కథ బాగా వచ్చింది. మారుతీరావుగారి పాత్ర ఎవరు వేస్తే బావుంటుందన్న ప్రశ్న తలెత్తింది. నేను మారుతీరావుగారే చేస్తే బావుంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశాను. రాఘవగారు కూడా క్యారెక్టరంతా దృష్టిలో పెట్టుకుని నా అభిప్రాయంతో ఏకీభవించారు. అయితే మారుతీరావుగారు మాత్రం ససేమిరా వద్దన్నారు. "రామకృష్ణా! నీకిది తొలి అవకాశం. ఏ పొరపాటు వల్ల అయినా నీ నిర్ణయం సరైంది కాకపోతే నీ కెరీర్ దెబ్బ తింటుందయ్యా!" అన్నారు. నిజంగా ఆ మాటలు ఆయన నోటివెంట వెలువడుతున్నప్పుడు ఆ మాటల్లో వున్న నిజాయితీ నన్ను చలింపచేసింది. తెరమీద కనిపించే అవకాశంలో వున్న ఎక్సైట్‌మెంట్‌గానీ, ఆకర్షణగానీ ఆయన్ని లొంగదీయలేకపోయాయి. నా కెరీర్ పట్ల ఓ గురువుగా నా 'సేఫ్టీ' గురించే ఆయన ఎక్కువ ఆలోచించారు. అది ఆయనలోని నిజాయితీతో నా తొలి పరిచయం.

అందరం కలిసి మొత్తానికి ఎలాగో ఆ పాత్ర ఆయన వేయడానికి ఆయన్ని ఒప్పించాం. పాలకొల్లులో షూటింగ్. ఆయనపైన తొలిషాటు అర్ధరాత్రి తీశాను. ఆయనలోని కంగారు నేను గమనించాను. అది నటించలేక కంగారు కాదు. ఆయన నాతో అన్న మాటని మరచిపోలేక ఆ కంగారు. ఫస్ట్‌షాట్ అయ్యాక మళ్ళీ నాతో అన్నారు. "రామకృష్ణా! ఇప్పటికైనా మించిపోయింది లేదు. నేనేం ఫీలవను. నీకు ఇబ్బంది అవుతుందేమో. ఇంకొకర్ని పెట్టి తీస్తే బావుంటుందేమో!" ఏదో సరదాకి అన్నమాట కాదది. గుండెలోంచి వచ్చిన మాట.

"ఏం ఫరవాలేదు సార్... నేను చెప్పినట్టుగా చెయ్యండి. చాలు!" అన్నాను. నా ఫ్రెండ్స్ అంతా వచ్చి ఆయనకి దండవేసి కరతాళ ధ్వనులతో అభినందనలు తెలియజేశారు. అయితే ఆయనలో ఓ మహా ప్రత్యేకత ఏంటంటే దేనికీ పొంగిపోయే స్వభావం కాదు ఆయనది. ఆ స్వభావమే అన్ని రంగాలలోనూ, పత్రికా రంగం మొదలుకుని సినిమా మీడియా వరకూ కూడా నిలకడగా, నిర్దిష్టంగా నడిపింది. షూటింగ్ కాలమంతా ఆయనున్నంతసేపు ఓ పిక్నిక్‌లా, ఎంత సమాచారమున్న మనిషో మారుతీరావుగారు. 'బెన్‌హర్' చిత్రంలో ఎవడు గుర్రం మీద నుండీ పడిపోయాడు, వాడి పేరు ఏమిటి, ఆ గుర్రం పేరేంటి, అది ఏ దేశానికి చెందినది ఇలాంటి సంగతులు ఏమీ తడబాటు వెనక చూపూ లేకుండా చెప్పగల నిధి ఆయన. అవి చెబుతున్నప్పుడు మనకెంత నివ్వెరపాటు కలుగుతుందంటే - ఈ వ్యక్తి ఈ దేశంలో పుట్టారు కాబట్టి గానీ లేకుంటే ప్రపంచమంతా కళ్ళికట్టుగా ఈయన్ని ఎంత ఎత్తుకు తీసుకు వెళ్ళి ఉండేదా అనిపిస్తుంది. 'ఇంట్లో రామయ్య - వీధిలో కృష్ణయ్య' చిత్రం పూర్తయింది. విడుదలైంది. పెద్ద సక్సెస్. ఆ తర్వాత మళ్ళీ మా జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ - ట్రయిన్ గేట్ దగ్గరే కూర్చుని ప్రయాణం చేశాం. స్టేషన్ వచ్చింది.



'ఇంట్లోరామయ్య-వీధిలో కృష్ణయ్య' చిత్రం షూటింగ్ సమయంలో కోడిరామకృష్ణ అభినందనలు

ప్లాట్ ఫార్మ్ మీదనున్న ప్రయాణికులంతా ఆ వాతావరణమంతా దద్దరిల్లేటట్టు 'దటీజ్ సుబ్బారావు' అని కేకలు వేసి, ఆయన్ని చూసి కేరింతలు కొట్టారు. మారుతీరావుగారు కదిలిపోయారు. అప్రయత్నంగా ఆయనకి కళ్ళంట నీళ్ళు వచ్చాయి. అప్పుడు ఆయన

నాతో అన్నమాట నాకిప్పటికీ గుర్తు, "చూడు, రామకృష్ణా! ఓ నెలరోజుల క్రితం నేనెవర్నో ఎవరికీ తెలీదు; ఈ సినిమా తర్వాత ఎంత మందికి ప్రీతి పాత్రుణ్ణి అయ్యానో! సినిమా మీడియాకి ఎంత పవర్ వుందో!" అన్నారు. తన గొప్పతనం అనలేదు. 'మీడియాది' అన్నారు. రచయితగా ఆయన్ని దుక్కిపాటిగారు ఆహ్వానించినప్పుడు కూడా నాకు సినిమా రచనతో పరిచయం లేదు అని హంబుల్‌గా చెప్పారు. నాతోనూ అలాగే మాట్లాడారు. అంటే, అవకాశం దొరికింది కదా అని రెచ్చిపోయే వ్యక్తి కాదు ఆయన.

'ఇంట్లో రామయ్య - వీధిలో కృష్ణయ్య' చిత్రం స్క్రిప్టు రాసిన తర్వాత వైజాగ్‌లోని థియేటర్ ఆర్ట్స్ స్టూడెంట్స్‌కి చదివి వినిపించారు. థియేటర్ మీడియా పట్ల ఆయనకుండే ప్రేమ, అంకిత భావం అపారమైనవి. సినిమాకి, నాటకానికీ, పత్రికా రంగానికి ప్రతినిధిగా ప్రముఖ స్థానాన్ని అందుకున్న ఆయన జీవితంలో మధ్యలో ఆల్‌ఇండియా రేడియో కూడా ఓ ప్రత్యేక పాత్రను వహించింది. నిజానికి ఈ సినిమా చేస్తున్నప్పుడు ఆలిండియా రేడియోలోనే ఉద్యోగం చేస్తున్నారాయన. ఆ చిత్రంతో ఆయనకెంత పాప్యులారిటీ వచ్చిందో ప్రత్యేకంగా నేను చెప్పనక్కర్లేదు. ఆయనెంతో బిజీఅయ్యారు. అయినా రిజైన్ చెయ్యొద్దని చెప్పాను. ఆయనా చెయ్యడానికి సుముఖత చూపించలేదు. తర్వాత్తర్వాత ఉద్యోగంలో బాగా ఒత్తిడిని ఎదుర్కొన్నారు. అప్పుడు రిజైన్ చెయ్యమని ప్రోత్సహించాము. రాఘవగారి ఆఫీసులోనే ఆయన ఆలిండియా రేడియోకి రాజీనామా రాశారు. సినీనటుడిగా స్థిరపడి ఇక వెనక్కి చూడలేదు. నేనూ, చిరంజీవి, ఆయన అత్యంత సన్నిహితులుగా ఎన్ని రోజులు చిక్కటి స్నేహాన్ని పంచుకున్నామో గుర్తుకు రాని క్షణం ఉండదు. ఆయన చెప్పే అనుభవాల కబుర్లు ఆహ్లాదకరంగా, ఉత్తేజకరంగా, వినోదాత్మకంగా, ఆర్ద్రంగా కూడా ఉంటాయి. నాగయ్యగారు పోయినప్పుడు, చక్రపాణిగారిని ఆయన ఇంటర్వ్యూ చెయ్యడం నాకింకా గుర్తే. తొలిసారి ఆయన దుక్కిపాటిగారికి స్క్రిప్టు రాసినప్పుడు తొలిసీను అవసరానికి మించి ఎన్ని పేజీలు రాసింది, దాన్ని దుక్కిపాటిగారు ఎలా సంస్కరించిందీ ఆయన చెపుతుంటే చాలా తమాషాగా వుండేది. నాకు ఆయనతో ముఖ్యంగా నచ్చిన విషయం: ఆయన ఏనాడూ కాలాన్ని వృధాచెయ్యరు. ప్రతీ క్షణాన్నీ అనుక్షణం సరిదిద్దుకుంటూ సవ్యమైన మార్గంలో ప్రయాణించిన వ్యక్తిగా ఆయనంటే నాకెంతో గౌరవం.

ఆయనకీ నాకూ వుండే అనుబంధం గురించి చెప్పాలంటే కొన్ని పేజీల ప్రయత్నంతో సరిపోదు. నా జీవితం మలుపు తిరుగుతున్నప్పుడు నాకు చేయూత నిచ్చి, చక్కటి సూచనలతో నన్ను నడిపించిన ఓ సూత్రధారి ఆయన. నా ఎదుగుదలకి నిస్వార్థసాక్షి కూడా ఆయనే. నేనూ వాళ్ళింట్లో ఓ మనిషినే! నన్ను బైటవాడిగా ఎప్పుడూ చూడలేదు. ఆయన ఇంట్లో లేనప్పుడు కూడా వాళ్ళింట్లో మనిషిలా మసలడానికి ఆస్కారం కల్పించారాయన. అక్కడ భోంచేసి అక్కడే పడుకునేవాణ్ణి. వాస్తవానికి చెప్పాలంటే నా కెరీర్‌కి స్టార్టింగ్ పాయింట్ ఆయన. నేను వెనక్కి తిరిగి చూస్తే నన్ను దీవించి, ప్రోత్సహించిన అతిముఖ్యులలో ఆయనది ప్రత్యేక స్థానం.

ఎంత గంభీరంగా వుంటారో, అంత సరళత, అంత హాస్య సునిశితత్వం ఆయనలో వుంటాయి. ఓసారి 'ఆలయశిఖరం' షూటింగ్ జరుగుతున్నప్పుడు తిరుపతి దగ్గర రూట్‌మిస్ అయిపోయి ఎక్కడికో వెళ్ళిపోయాం. కార్లో పెట్రోలు అయిపోయింది. భోంచెయ్యడానికి కూడా జేబులో డబ్బులు లేవు. అర్ధరాత్రి, డబ్బు ఉన్నా కొనుక్కుని తినడానికి కూడా అక్కడ ఏమీ లేవు. అప్పుడు ఆయన్ని చూసి, అప్పటికే పాప్యులర్ ఆర్టిస్టు కదా! అంతా పరిగెత్తుకు వచ్చారు. వాళ్ళతో ఆయన సున్నితంగా, హ్యూమర్‌గా మాట్లాడితే వాళ్ళు ఇన్స్‌పైర్ అయి కారులోకి పెట్రోలు తెచ్చిపోసి, అప్పటి కప్పుడు కొట్టు తెరిచి టీ పెట్టించి ఎంతో ఆప్యాయంగా చూసుకున్నారు. ఆయనలోని ఆ 'పబ్లిక్ విన్నింగ్' పాయింట్ చాలా స్ట్రాంగ్‌గా వుండేది. ఆయన రైటింగు స్ఫుటంగా ఉండదు. ఆయన్నే మళ్ళీ చదవమంటే కొన్నిచోట్ల తడబడతారు. అర్థమయింది ఒకే ఒక్కరికి. ఆ వ్యక్తి ఆయన శ్రీమతి గారే. ఆయన రాసిన చాలా స్క్రిప్టులని అందమైన దస్తూరితో కాపీ చేసేవారట. ఎన్నో అనుభవాలు. మరెన్నో జ్ఞాపకాలతో మా అనుబంధం పచ్చగా ఇన్నాళ్ళూ కొనసాగింది. కలకాలం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను.

*(గొల్లపూడి మారుతీరావుగారి షష్టిపూర్తి సంచిక నుంచి)*




# అమ్మకడుపు చల్లగా....

## అనుభవాల కలంనుంచీ అనేక విషయాలు



*(గొల్లపూడి మారుతీ రావు గారి ఆత్మకథ 'అమ్మకడుపు చల్లగా' రచన పూర్తయింది. ఇంకా ప్రచురణ కాలేదు. అతి త్వరలో రాబోయే ఈ పుస్తకంలో నుంచీ మొట్టమొదటిసారిగా 'కౌముది' పాఠకులకోసం ఈ అధ్యాయాన్ని ప్రచురించడానికి అనుమతి నిచ్చారు. వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేస్తోంది 'కౌముది'. ఈ పుస్తకం ప్రచురించాక, అమెరికాలోని అన్ని ప్రధాన నగరాల్లోనూ ఆయా స్థానిక తెలుగు సంస్థల సహకారంతో పుస్తకావిష్కరణ సభలు నిర్వహించబోతోంది మీ 'కౌముది'. పూర్తి వివరాలను వెంట వెంటనే తెలియచేస్తాము)*

నేను రేడియోలో చేరేసరికి మిత్రుడు వెంపటి రాధాకృష్ణ (చలంగారి ఆశ్రమంలో పరిచయం) హైదరాబాదు రేడియోలో అనౌన్సరుగా చేరాడు. ఆయన చెలంగారికి ఉత్తరం రాశాడు. "మారుతీరావు ఇక్కడ ఉద్యోగం చేస్తున్నారు. అందంగా వున్నారు. పెరిగి, పూచి, వూరి, ఊరగాయకు సిద్ధంగా కోతకు వచ్చిన గోంగూర మడికిమల్లే ఉన్నారు. కలియుగ మహాపురుషుల జాబితాలో చేరారు మీ ప్రభావం వల్ల" అని.

దానికి చెలం గారి సమాధానం - A delicate soul wasted in dirt. "మీరు AIR చేరుకున్నారని తెలిసి చాలా దిగులు పడ్డాను" అని. ఉద్యోగంలో చేరాక నామీద ఆశ వదులుకున్న రెండో వ్యక్తి చలంగారు. ఆయన విచారం నాకంటే రేడియో మీద. అయితే ఆంధ్రప్రభ చేరేనాటికి నా మీద ఆశలు వదులుకున్నారు నవభారత్ (అప్పటికి నవభారత్ బుక్‌హౌస్ ప్రారంభించారు) ప్రకాశరావుగారు. "మీరింకేమీ రాయలేరు ఆ రొటీనులో పడి. ఎందరో అలా అయిపోయిన వాళ్ళున్నారం"టూ కొడవటిగంటి కుటుంబరావుగారినీ, మరెందరినో సాక్ష్యం తెచ్చారు. మూడు సంవత్సరాల పాటు ఆయన మాటని వమ్ము చేశాను *

హైదరాబాదు రేడియో స్టేషన్ 24 ఏళ్ళ యువకుడికి ఓ భువన విజయంలాంటిది. ఎటు చూసినా లబ్ధప్రతిష్ఠులైన ఉద్దండులు. మహానుభావులు. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు సాహిత్య సలహాకార్. స్థానం నరసింహారావు నాటక విభాగం ప్రొడ్యూసర్, నాయని సుబ్బారావు

---

*మరో 20 సంవత్సరాలు చలంగారి మాటనీ, మరో 42 సంవత్సరాలు దేశంలో చాలామంది మాటల్నీ వమ్ము చేస్తూ వచ్చాను.

"సినిమాల్లో చేరాక మీరు రచనలు చెయ్యడంలేదనే అపవాదు ఉంది. మీరేమంటారు?" అనే ప్రశ్న కొన్ని వందల మంది - దాదాపు అన్ని ఇంటర్వ్యూలలోనూ అడిగే ప్రశ్న.

నా రచానా వ్యాసంగమూ, సినీమా వ్యాసంగమూ జోడు గుర్రాల స్వారీలాగ నాలుగు దశాబ్దాల పాటు సాగాయి. రెండు రెళ్ళు ఆరు, కళ్ళు, కరుణించని దేవతలు, ప్రశ్న, జగన్నాటకం - ఒకటేమిటి - అన్ని రచనలూ ఆ దశలో రాసినవే. ఈ అపవాదు తెలుగు రచయితలలో నా ఒక్కడి విషయంలోనే వర్తించదు - అంటుంటాను. ఆత్రేయ, నరసరాజు, పినిశెట్టి, భమిడిపాటి, పాత్రో, జంధ్యాల - మీ ఇష్టం - అందరూ సినీ జనారణ్యంలో మాయమయినవారే! "పోవయ్యా, నీకు రాసే బదులు సినిమా స్క్రిప్టు రాసుకుంటే డబ్బులు వస్తాయి" అని నాతో నరసరాజుగారే అన్నారు.

ప్రసంగాల ప్రొడ్యూసర్, మునిమాణిక్యం నరసింహారావు పాఠశాల కార్యక్రమం ప్రొడ్యూసర్, సంగీతం విభాగం ప్రొడ్యూసర్ మంచాల జగన్నాధరావు, తర్వాత వింజమూరి వరదరాజు అయ్యంగార్, లలిత సంగీతం శాఖ ప్రొడ్యూసర్ పాలగుమ్మి విశ్వనాథం. ఇక ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌లు - బుచ్చిబాబు, దాశరథి, శ్రీవాత్సవ, బాలాంత్రపు రజనీకాంతరావు, భాస్కరభట్ల కృష్ణారావు, వీరుకాక వ్యవసాయదారుల కార్యక్రమంలో రావూరు భరద్వాజ, వార్తా విభాగంలో తురగా కృష్ణమోహనరావు, సాహిత్య విభాగంలో వేలూరి సహజానంద, నాటక విభాగంలో శారదా శ్రీనివాసన్, సంగీత విభాగంలో పాకాల సావిత్రీదేవి, నేతి శ్రీరామ శర్మ, సుసర్ల లక్ష్మీ నరసింహ శాస్త్రి, పుచ్చా సుబ్బారావు. అనౌన్సర్లు మల్లాది నరసింహ శాస్త్రి (మల్లాది రామకృష్ణశాస్త్రి గారబ్బాయి), డి.వెంకట్రామయ్య (అప్పటికి రచనలు చెయ్యడం నాకు గుర్తులేదు. తరువాత కథా రచన సాగించారు), జానపద విభాగంలో వింజమూరి సీతాదేవి, అనసూయ - ఇంత మంది మధ్య ముగ్గురు యువ రచయితలం ఉండేవాళ్ళం. శంకరమంచి సత్యం, నేనూ, ఉషశ్రీ

ప్రతి రోజూ రేడియో స్టేషన్‌కి దూకెయ్యాలని మనస్సు ఉరకలు వేసేది. తెల్లారి లేస్తే తెలుగు సాహితీ, రాజకీయ, కళారంగాలలో ప్రముఖులంతా రేడియో స్టేషన్‌లోనే ఉండేవారు. ఏదో తెలియని మత్తులో రోజులు గడిచిపోయేవి. కదిపితే మాట్లాడే ఒడుపూ, కలం పట్టుకుంటే వాక్యాలు ధారగా కురిసే నేర్పూ నాకూ, ఉషశ్రీలాంటి వాళ్ళకి వ్యసనమయిపోయింది. కొత్త మీడియంలోకి బరిలోకి దిగిన రేచుక్కల్లాగా దూకేశాం. ఆ అనుభవంతో ఉషశ్రీ తెలుగుదేశానికి పురాణ సంపదని పంచాడు. నేను మరో మాధ్యమానికి ప్రయాణం చేశాను.

తీరిక దొరికినప్పుడల్లా - తీరిక దొరకడం ఏమిటి? - తీరిక చేసుకుని ఎవరో ఒకరి దగ్గర కూర్చోవడం దినచర్య. అప్పటికి కృష్ణశాస్త్రిగారికి గొంతు ఆపరేషన్ జరిగి కంఠం పోయింది. ఆయన తెలుగుదేశం గర్వపడే గొప్ప వ్యక్తులలో ఒకరు. ఆయన ప్రసంగాలు - ఆర్కైవ్స్ ఇంగ్లీష్ టైపింగ్ - లో నేను విన్నాను. అలాంటిది - చేతిలో పుస్తకం పట్టుకుని చెప్పాల్సింది రాస్తూంటే బాధగా ఉండేది. మా తొలిరోజుల అనుభవం. ఆయన ఎప్పుడు కనిపించినా నమస్కారం చేసేవాడిని. ఓ రోజు నన్ను దగ్గరికి పిలిచి రాశారు. "మీరు నమస్కారం చెయ్యకపోతే నేనేమీ అనుకోను. కానీ ఎడమచేత్తో పెట్టకండి" అని. అప్పట్నుంచీ ఆయన్ని చూడగానే కుడి ఎడమల తడబాటు కాస్త ఉండేది. నాది ఎడమ చెయ్యివాటం. కనుక ఏ పనికయినా ఆ చెయ్యి ముందు తొందరపడుతుంది. తొలి రోజుల్లో గొంతు బొంగురుగా ఎంతో కొంత శబ్దం వినిపించేది. వారింటికి వెళ్ళి గంటల తరబడి కూర్చుని వారు చెప్పేవి వినేవాళ్ళం - ముఖ్యంగా నేనూ, శంకరమంచీను. ఒకసారి ఆవేశంగా నన్నయ్య గురించి వివరిస్తూ ఆయన పద్యాలు తను అనుకున్న రీతిలో చెప్పలేక పోయినందుకు కంటతడి పెట్టుకున్నారు. ఆయన వ్రాసిన చిన్నపుస్తకాలలో ఎన్నో వాక్యాలు చదివాను నేను. సాధికారికంగా చెప్పగలను - తెలుగు దేశం గర్వించదగ్గ చక్కని నుడికారంతో తెలుగు వాక్యాన్ని చెప్పడం ఆయన సొత్తు. అలాగే తెలుగు గద్యాన్ని చక్కగా రాసే కవులు - నా అనుభవంలో శ్రీశ్రీ, వేలూరి శివరామ శాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారలు.

ఒక రేడియో కార్యక్రమానికి రవీంద్రభారతిలో నేను తాజాగా రాసిన 'ప్రేమలో చైతన్యం' ప్రదర్శించాను. ఆ సందర్భంలోనే కృష్ణశాస్త్రిగారికీ, న్యాయపతి రాఘవరావుగారికీ నాటిక చదివి వినిపించాను. అంతా విని శాస్త్రిగారు ఇలా రాశారు: "నేను చూసే వ్యక్తులెవరూ ఇలా లేరు. ఉండరు. ఈ కథ మన కుటుంబంలో జరగడం నాకు తెలీదు. ఇంటలెక్చువల్‌గా ఉంది. ఇటువంటి కథలను మెచ్చుకునేంత మనవాళ్ళు మారలేదు. అలా ఉక్కిరి బిక్కిరి చేసే సంభాషణలు ఒక్కసారి మనవాళ్ళకి అర్థంకావు. ముఖ్యంగా నాకు. అయితే ఈ నాటిక తెలివిగా రాసిందే" అన్నారు.

వాస్తవికత నాటక రచనలో ఒక విధానం మాత్రమేననీ, ఇతివృత్తం, పాత్రల stylisation, ఒక్కొక్కప్పుడు carricature ( ఉదా:Don Quixote) allaegory- ఇవన్నీ ఆ ప్రక్రియకి రకరకాలయిన అలంకారాలనీ షానీ, ఆస్కార్‌వైల్డ్‌నీ, పీటర్ షాపర్‌నీ, అనూయిల్‌నీ సాక్ష్యం

తెచ్చుకునే వాడినే కానీ - నానాటిక కంటే అందంగా, సరళంగా చేసిన విమర్శనీ - అదిన్నీ కృష్ణశాస్త్రిగారి విమర్శని - నా ఆత్మకథ దాకా భద్రంగా దాచుకున్నాను. ఒకనాడు విశ్వనాథ, ఇప్పుడు శాస్త్రిగారూ - వీరందరి సమీక్షలూ నాకు ఆశీస్సులు.

రేడియో నాటక విభాగం ప్రొడ్యూసర్ స్థానం నర్సింహారావుగారని చెప్పాను. ఆయన తెలుగు దేశంలో మొదటి పద్మశ్రీలలో ఒకరు. చిత్తూరు నాగయ్యగారు, స్థానం తెలుగు దేశం గర్వించే ఆనాటి పద్మశ్రీలు. స్థానం వారికి చిన్న ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు ఉండేది. ఆయన అపూర్వమైన నటుడు. సందేహమే లేదు. కానీ రేడియో మాధ్యమం, ధ్వని ప్రక్రియ ఆయనకి కొత్త. అయితే ఆయన ఇంగువ కట్టిన గుడ్డ. మెల్లగా తన ధోరణిలో పనిచేసుకుపోతుండేవారు. ఆ రోజుల్లో ఆ విభాగాన్ని దాశరథిగారు చూసేవారు. ఎందుకనో ఇద్దరికీ పడేదికాదు. ఇద్దరూ సౌహార్థహృదయులు. కళాకారులు. అయినా ఇద్దరి మధ్య ఇసుక వేస్తే భగ్గుమనేది. అయితే ఇద్దరికీ నేనంటే వల్లమాలిన అభిమానం. నేనే నాటిక రాసిచ్చినా సరిగ్గా అర్థం కానీ నా అక్షరాల్ని నన్ను దగ్గర కూర్చోపెట్టుకుని దిద్దుకునేవారు స్థానం. అలా ఆయన స్వదస్తూరితో దిద్దుకున్న వ్రాతపతి ఒకటి ఇప్పటికీ నా దగ్గర ఉంది. "కోతీ! నువ్వేది రాసినా నా మెదడుకి బాగానే ఉంటుంది" అనేవారు వాత్సల్యంతో. నా వల్ల ఏ పని కావలసి వచ్చినా - స్థానంవారిని ఓ లంచం అడిగేవాడిని. అదేమిటంటే - ఆయన కాలంనాటి పౌరాణిక నాటక రంగం - అది స్వర్ణయుగం - అనుభవాన్ని ఏదో ఒకటి చెప్పాలి. బళ్ళారి రాఘవతో కలిసి నటించిన సందర్భాలూ, ఆడవాళ్ళు ఆయన వేషం చూసి అబ్బురపడడం, రాఘవగారి నటనా వైదుష్యాన్ని కేవలం ఓ జడ విసురుతోనో, చిరునవ్వుతోనో జయించడం - ఇలాంటివి వింటూ తన్మయుడనయేవాడిని. ఈ సందర్భాలలోనే ఆయన ఓ ప్రదర్శనకి సత్యభామ ఔద్దత్యాన్ని తెలుపడానికి అప్పటి పార్సీనాటకాల మాటలతో "మీరజాలగలడా నాయానతి" తనే ఎలా రాసుకున్నదీ చెప్పారు. ఆ పాట నాటక రంగంలో ఎంత ప్రాచుర్యాన్ని సాధించిందో నాటక ప్రియులకి వేరే చెప్పనక్కరలేదు. చాలా మందికి ఈ పాట స్థానం స్వయంగా రాసుకున్నదని తెలీదు.

మా అమ్మగారికి మొదటినుంచీ విశాఖ దాటి ఎక్కడో ఉద్యోగం చెయ్యడం సుతారమూ ఇష్టం ఉండేదికాదు. ఎక్కడో ఉంటూ ఆఫీసరునయేకన్నా ఊరిలో ఉంటూ గుమాస్తానయినా చాలనేది. ఆమె కోసం హిందుస్థాన్ షిప్ యార్డ్‌లో ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్ళాను కూడా. అదృష్టవశాత్తూ నాకా ఉద్యోగం రాలేదు. రేడియోలో చేరానని తెలిసి మా అమ్మగారు ఏమాత్రమూ ఆనందించలేదు. కాగా, ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్ అంటే ఏమిటో ఆవిడకి బొత్తిగా అర్థంకాలేదు. అర్థం చేసుకోవాలని ప్రయత్నించలేదు. రేడియోలో మాట్లాడుతావా? అని అడిగింది. వాళ్ళందరికీ నేనే పెద్ద అన్నాను. ఆవిడకి నచ్చలేదు. ఓసారి హైదరాబాదు వచ్చినప్పుడు ఆవిడని రేడియో స్టేషన్‌కి తీసుకెళ్ళాను. ఎదురుగా స్థానం వారొచ్చారు. ఆయన్ని గుర్తుపట్టి కొంగు భుజం చుట్టూ ఆనందంగా తిప్పుకుంది. మా అమ్మని ఆయనకి పరిచయం చేశాను. "చురుకయినవాడమ్మ మీవాడు" లాంటి మాటేదో అని ఆయన నా భూజం తట్టారు. ఆయన వెళ్ళాక "ఈయన ఇక్కడేం చేస్తున్నారు?" అని అడిగింది మా అమ్మ. ఇక్కడే ఉద్యోగం చేస్తున్నారన్నాను. ఆమె ముఖంలో చిరునవ్వు మొలిచింది. "నిన్ను కడుపుతో ఉన్నప్పుడు వారి నాటకాన్ని చూశాను. పోనీలే, అలాంటి పెద్దవాళ్ళతో పని చేస్తున్నావు" అంది. ఆ తరానికి నా ఉద్యోగానికి గుర్తింపు అలాంటి ప్రముఖులవల్ల. ఆ తర్వాత ఎన్నడూ నా ఉద్యోగాన్ని కించపరచలేదు మా అమ్మ.

దాశరథిగారికి నాపట్ల వల్లమాలిన అభిమానం. నన్ను ఎప్పుడూ అబ్బాయి అనో, మిత్రమా అనో, సోదరా అనో సంభోదించేవారు. ఈ అనుబంధం వారి చివరిరోజుల వరకూ సాగింది. అంతటి గొప్ప హృదయమున్న కవీ, అంతటి సౌహార్థమున్న వ్యక్తినీ నేనెరగను. అయితే ఆవేశి. లౌకిక ప్రపంచానికి ఆయన దూరం. బొత్తిగా బతక నేర్వనివాడు. ఎంత ప్రలోభాన్నయినా ఆయన డిగ్నిటీ జయించేది. స్నేహం కోసం ప్రాణం ఇచ్చే మనిషి. చివరంటా నన్నో యోధునిలాగా, పెద్దన్నలాగా కాపాడిన మనిషి. దాశరథిగారిని తల్చుకుంటే నాలో ఆవేశం పొర్లుకొస్తుంది.

ఓ రోజు రేడియో ఆఫీసులో పలకరించి "అబ్బాయ్! నిన్ను అన్నపూర్ణా దుక్కిపాటి మధుసూధనరావుగారు కలుసుకోవాలనుకుంటున్నారు" అన్నారు.

నేను తుళ్ళిపడ్డాను. ఆ రోజుల్లో అక్కినేని సాటిలేని మహానటులు. ఆయన ఛైర్మన్‌గా అత్యంత ప్రాముఖ్యాన్ని సాధించిన సంస్థ అన్నపూర్ణ. ఆ సంస్థ చిత్రాలు అపూర్వం. దానికి మేనేజింగ్ డైరక్టరు దుక్కిపాటి. "నన్ను వారు కలవడమేమిటి నేనే వారిని కలుస్తాను. ఎక్కడికి వెళ్ళాలో చెప్పండి" అన్నాను బలహీనంగా.

దాశరధిగారు భుజం తట్టి "అవసరం ఆయనది. ఎక్కడుంటున్నావో చెప్పు" అన్నారు. తరువాత దాశరధిగారూ, దుక్కిపాటిగారూ మా ఇంటికి వచ్చారు. గగన్‌మహల్ రోడ్డులో ఓ చిన్న ఔట్‌హౌసులో నివాసం. మా పెద్దబ్బాయి పదినెలల బిడ్డ. మా ఇంట్లో ఒకే కుర్చీ, ఒక గడ్డిమోడా, ఓ చిన్న అరుగు. ఇక్కడా అన్నపూర్ణా సంస్థ మేనేజింగ్ డైరక్టరుగారిని కలిశాను. తెల్లని బంగారు ఛాయ, మల్లెపువ్వులాంటి దుస్తులు, ఎప్పుడూ చలవ చేసిన బట్టల్లో దంతపు బొమ్మ దుక్కిపాటి.

"మేం కోడూరి కౌసల్యాదేవి గారి 'చక్రభ్రమణం' అనే నవల కొన్నాం. దానికి ట్రీట్‌మెంట్ మీరు రాసి పెట్టాలి" అన్నారు దుక్కిపాటి.

"నాకు సినీమా గురించి ఏమీ తెలియదు. నేనెప్పుడూ ఏదీ రాయలేదు" అన్నాను.

"వారికి అంతా తెలుసు. నీ చేత ఏమి రాయించాలో ఆయన చూసుకుంటారు" అన్నారు దాశరధిగారు. సరేనని తలూపాను.

ఆబిడ్స్ తాజ్‌మహల్ హోటల్లో రూము నంబరు 18కి వచ్చాం. గది తలుపు తెరుస్తూనే ఆయన మంచం మీద నా 'చీకటి చీలికలు' నవల, మిగతా రచనలు కనిపించాయి. దుక్కిపాటిగారు ఏంచేసినా ముందు చూపుతో, నిర్దిష్టమైన ఆలోచనతో, సునిశితమయిన వ్యాపార దక్షతతో చేస్తారు. ఆయన పరిచయం, వారి ద్వారా సినీ రంగ ప్రవేశం నా జీవితంలో ఊహించలేని, తిరుగులేని మలుపు. నా జీవితాన్ని పూర్తిగా మార్చేసిన సందర్భం. తదాదిగా నా జీవితమంతా సినీ రంగానికే ముడిపడిపోయింది. ఆ రోజుల్లో అన్నపూర్ణ సంస్థలో రచయిత కావడం అరుదయిన గుర్తింపు.

అంతకు ముందు ఆంధ్రప్రభలో ఉండగా వారపత్రిక నిర్వహించిన నవలల పోటీలో - వార పత్రిక సంపాదకులు బుద్దవరపు చిన కామరాజుగారు మొదటి విడత నవలల్ని వడపోసే పనిలో నన్ను చేర్చుకున్నారు. ఆఖరి ఎంపిక దాకా మా పరిశీలనలో వచ్చిన నవల చక్రభ్రమణం. ఆఖరి న్యాయ నిర్ణేత త్రిపురనేని గోపీచంద్‌గారనుకుంటాను. ఆయన చక్రభ్రమణం ఎంపిక చేశారు. ఇప్పుడు ఆంధ్రప్రభ వదిలి ఇక్కడికి వచ్చేసరికి మళ్ళీ ఆ నవల తటస్థ పడింది. ఈ పనికి దుక్కిపాటిగారు నిర్ణయించిన పారితోషకం వెయ్యిరూపాయలు. 1963లో దాని విలువ చాలా ఎక్కువ. నాకు 200 రూపాయలు అడ్వాన్స్ ఇచ్చారు. అదీ సినీమా రంగంలో నా మొదటి ఆదాయం. దాని విలువ తెలియాలంటే రేడియో ఉద్యోగంలో నా చేతికందిన మొదటి జీతం 145 రూపాయల ఇరవై పైసలు. అసలు నిర్ణయించిన జీతం 265 రూపాయలు.

నన్ను సారథీ స్టూడియోకి తీసుకు వెళ్ళి అక్కినేనికి పరిచయం చేశారు. "మారుతీరావుగారు మన కథకి ట్రీట్‌మెంట్ చేస్తున్నారు" అని సాధికారికంగా చెప్పారు దుక్కిపాటి.

ఇక చర్చలు ప్రారంభమయాయి. స్థూలంగా చూసేవారికి రంగస్థలానికీ, సినీమాకీ పెద్దగా తేడా కనిపించకపోవచ్చు కానీ - రెండూ రెండు భిన్నమయిన ప్రక్రియలు. రెండూ ఒక తల్లి బిడ్డలేగానీ కవలపిల్లలు కారు. నాటకీయత సినీమాకి లోపం. సినిమానీ రంగస్థలానికి దించడం శాపం. ఈ రెండు పనులూ చాల కాలం పాటు రెండు మాధ్యమాలలోనూ జరిగాయి. చాలా కాలం పాటు అక్కినేని, ఎన్.టి.ఆర్, శివాజీ మొదలయిన వారంతా కెమేరా ముందు స్టేజీ నటనే చేశారు. ఆశ్చర్యమూ లేదు, ఆక్షేపణా లేదు. అసలు మొదటి తెలుగు సినీమా కెమేరా ముందు నాటకాన్ని నటించగా అవతరించింది. దాని పేరు పాదుక పట్టాభిషేకం. అయితే ఇప్పుడూ కొందరు కెమేరా ముందు నాటకాన్నే వేస్తున్నారు!

దుక్కిపాటిగారు అలనాటి ఆంధ్ర నాటక కళాపరిషత్తు సహాయ కార్యదర్శి. ఆధునిక తెలుగు నాటకం తెలుగుదేశంలో నిలదొక్కుకునే దశకంలో ఆయన పాత్ర చాలా ఉంది. అక్కినేనితో నాటకాలు వేయిచారు. నాటకాలు రాయించారు. ఆ రోజుల్లోనే వారి ఎక్సెల్షియర్ నాటక సమాజం క్రమశిక్షణకీ, దక్షతకీ పెట్టింది పేరు. ఈ సంప్రదాయాన్నే, అనుభవాన్నీ సినిమా రంగానికి తెచ్చిన వారు దుక్కిపాటి. తీరిక వేళల్లో మా పిచ్చాపాటీ నాటక రంగం వేపు మళ్ళేది. అలనాడు పృథ్వీరాజ్ కపూర్‌నీ, శాంతారామ్‌నీ పరిషత్తుకి ఆహ్వానించిన ఘట్టాలూ, సావిత్రీ, వహీదా రెహమాన్ నాట్య ప్రదర్శనలూ - ఇవన్నీ చెప్పేవారు. ఇది మా ఇద్దరికీ మరొక బంధుత్వం.

కొత్త ఆలోచననీ, కొత్త వొరవడినీ వెండి తెరకి పరిచయం చెయ్యాలనే ఆర్తి దుక్కిపాటిది. ఒకసారి చక్రపాణిగారిని ఎవరో అడిగారట: "మీరు కొత్త రచయితల్ని పరిచయం చెయ్యరాదా?" అని. ఆయన సమాధానం: "ఎందుకూ, పాతవాళ్ళు బాగానే రాస్తున్నారుకదా?" అన్నారట. కొత్త కోసం తాపత్రయం, వారిని మలచుకోవడం - ఇది ప్రత్యేకమయిన అభిరుచి. అది పుష్కలంగా వున్న వ్యక్తి దుక్కిపాటి. నా కంటే ముందు 'కాలాతీత వ్యక్తులు' రచయిత్రి డాక్టర్ శ్రీదేవినీ, కొర్రపాటి గంగాధరరావుగారినీ, యద్దనపూడి సులోచనారాణినీ పరిచయం చేశారు. నేనూ మిత్రులు భమిడిపాటి రాధాకృష్ణ కలిసి 'ఆత్మగౌరవం' రచన చేశాం. తర్వాత మరొక రచయిత కావాలని నన్నడిగితే - నేనే స్వయంగా జంధ్యాల ఇంటికి వెళ్ళి ఆయన్ని నా స్కూటర్ మీద ఎక్కించుకుని తెచ్చి దుక్కిపాటిగారికి పరిచయం చేశాను. అలాగే ఎన్.గోపీని.

దుక్కిపాటి నాకు సినీమా గురువు. నాలాగే చాలా మందికీను. సీను ఎలా తీస్తారో, అక్కరలేని విషయాన్ని ఎలా దాటెయ్యాలో, ఎక్కడ కట్ చేస్తే విషయం సంగ్రహంగా వుంటుందో - ఇలాంటి విషయాలు సోదాహరణంగా చెప్పేవారు. ఇది వృత్తిపరంగా. వ్యక్తిత్వ పరంగానూ ఆయన దగ్గర చాల నేర్చుకున్నాను. ఆయన గుడివాడలో ఉండే రోజుల్లో పేకాట ఆడేవారట - నిమ్మగడ్డ కృష్ణారావుగారి లాంటి మిత్రులతో కలిసి. అయితే సినిమాకి వచ్చాక - అక్కినేనిగారు పేకాట ఆడుతూ (ఇంట్లోనే) కాలం వృధా చెయ్యడం గమనించారు. పైకొచ్చే నటుడికి ఆ పని మంచిది కాదని చెప్పాలి. అందుకని ముందు తను పేకాట మానుకున్నారు. తర్వాత అక్కినేనిని మందలించారట.

క్రమశిక్షణ ఎదుటి వ్యక్తిని నిలదీస్తుంది. అది లేని వ్యక్తిని భయపెడుతుంది. సినిమా రంగంలో సాధారణంగా లోపించేది అదే అందుకని దుక్కిపాటిగారంటే అందరికీ భయం వుండేది. సినిమా రంగంలో ఆనాటికీ, ఈనాటికీ ఆయనంటేనే నాకు కాళ్ళు వణుకుతాయి. అప్పటి ఆర్టు డైరక్టరు సుబ్బారావుగారు, కెమేరామాన్ సెల్వరాజ్ గారు, పి.ఏ.పి.లో అసిస్టెంటు డైరక్టరుగా ఉండే తాతినేని రామారావు - అంతా ఆయన్ని హెడ్‌మాష్టరుగారనేవారు. ఆఖరికి పంపిణీ దారులు కాట్రగడ్డ శ్రీనివాసరావు, పర్వతనేని చంద్రశేఖర రావు, నవయుగ విశ్వనాధ శర్మగారు, కాట్రగడ్డ నరసయ్యగారు - అందరికీ వారంటే చిన్న భయంతో కూడిన గౌరవం.

ప్రతీరోజూ రేడియోలో నా డ్యూటీ ముగియడానికి అరగంట ముందు - అప్పుడే చెక్కిన దంతపు బొమ్మలాగా - వచ్చి అతిధుల సోఫాలో కూర్చునేవారు. అటు వచ్చిన న్యాయపతి రాఘవరావుగారో, రావూరు భరద్వాజ, దాశరధిగారో ఆయన్ని పలకరిస్తూండేవారు. నా డ్యూటీ అవుతూనే కారెక్కేవాళ్ళం. ఇద్దరం కలిసి ఆబిడ్స్‌లో బృందావన్ హోటల్ చేరేవాళ్ళం. తప్పనిసరిగా ఓ స్వీట్, ఓ ఫలహారం తిని తీరాలి. అక్కడినుంచీ పబ్లిక్ గార్డెన్‌కి. మా సినీమా కథల చర్చలన్నీ అక్కడే ఏ రోజూ ఎనిమిది దాటటానికి వీలు లేదు. ఠంచన్‌గా ఎనిమిదింటికి నన్ను ఇంటి దగ్గర దింపేవారు.

చక్రభ్రమణం నవల చదవడానికయితే బాగుంది కానీ - సినీమాకి పెద్ద ఇబ్బందిలో పడ్డాం. నవలలో హీరోగారు మరొకాయన పెళ్ళాన్ని ప్రేమిస్తూ, ఆమె ఇంటికి తరచు వెళుతూ, ఆమె సమక్షంలో మైమరిచిపోతుంటాడు. భర్త ఇతని ప్రవర్తన అపార్థం చేసుకుంటాడు. చివరికి తెలుస్తుంది - చనిపోయిన చెల్లెల్ని ఆమెలో చూసుకుంటున్నాడని అపార్థం విడిపోతుంది. అదీ నవల. ఈ ఉత్కర్ష - 'వెంకట్రావు' అనే పాత్రగా నవలలో చదువుకుంటే బాగానే ఉంటుంది.

కానీ - పద్నాలుగు రీళ్ళు - అక్కినేని అనే సూపర్ స్టార్ మరొకరి పెళ్ళాన్ని ప్రేమిస్తున్నట్టు ఎలా చూపడం? చూపి, ఆయన వ్యక్తిత్వాన్ని ఎలా కాపాడడం? అందుకని హీరోకి చెల్లెలి పట్ల వల్లమాలిన ప్రేమ ఉన్నదనీ, ఆమె అర్థాంతరంగా పోయాక, ఫలానా వ్యక్తిలో ఆమె లక్షణాలు కనిపించాయని - బయటికి చెప్పలేక ఆ గుబులుని తనలోనే దాచుకున్నాడని చెప్పాము. ఇప్పుడిక ప్రేక్షకులకి ఆర్తిలేదు. పాత్రకి మాత్రమే అపార్థం. పోనీ ఆ భర్త 'నా పెళ్ళాన్ని ఎందుకు ప్రేమిస్తున్నావయ్యా?' అని నిలదీయవచ్చుకదా? అందుకని నిలదీయలేని స్థాయి హీరోది. ఆయన డాక్టర్ - ఇలా సమర్థించుకుంటూ వచ్చాం. బాగా ప్రచారంలోకి వచ్చిన నవల, బహుళ ప్రచారం పొందిన అన్నపూర్ణ సంస్థ నిర్మాణం, సూపర్ హీరో అక్కినేని, అటు సావిత్రి, రాజేశ్వరరావుగారి సంగీతం, ఆదుర్తి దర్శకత్వం, ఆత్రేయ సంభాషణలు - ప్రేక్షకుల్ని సమ్మోహితుల్ని చేశాయి. డాక్టర్ చక్రవర్తి ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా రాష్ట్రపతి రజిత పతకాన్ని గెలుసుకుంది. పెద్ద హిట్టయింది.

దుక్కిపాటి గారు చర్చల్లో కె.వి.రెడ్డిగారి బాణీని, పనిచేసే తీరునీ ముందు నూరిపోసేవారు. తెరమీద కథ మొదట కళ్ళ ముందు కనిపించేవరకు చర్చసాగేది. కలం, కాగితాలూ లేవు. రోజూ అదే పనిగా ఎవరో ఒకరు కథ చెప్పడం ప్రారంభించాలి. చెప్పడంలో ఎక్కడయినా ఆగడంకాని, తడువుకోవడం కాని జరిగితే అక్కడ కథకి మరమ్మత్తు అవసరమన్నమాట. ఆ సీను చర్చించాలి. స్క్రీన్‌ప్లే పూసల దండలాగ ఎక్కడా ఖాళీ లేకుండా ఉండాలి - అనేవారట రెడ్డిగారు. ఏ పూస లేకపోయినా ఖాళీ తెలియాలి. అంటే స్క్రీన్‌ప్లేలో ప్రతీ సీనుకీ తనదయిన ప్రాముఖ్యం ఉండాలి. అదీ ఆయన సిద్ధాంతం. దాదాపు 45 సంవత్సరాల పాటు నేనా సూత్రాన్ని మరిచిపోలేదు. కథ మాటల్లో నలిగి నలిగి - పాటలాగా ధారాపాతంగా పారినప్పుడు ఒక్కొక్క వాక్యంతో సినిమానంతటినీ దాదాపు పదిహేను నిముషాలలో ఒక కాగితం మీద రాసుకునేవాళ్ళం. ఇది సింగిల్ లైన్ ఆర్డరన్నమాట. అంటే - సినిమా అంతా రెండు అరటావుల్లో మా కళ్ళకి కట్టినట్టు కనిపించేది. ఆ తర్వాత మార్పులు చేసినప్పుడల్లా - ఈ అరటావులు మళ్ళీ మళ్ళీ రాసుకునేవాళ్ళం. అప్పటికి స్క్రీన్‌ప్లే వస్త్రకలితం చేసినట్టు నిగ్గుతేరిపోయేది.

సంభాషణలు రాసే దశవరకు నటుల ప్రసక్తి లేదు. కేవలం పాత్రల ప్రసక్తే. కృష్ణారావు గుమస్తా - అతనికి భార్య, అన్న - ఇదే కథ. అక్కినేని భార్య సావిత్రి, అన్న గుమ్మడి కాదు. పట్టుగా పాత్రీకరణలతో నడిచిన కథకి నటులు బలాన్నీ, బరువునీ ఇస్తారు. పట్టులేని కథలో పెద్ద నటుల్ని ఇరికిస్తే లోపాల్ని ఇట్టే బయట పెట్టేస్తారు. ఇదీ కె.వి.రెడ్డిగారి బాణీయే.

రోజులు, నెలలు, వారాల తరబడి చర్చ. ప్రతిరోజూ అదే రొటీను, అదే పబ్లిక్ గార్డెను. మొత్తానికి ట్రీట్‌మెంట్ పూర్తిచేశాను. ఇక ఆత్రేయ గారికోసం ఆతృతగా ఎదురు చూశాను. ఆయనకి తాజ్‌మహల్ హోటల్లోనే రాసినదంతా చదివి వినిపించాను. మధుసూదనరావుగారూ నా పక్కన ఉన్నారు. తీరా విన్నాక, మధుసూదనరావుగారు అటు వెళ్ళాక ఆత్రేయ నాతో అన్నారు: "ఇదా స్క్రీన్‌ప్లే అంటే! ఇది లేకపోయినా నేను డైలాగులు రాయగలను." నాకూ నవ్వొచ్చింది. ఆత్రేయ గొప్ప సరసులు. చక్కని మిత్రులు. నాగురించీ, నా నాటకాల గురించీ విన్నారు. మంచి సమయస్ఫూర్తి ఉన్న మాటకారి. అంతకు మించి 'బద్ధకస్తుడు' అని సినిమా రంగంలో ప్రచారంలో ఉన్న మాట. అయితే కథ సన్నివేశం వంట బట్టేవరకు కలం కాగితం మీద పెట్టరన్నది ఆయనతో పనిచేసిన వారంతా చెప్పే విషయం. ఏమయినా అద్భుతమయిన రచనలు చేసి, తనదయిన హోదానూ, స్థాయినీ ఆద్యంతమూ నిలుపుకున్న సినీ శ్రీనాథుడు ఆత్రేయ. ఆయనకి చేతకానిది ఒక్కటే - డబ్బుని నిలుపుకోవడం. ఆయన డబ్బు అడిగితే - ఇవ్వడాన్ని గ్లామరస్‌గా చెప్పుకున్న నిర్మాతలు నాకు తెలుసు. వాళ్ళని ఏడిపించి, - పాటనో, సీనునో ఇస్తే - ఏడిపించడాన్ని అందంగా జ్ఞాపకం చేసుకునే వానిటీని సినీపరిశ్రమకి అలవాటు చేసిన గడుసు రచయిత. అయితే ఆ పాటా, మాటా ఆ నిరీక్షణని మురిపించేదిగా వుండేది. తన బద్ధకాన్ని 'కళ'గా చేసి, తన 'అశ్రద్ధ'ని అలంకారంగా చెప్పుకునే స్థాయిలో పరిశ్రమని నిలిపిన 'నిరంకుశుడు' ఆత్రేయ.

హైదరాబాదులో ఉన్న కొద్దిరోజులలోనే నాకు బాగా సన్నిహితులైపోయారు. ఆయన నా గురించీ నా నాటకాల గురించీ విన్నారు. మా ఇంటికి భోజనానికి ఆహ్వానిస్తే - ఆ రోజుల్లో నూటిరవై రూపాయలు చార్జీ అయేలాగ టాక్సీలో ఊరంతా తిరిగి, ఎనభై రూపాయలు స్వీట్స్ కొని ఇంటికి భోజనానికి వచ్చారు.

ఆ రోజుల్లో మాటలకంటే పాటలు వ్రాయడంలో ఆయన ఉత్సాహం ఎక్కువ చూపేవారు.. (అప్పటికింకా మూగమనసులు రెడీ కాలేదు) "పాడమని నన్నడగతగునా?" అన్నపాట వ్రాసి మాటలు వ్రాస్తానని అయిదురోజులు ఊరించి, ప్రొడక్షను మేనేజరుని తీసుకెళ్ళి రకరకాల పెన్నులూ, కాగితాలూ, కుక్క బిస్కట్టులూ - ఏవేవో కొన్నారు. ఈలోగా ఎవరికో ఆరోగ్యం బాగాలేదని మద్రాసు నుంచీ టెలిగ్రాం వచ్చింది. అంతే - మద్రాసు వెళ్ళిపోయారు. ఇలాంటి టెలిగ్రాములు రప్పించడం ఆయనకి కొత్తకాదన్నారు సినీ రంగంలోని వారు. ఏమయినా ప్రతిభని పరపతిగా తర్జుమా చేసుకున్న ఆనాటి ప్రముఖ రచయిత ఆత్రేయ.

అప్పుడే నన్ను మధుసూదనరావుగారు హైదరాబాదు నుంచి మద్రాసుకు విమానంలో రప్పించారు. అది నా మొదటి విమాన ప్రయాణం. అప్పటి విమానం టిక్కెట్టు నూటతొంభై రూపాయలని గుర్తు. మద్రాసులో అన్నపూర్ణా ఆఫీసుకి వచ్చేసరికి శ్రీశ్రీ ఆత్రేయ, రాజేశ్వరరావుగారలు వున్నారు. పాటల రచన జరుగుతోంది. ఈ వ్యక్తులూ, ఈ వాతావరణం, అన్నపూర్ణా ఆఫీసు - నన్ను గాలిలో నిలిపాయి. మధుసూదనరావుగారు తన గదిలోనే నాకు వసతి ఏర్పాటు చేశారు. ఆయన పక్క మంచమ్మీద వుండగా నిద్రపట్టేది కాదు. పక్క గదిలో చిన్న లైబ్రరీ. ముందు సినిమాల సెన్సారు స్క్రిప్టులుండేవి. అందులోంచీ 'దొంగరాముడు' స్క్రిప్టు తీసి నాకు చదవమని ఇచ్చారు మధుసూదనరావుగారు. ఒక మహోదర్శకుడి అద్భుత కళాఖండమది. *

ప్రతి సీనుని రచన దశలోనే చదువుకుని, నిడివిని వాచీతో నిర్దేశించుకుని, ఏం చేయాలి, ఎంతవరకు చేయాలి అని ముందే ప్లాన్ చేసేవారట రెడ్డిగారు. ఆ ప్రణాళికని షూటింగులో తు.చ తప్పకుండా పాటించేవారు. ఇందుకు మరో సాక్ష్యం - ఆ తరువాత నాతో కలిసి పనిచేసిన - ఒకనాటి రెడ్డిగారి అసిస్టెంటు డైరక్టరు సింగీతం శ్రీనివాసరావుగారు. ఎవరైనా సెట్టుమీద కొత్త ఆలోచన చెపితే "బాగుంది బ్రదర్, వచ్చే సినీమాలో వాడదాం. ఆ రోజు ఈ ఆలోచనకి ఎందుకు సెటిల్ అయామో ఇప్పుడు గుర్తుండకపోవచ్చు. కానీ బాగా ఆలోచించాకే నిర్ణయించాం" అనేవారట! సెట్టు మీదే డైలాగులు రాసుకునే దుర్దశకి ఇదీ రెడ్డిగారి సమాధానం!

స్క్రీన్‌ప్లే ఎంత సునిశితమయిన దృష్టితో నిర్ణయించారో చెప్పడానికి ఒక చిన్న ఉదాహరణ. దొంగరాముడులో అక్కినేని దొంగ. చెల్లెల్ని చూడాలని బయలుదేరతాడు.

కట్ చేస్తే న్యాయంగా ఇంట్లో అడుగు పెట్టే షాట్ పడాలి. కానీ మధ్యలో ఓ యాభై అడుగుల షాట్ పక్కన మూడు సార్లు పెన్సిలుతో గుర్తులు పెట్టుకున్నారాయన. ఆ యాభై అడుగులూ ఏమిటంటే - దొంగరాముడు ఇంటికి వచ్చేసరికి చెల్లెలు ఇంట్లో వంటరిగా వుందని ప్రేక్షకులకి చెప్పే షాట్! మామగారు రేలంగి భార్య సూర్యాకాంతంతో బయటికి వెళుతూ "ఇల్లు జాగ్రత్త కోడలా, బయటికి వెళుతున్నాం" వంటి డైలాగు వుంది. ఆ షాట్ వృధా అని ఆయన మనస్సు పీకింది. కానీ అత్తమామలు ఇంట్లో లేరన్న వివరం చెప్పాలని మనస్సు హెచ్చరిస్తోంది. అందుకని తప్పనిసరిగా ఆ యాభై అడుగులూ ఉంచాల్సి వచ్చిందట. ఇంత పరిశీలన, ఇంత ఆలోచన

---

*(నేను కడప రేడియోలో పనిచేస్తున్నప్పుడు - దాదాపు ఇరవై ఏళ్ళ తరువాత ఏ ఆరో సారో 'దొంగరాముడు' రిలీజు అయితే ఊరి చివరి హాల్లో వారం రోజుల పాటు హౌస్‌ఫుల్ కలెక్షన్లతో నడిచింది. అదీ దొంగరాముడు సార్వజనీనత. తీరా ఇది కాశీ మజిలీ కథ కాదు. పౌరాణిక గాథ కాదు. జానపదం కాదు. కేవలం ఒక మామూలు సినీమా కథ. ఓ దర్శకుని ప్రతిభ ఆ చిత్రాన్ని చరిత్రగా మార్చింది!)

ఆయన చిత్ర నిర్మాణంలో వుంది కనకే ఒక దొంగరాముడు, ఒక మాయాబజారు, ఒక యోగివేమనలాంటి కళాఖండాలను సృష్టించారాయన. మధుసూదనరావుగారనేవారు - మా సంస్థ అదృష్టం రెడ్డిగారు మా మొదటి దర్శకులు కావడం అని. నా అదృష్టం - నా మొదటి, రెండో సినిమాలు మధుసూదనరావుగారి సాహచర్యంలో ఆ బాణీని అలవరుచుకోవడం. ఇది గొప్ప విశ్వవిద్యాలయంగా నేను భావిస్తూ ఉంటాను.

అయినా మొదటి సారి పప్పులో కాలేసిన సందర్భం తలచుకుంటే ఇప్పటికీ నవ్వు పుట్టిస్తుంది. స్క్రిప్టు అంతా రాసేశాక - ఆత్రేయ ఏదో పని మీద వెంకటగిరి వెళ్ళారు. తెల్లారితే డాక్టర్ చక్రవర్తి ముహూర్తం. ఆ సీను సిద్ధంగా లేదు. (బహుశా ఏమైనా మార్పులు అనుకున్నారేమో తెలీదు) సాయంకాలం హడావుడిగా దుక్కిపాటి రేడియోకి వచ్చారు. నేను డ్యూటీ లో వున్నాను. రేపు ఉదయం బేగంపేట విమానాశ్రయంలో డాక్టర్ చక్రవర్తి విదేశం నుంచీ విమానంలో దిగే సీను, కృష్ణకుమారి, గుమ్మడి, చలం - ఇంకా మిత్రులంతా ఆహ్వానించడానికి పూలమాలలతో సిద్ధంగా వున్నారు. ఆ సీను సిన్మాకి మొదటి సీను. షూటింగు ప్రారంభానికి మొదటి సీను. ఆత్రేయ కష్టాలు చెప్పి, సీను వివరంగా చెప్పి అప్పటికప్పుడు రాసిపెట్టాలన్నారు. నాకు చిన్న భయం, పెద్ద ఆవేశం. మొదటిసారిగా సీను రాయాలి. రాత్రి పదకొండు గంటలకి డ్యూటీ అయిపోతుంది. అప్పుడు వస్తానన్నారు మధుసూదనరావుగారు. అప్పటినుంచీ రేడియో స్టూడియోలో కూర్చున్నాను. సీనులో అక్కినేని, కృష్ణకుమారి, ఇంకా చాలామంది వున్నారు. అందరూ చక్కగా, గొప్పగా మాట్లాడాలి. దాదాపు ఇరవై పేజీల సీను రాశాను! పదకొండు గంటలకి మధుసూదనరావుగారు వచ్చారు. సీను చూడగానే ఆయనకి గుండె జారిపోయింది. అక్కడ ఆఫీసులో సీనుకోసం ఆదుర్తిగారు ఎదురు చూస్తున్నారు. ఈ సీను ఎలా చూపడం? ఒక్కసారి ఆలోచించి - సీను లోపల పడేసి నన్ను కారెక్కించుకున్నారు.

ఆదుర్తిగారిని నేనదే కలవడం. "మారుతీరావుగారు రేడియో డ్యూటీలో వున్నారు సీను రాసే వ్యవధిలేదు. తీసుకొచ్చాను" అని చిన్న అబద్ధం ఆడారు - నన్ను చిన్నపుచ్చకుండా. అప్పటికప్పుడు కూర్చుని ఒక సీను అనుకున్నాం. అది కేవలం అయిదారు డైలాగులు వచ్చినట్టు గుర్తు. నటులు ఎంత గొప్పవారయినా అందరూ అన్నివేళలా అన్ని సీన్లలోనూ మాట్లాడనక్కరలేదు. సన్నివేశం వాక్యాల అవసరాన్నీ, ప్రాధాన్యాన్నీ నిర్ణయిస్తుంది. ఎంతో మంది గొప్ప నటులున్న సీను నిశ్శబ్దంగానూ సాగవచ్చు. ఈ సూత్రాలు తర్వాత తర్వాత నేర్చినవి.

# దేవుణ్ణి ఛాలెంజ్ చేసిన మనిషి

## - చిరంజీవి



గొల్లపూడి మారుతీరావు గారు బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన పేరు వినగానే ముందుగా ఎవరికైనా ఆయన 'కలం' బలం గుర్తుకొస్తుంది. నేను సినిమా రంగ ప్రవేశం చేసేనాటికే ఆయన రచయితగా రాణిస్తున్నారు. అంతకుముందు ఆయనను ఒకటి, రెండు పర్యాయాలు చూశానే తప్ప పరిచయం మాత్రం లేదు. 'ఐలవ్‌యు' సినిమా సమయంలోనే ఆయనతో నాకు ప్రత్యక్ష పరిచయం కలిగింది. ఎస్. భావనారాయణగారు నిర్మించిన ఆ

చిత్రంలోనేను కథానాయకుణ్ణి. గొల్లపూడిగారు ఆ చిత్రానికి సంభాషణల రచయిత. ఆర్టిస్టులకు ఆయన సంభాషణలు ఎలా ఉచ్చరించాలో చెబుతూ ఉండేవారు. అలాగే ఆ చిత్ర కథానాయకుడినైన నాకు గొల్లపూడిగారు ఏ సందర్భంలో ఎలా డైలాగులు చెప్పాలో నేర్పించేవారు. సినిమాకు సంబంధించిన వర్క్ పూర్తికాగానే ఆయనలోని సాహితీవేత్త బయట పడేవాడు. ఆయనకు తెలుగు, ఇంగ్లీష్ రెండు భాషల్లోనూ మంచి పట్టువుంది. రెండింటా సాహిత్య పరిజ్ఞానం కూడా మెండుగా వుండేది. సాహిత్యం మీద నాకు పెద్ద అవగాహన లేక పోయినా, మంచి శ్రోతనని చెప్పుకోగలను. అలా మారుతీరావుగరు చెప్పే సాహితీపరమైన విషయాలెన్నింటినో ఆసక్తిగా వింటూ వుండేవాడిని.



నాకు అప్పట్లో స్టేజ్‌పై మాట్లాడాలంటే ఎలాగో ఉండేది. మారుతీరావుగారు మాత్రం శ్రోతలను ఆకట్టుకునే విధంగా మాట్లాడేవారు. ఆయన ఆలిండియా రేడియోలో పనిచేసే రోజుల్లో ఎందరో అభిమాన శ్రోతలను సంపాదించుకున్నారు. అయితే నేను ప్రత్యక్ష శ్రోతను కాబట్టి మరింత ఆనందంగా వుండేది. 'మీరింత బాగా మాట్లాడుతున్నారు, నేనూ అలా మాట్లాడాలంటే ఎలా అని అడిగానోసారి. కొందరివి మాటలు వినడానికి వస్తారు. మరి కొందర్ని చూడటానికి వస్తారు. నువ్వు రెండో రకం. కాబట్టి నువ్వు పెద్దగా మాట్లాడకపోయినా ఫరవాలేదు. నువ్వు మాట్లాడాలనుకున్న విషయం ముందుగా అనుకో. అది పొందికగా మాటల్లో పెట్టు. తక్కువ మాట్లాడినా అనుకున్న విషయం క్లుప్తంగా, సూటిగా వుంటే అందంగా వుంటుందనేవారు. ఆయన సలహా ఇప్పటికీ ఫాలో అవుతూ వుంటాను. అంత తెలిసిన ఆయనకు కూడా కొన్ని విషయాలు నేను నేర్పవలసి వస్తుందనుకోలేదు.



గొల్లపూడిగారు నటునిగా నటించిన తొలి చిత్రం 'ఇంట్లోరామయ్య - వీధిలో కృష్ణయ్య'. అందులో నేను హీరోని. ఆయన ప్రతి నాయక పాత్ర పోషించారు. ఆచిత్ర దర్శకుడు కోడిరామకృష్ణకు దర్శకునిగా అదే తొలి చిత్రం. సినీ నటునిగా మారుతీరావుగారు గారు కూడా అదే చిత్రంలో సినీరంగ ప్రవేశం చేశారు. అప్పటికే పలు చిత్రాలకు రచనలు చేసినా, స్టేజిమీద నటించినా మారుతీరావుగారికి కెమెరా ముందు ఎలా నటించాలో, ఏ యాంగిల్‌లో ఎలా ఉండాలో, ఫోకస్ పాయింట్, ఫీల్డ్ ఎంట్రీ కొత్తగా ఉండేది. ఆ సమయంలో నేను ఆయనకు లైటింగ్ ఎలా తీసుకోవాలి, కెమెరా యాంగిల్‌ను దృష్టిలో వుంచుకుని ఎలా నటించాలి వంటి విషయాలు ఆయనకు చెప్పటం జరిగింది. ఒకప్పుడు డైలాగులు ఎలా చెప్పాలీ నాకు ఆయన నేర్పితే.. అలా గురువైన ఆయనకే పాఠాలు నేర్పటం అదో తమాషా అనుభవం. ఆ తరువాత మా ఇద్దరి మధ్య అనుబంధం చిత్రం చిత్రానికి ప్రవర్ధమానమయింది.

మా ఇద్దరి మధ్య మంచి 'చుట్ట'రికం కూడా వుంది. నిర్మాత భావనారాయణగారు, మారుతీరావుగారు ఇద్దరూ 'చుట్ట'లను మహా ఇష్టంగా పీల్చేవారు. నాకు సిగరెట్ అలవాటు కూడా వుండేది కాదు. దానితో పొగ పడేదికాదు. వాళ్ళిద్దరూ ఇష్టంగా చుట్టలను కాలుస్తుంటే

వింతగా అనిపించేది. 'పొగ తాగనివాడు దున్నపోతై పుట్టున్' అంటూ ఓ పద్యం వినిపించి, చుట్ట కాలిస్తేనే అందులోని మజా తెలుస్తుందని, నాకు వాయిస్‌లో మంచి బేస్ వస్తుందని చెప్పి నాతో చుట్ట కాల్పించారు. ఆ విధంగా మా మధ్య 'చుట్టరికం' కుదిరింది. ఆ తరువాత ఎప్పుడైనా చుట్టవాసన వస్తే వెంటనే మా 'చుట్టం' గారైన మారుతీరావుగారు గుర్తొస్తుంటారు. అంత స్ట్రాంగ్‌గా చుట్టుకుపోయింది మా మధ్య ఆ 'చుట్టరికం'.

ఎప్పుడూ సరదాగా వుంటూ ఇతరులను కూడా సంతోషపరిచే నైజం మారుతీరావుగారి సొంతం. తన పిల్లల్ని కూడా స్నేహితులుగా చూసే గొప్పతనం ఆయనది. ఆయన తన కుమారుడు గొల్లపూడి శ్రీనివాస్‌ను తెలుగు చిత్రపరిశ్రమకు దర్శకునిగా పరిచయం చేశారు. అయితే ఆ సంతోషం అట్టే నిలువనీయకుండా శ్రీనివాస్‌ని అతను దర్శకత్వం వహిస్తున్న తొలిచిత్రం 'ప్రేమపుస్తకం' షూటింగ్ సమయంలోనే భగవంతుడు తనదగ్గరకు తీసుకుపోయాడు. అప్పుడు మారుతీరవుగారిని చూసి ఒకింత ఆశ్చర్యానికి కూడా లోనయ్యాను. ఆయన గంభీరంగా నాతో అన్నమాటలు... "దేవుడు భౌతికంగా నా బిడ్డను నా నుంచీ దూరం చేయగలడేమో కానీ, మానసికంగా దూరం చేయడం వల్లకాదు. నాకు వాడు మరింత దగ్గరయ్యాడు" అన్నారు. దానికి నిదర్శనంగా ఆయన 'శ్రీనివాస్' పేరిట ఒక ఫౌండేషన్ స్థాపించారు. తర్వాత ఎందరో కళాకారులను ప్రోత్సహిస్తూ మరెందరో యువ దర్శకులకు అవార్డులనిచ్చి, వారందరిలోనూ తన బిడ్డను తీసుకుపోయిన ఆ దేవునితోనే ఛాలెంజ్ చేసి గెలిచిన తీరు, మరెంతోమంది బిడ్డల్ని సొంతం చేసుకున్న ఆయన నైజం, ఆయన గుండె నిబ్బరానికి, ఆయన మానసిక పరిపక్వతకి జోహార్లనిపిస్తుంది.

ఈనాడు ఇది ఆయనకు జరుగుజరుగుతున్న షష్టిపూర్తికాదు. అపారమైన మేధస్సుకి, పరిపూర్ణమైన వ్యక్తిత్వానికి జరుగుతున్న షష్టిపూర్తి ఇది. నాకు అత్యంత ఆత్మీయుడైన శ్రీ మారుతీరావుల జంట మరో షష్టి పూర్తి కూడా జరుపుకోవాలని మనసారా ఆకాంక్షిస్తున్నాను.

*(గొల్లపూడి మారుతీరావుగారి షష్టిపూర్తి సంచిక నుంచి)*

---

ఇలా అన్నారు..

*అనుభూతులు అరుదుగా కలిసి వస్తాయి. చరిత్రలు చర్విత చరణం కావు*

*వసంత కాలంలో ఒక్క కోకిల కూయడం మానేస్తే వసంతం ఆగిపోదు. కాని గంధర్వగానం ఆ మేరకు చిన్నబుచ్చుకుంటుంది.*

*కొందరికి మృత్యువు విడుదల, కొందరికి ముగింపు, కొందరికి పరిష్కారం, కొందరికి శిక్ష, కొందరికి ప్రశ్న..!*

*మారుతీరావుగారి 'ఎలిజీలు 'నుంచీ.*




# సినీ రచన - నాడు, నేడు

## అనుభవాల కలంనుంచీ అనేక విషయాలు



1931లో 'భక్తప్రహ్లాద నాటకాన్ని కెమేరాముందు ప్రదర్శించారు. ఎంతో కొంత సినీమా గురించి అవగాహన వున్న పెద్దమనిషి, ఓ ఎడిటరూ దాన్ని ప్రదర్శన యోగ్యం చేశారు. నాటకాన్ని చూడడానికి అలవాటు పడిన ప్రేక్షకులు - అదే నాటకాన్ని, నటుల్నీ, పద్యాల్నీ తెరమీద కదిలే బొమ్మలు చూపుతూంటే అబ్బురంగా చూసి ఆనందించారు. ఈ విధంగా సినీరంగంలోకి దొడ్డిదారిన నాటకరంగం ద్వారా సినీ రచయిత రంగప్రవేశం చేశాడు.

అలనాడు సి.పుల్లయ్యగారు 'పాదుక' నాటకంలో నటించిన నటుల్ని కలకత్తా తీసుకు వెళ్ళి కెమేరా ముందు నిలిపారు. ఆ రోజుల్లో ఎవరికీ సినిమాకి కావలసిన ఇతివృత్తాన్నో, ప్రక్రియనో తయారు చేసుకోవాలనే ఆలోచన వున్నట్టు కనిపించదు. కొత్త ప్రక్రియని లొంగదీసుకోవడం, ప్రేక్షకులు ఆనందించే ఇతివృత్తాలను అందించడం - ఇదే లక్ష్యం. అదృష్టవశాత్తూ - ప్రేక్షకులకి కావలసిన ఇతివృత్తాలు మృష్టాన్న భోజనాలలాగ నాటకరంగంలో కనిపిస్తున్నాయి. ప్రఖ్యాత హాలీవుడ్ దర్శకులు సిసిల్ బి.డిమిల్లీ ఓసారి 'టెన్‌కమాండ్‌మెంట్స్' గురించి ప్రస్తావిస్తూ "రెండువేల సంవత్సరాలుగా జనబాహుళ్యంలో ఉచితంగా పబ్లిసిటీ సంపాదించిన క్రీస్తు కథని నేనెందుకు వదులుకోవాలి?" అన్నారు.

చాలా మందికి కోపం రాకుండా వుంటే - నిన్న మొన్నటిదాకా అప్పుడప్పుడు - అలవాటు మరిచిపోతే తప్ప నటులూ నాటకాన్నే కెమేరా ముందు ప్రదర్శిస్తున్నారు Cinema is an accident on trhe screen. ఇలా చెపుతున్నప్పుడు - మన రచయితల, దర్శకుల సామర్థ్యాన్ని కించపరచడం ఉద్దేశంకాదు. ఎందుకనో మొదటినుంచీ - కేవలం సంభాషణలు రచన చేసేపని రచయితదీ, వాటిని తెరమీదకి మలిచే పని దర్శకునిదీ అయి కూచుంది. This has become an unwritten rule.

నిజానికి సినిమాని కాగితం చిత్రించే దర్శకుడు రచయిత సెల్యూలాయిడ్ మీద రచించే రచయిత దర్శకుడు అన్నాను నేను. మంచి సినిమాలో ఈ రెండు పనులూ ఇద్దరూ చేస్తూండాలి. లేకపోతే ఆ చిత్రం రాణించదు.

స్క్రీన్‌ప్లే సాధారణంగా ముగ్గురు కలయికతో రూపుదిద్దుకుంటుంది. ముగ్గురి మేధస్సు సమన్వయం అది. రచయిత, దర్శకుడు, ఎడిటరు. గొప్ప స్క్రీన్‌ప్లేలన్నీ ఈ ముగ్గురి సమన్వయంతో తయారయినవే. ఏ విదేశీ చిత్రంలోనైనా ఈ ముగ్గురి పేర్లూ లేనిదే స్క్రీన్‌ప్లేని పేర్కొనడం జరగదు.. 'షిండ్లర్స్ లిస్ట్' లాంటి అద్భుతమైన చిత్రానికి స్టీవెన్ స్పీల్‌బర్గ్ ఆస్కార్ బహుమతిని పుచ్చుకుంటూ ఆ చిత్రానికి స్క్రీన్‌ప్లే రాసిన రచయితకి పెద్ద పీట వేశారు.

ఎర్నెస్ట్ లేమన్, ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్, ఎల్మర్ రైస్, టెన్నిసీ విలియమ్స్, షిడ్నీ షెల్డన్ గొప్ప స్క్రీన్‌ప్లే రచయితలకి ఉదాహరణలు. స్క్రీన్‌ప్లేలో ఎడిటింగ్ అవగాహన ప్రాణప్రదం, ఆయువుపట్టు. అందుకనే గొప్ప ఎడిటర్స్ గొప్ప దర్శకులు కావడాన్ని చరిత్ర చెపుతుంది. బిమల్‌రాయ్, హృషికేష్ ముఖర్జీ, రాజ్‌కపూర్, ఆదుర్తి సుబ్బారావు లాంటివారిని ఇక్కడ గుర్తుచేసుకోవచ్చు.

20th Century Fox అధినేత డెరిల్ జానక్ ఒకప్పుడు మామూలు రచయిత. రచయితగా హాలీవుడ్‌లో రాణించలేకపోయాడు. తర్వాత ఫాక్స్ స్టూడియోల అధినేత అయాడు. ఆయన కాంట్రాక్టులో ముఖ్యభాగం - ఏ దర్శకుడు ఎంత గొప్ప చిత్రాన్ని తీసినా చివరలో దాన్ని ఎడిట్ చేసే హక్కు ఆయనదే ఆ కారణంగానే ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ ఆ స్టూడియోకి చిత్రాలు తీయడానికి నిరాకరించాడు.

నేను అన్నపూర్ణా ఆఫీసులో మొదటిసారిగా కె.వి.రెడ్డిగారి 'దొంగరాముడు' స్క్రీన్‌ప్లే చదివాను. అద్భుతమైన స్క్రీన్‌ప్లే రచయితలలో కె.వి.రెడ్డిగారొకరు. అయితే దక్షతతో ఇందాక చెప్పినట్టుకాకపోయినా, మనసులో ఒక రూపాన్ని దిద్దుకుని కాగితం మీద దాని స్వరూపాన్ని తెచ్చే మరో గొప్ప రచయిత కె.ఎస్.ప్రకాశరావుగారు. నా ఉద్దేశంలో 'తాసిల్దారుగారమ్మాయి' ఒక నమూనాగా చెప్పుకోదగినంత విలక్షణమైన స్క్రీన్‌ప్లే. నా అనుభవంలో స్టూడియోలో అడుగుపెట్టే ముందు నిర్దుష్టంగా కెమేరా కదలికలతో సహా పేపరు మీదకి తెచ్చుకునే మరో డైరక్టరు ఒకాయన వున్నారు - ఆయన ఎన్టీరామారావు. ఆయన రామాయణం స్క్రీన్‌ప్లేని, సంభాషణల్ని నాకు స్వయంగా చదివి వినిపించగా విన్నాను. ఎప్పుడో బాపూగారు డైలాగ్ పేపరు మీద ఆయా షాట్ల స్కెచెస్ వేసుకోవడం చూశాను. అలాంటి పనే సత్యజిత్‌రే చేసేవారట. ఇదంతా విపులంగా చెప్పడానికి కారణం - అందరూ ఒకే విధంగా స్క్రీన్‌ప్లే రాసుకోనక్కరలేదు. ఒక్కొక్కరికి ఒక్కో ఒడుపు వుంటుంది. వైవిధ్యం వుంటుంది.

కానీ దురదృష్టవశాత్తూ మన రచయితలకి షాట్ గురించి ఆలోచించే అవకాశాన్ని కూడా ఏ దర్శకుడూ కల్పించినట్టు కనిపించదు. నా తరంలో మాట నేను చెప్పేది. "మీరు సంభాషణలు రాసి ఇవ్వండి సార్. దర్శకుడు వాటిని చూసుకుంటారు" అంటారు. కానీ దర్శకుడు చెయ్యాల్సిన పని రచయిత ముందుగా పేపరు మీద చెయ్యాలని చాలా మందికి తెలియదు. మీరు క్షమిస్తే చాలామంది దర్శకులకే తెలీదు.

మన సినీ రచనకి ఓ ఉదాహరణని ఉట్టంకిస్తాను. సాధారణంగా మన రచయిత ఇలా రాస్తాడు'

పెద్ద భవనం అది. పోర్టికోలోకి కారు వచ్చి ఆగింది.

భవన మెట్ల మీద ఒకావిడ నిలబడి వుంది.

కారులోంచి శేఖర్ దిగాడు. సరాసరి వెళ్ళి ఆమె కాళ్ళకి నమస్కరించాడు.

శేఖర్:అమ్మా!

నవ్వు వినిపించింది. శేఖర్ ముఖంలో ఆశ్చర్యం.

అటు చూశాడు. వామనరావు దగ్గరకి వచ్చాడు.

వామన: ఆమె అమ్మ కాదు బాబూ, అమ్మ అని పదిమందిని నమ్మించడానికి నేను నిలబెట్టిన బొమ్మ. ఇక నుంచీ ప్రపంచానికి ఆమే నీ అమ్మ.

శేఖర్ ముఖంలో షాక్.

ఇదీ ధోరణి. నిజానికి స్క్రీన్‌ప్లే ఇలా సాగాలి.

వైడ్ యాంగిల్ షాట్ - పెద్ద భవనం.

కెమేరా పోర్టికో మెట్ల మీద నిలబడిన స్త్రీ వెనుక వుంది. (సజెషన్ షాట్)

అంటే ఫ్లోర్ గ్రౌండులో స్త్రీ వీపు తెలుస్తోంది. దూరం నుంచీ కారు కెమేరావైపు వస్తోంది. పోర్టికోలో ఆగింది.

మిడ్ షాట్ - కారులోంచి శేఖర్ దిగాడు. కెమేరా వైపు చూశాడు.

కౌంటర్ మిడ్ షాట్: స్త్రీ మూర్తి తెలుస్తోంది. ఆమె ముఖం మీద నీడ. ముఖం స్పష్టంగా తెలియడంలేదు.

దాదాపు ఇలా సాగాలి. నిజం చెప్పాలంటే చాలా మంది సినీరచయితలు ట్రాలీ గురించీ, టాప్ యాంగిల్ షాట్ గురించీ ఆలోచిస్తారనుకోను. ఆ పని డైరెక్టర్‌దీ, ఎడిటర్‌దీ అని వారి భావన. నిజానికి చాలామంది భావన అదే.

మొదట్లో సినిమా టెక్నిక్ బొత్తిగా వంట పట్టని రోజులు. అయినా సినిమాల్ని ప్రజలు ముమ్మరంగా చూశారు. ఎందుకు? తెరమీద కదిలే బొమ్మల కొత్తదనం. అంతకు మించి తమకు ఇదివరకే తెలిసిన - స్టేజి నటులు చూపే నటన అవే సన్నివేశాలు. ఇంకా చెప్పాలంటే ప్రజాజీవనంలో నలిగిన - పౌరాణిక, చారిత్రక ఇతిహాసాలూ, కథలూ - పల్నాటి యుద్ధం, బొబ్బిలి యుద్ధం, కాశీమజిలీ కథలు, కాటమరాజు కథ, దేశింగురాజు కథ - ఏదైనా కానీ. ఇతివృత్తం సినీమాకి బలమైన గ్యారంటీ. టెక్నిక్ లోపాల్ని భర్తీ చేసే ఆయుధం, ప్రజల మోజు మరొక గొప్ప ఊతం.

మెల్ల మెల్లగా సాంఘిక సమస్యలు, ఇతివృత్తాలు వచ్చాయి. అవీ బలమయిన, అతి స్థూలమయిన ప్రాచుర్యంలో వున్న ఇతివృత్తాల నకళ్ళు. పురాణ పురుషులకి మోడరన్ చొక్కాలు తొడిగారు. శ్రీరాముడు అవతార పురుషుడు. ఏకపత్నీవ్రతుడు. రామారావు ఆదర్శమూర్తి. ఏకపత్నీవ్రతుడు. తగాదా లేదు. అర్జునుడు అన్నగారి మాట జవదాటడు. వెంకట్రావు అన్న రాఘవయ్య మాట జవదాటడు. హరిశ్చంద్రుడి సత్యవాక్య పరిపాలనకే అంతిమ విజయం. అప్పలరాజు నిజాయితీకే అంతిమ విజయం. ఇవన్నీ స్థూలమయిన మెలోడ్రామాలు. సావిత్రి యముడితో పోరాడి మొగుడి ప్రాణాన్ని రక్షించుకున్న మహా పతివ్రత. అప్పలమ్మ కూడా అంతే. ఆమె చివరలో గ్రామ దేవత అయింది. హిందీలో అయితే 'మదరిండియా' అవుతుంది. ఈ కథ రాణించకుండా పోయే అవకాశం లేదు. రావణుడు చివరికి మరణించాలి. అతడు చెడు ప్రవర్తన కలవాడు కనుక. పేర్లు స్టెబిలైజ్ అయిపోయాయి. దుర్మార్గులంతా - నాగరాజు, ఫణీంద్ర, జగ్గూలు. హీరోలంతా - సత్యం, రామారావు, శివయ్య, విష్ణుమూర్తి. స్త్రీలయితే సీత, సావిత్రి, అనసూయ, పద్మిని. ఇవన్నీ గ్యారంటీ ఇతివృత్తాలు. హీరో 'సత్యానికే జయం' అని పాట పాడుతాడు. హీరోయిన్ మంగళ సూత్రం తన ప్రాణం కన్నా ఎక్కువని ఆవేశపడుతుంది. పాతివ్రత్యాన్నీ, ఏకపత్నీవ్రతాన్నీ, వెంకటేశ్వరస్వామిని సినీమావాళ్ళు వాడినంత విరివిగా నిజజీవితంలోనూ ఎవరూ ఉపయోగించరేమో. ఇవి ఆయువుపట్లు.

అయితే సమాజ ధోరణి మారి అవినీతి, అక్రమాల ప్రభావం హెచ్చినప్పుడు మరికొన్ని కొత్త ఇతివృత్తాలు ఉద్భవించాయి. వీటిలో పీడించే పంచాయితీ ప్రెసిడెంటు నాశనం కావాలి. రిక్షాలాగే యాదగిరికి న్యాయం జరగాలి. ఎర్రజెండా మీద పాట వుండాలి. డప్పు మోగాలి.. జనసందోహం వూరేగాలి. ఇది సినిమావారికి తెలిసిన, లేదా ప్రేక్షకుడిని బులిపించగల మరో మత్తుమందు. సమస్యకి పరిష్కారం విధ్వంసమే. ఇది గల్లా పెట్టెని దృష్టిలో ఉంచుకుని ప్రేక్షకులకి మప్పిన స్టయిలైజ్డ్ వామ పక్ష సిద్ధాంతపు సినిమా రుచి.

అంటన్ చెఖోవ్ 'స్లీప్', డోస్టవిస్కీ 'ఓవర్కోట్' స్థాయి కథలు ఎవరికీ అక్కరలేదు. వారికి కావసింది crude generalisation. ఆ మాటకి వస్తే ముందు చెప్పిన కథలూ అంతే. కాలేజీ లెక్చెరర్ దగ్గర్నుంచీ, మిల్లు కూలీదాకా, ఆఫీసు ఉద్యోగి నుంచీ, ఇల్లాలివరకూ చిత్రం రక్తికట్టాలంటే ఇతివృత్తం వీలయినంత జనరలైజ్ కావాలి.

న్యాయం వర్ధిల్లాలి అనడం సుళువు. అది అందరూ ఆశించే, అర్థం చేసుకునే స్లోగన్.

కాగా సినిమా ప్రేక్షకులు - ఎక్కువగా మధ్య తరగతి, క్రింది తరగతి వర్గానికి చెందినవారు. వీరికి జీవితంలోనూ, కళలోనూ మెలోడ్రామాయే ప్రాణం. ఏనాటికయినా దుర్మార్గుడయిన ఆఫీసరు బదిలీ కావాలని, డబ్బు ఎగ్గొట్టే రిక్షా యజమాని కాలు విరగాలని - తద్వారా అతనికి బుద్ధి రావాలని ఆశిస్తాడు. తను నిత్య జీవితంలో చెయ్యలేనివీ, చెయ్యాలని కలలు కనే పనులన్నీ తెర మీద హీరో చెయ్యడం అతనికి ఉపశమనం. దొంగ సెక్యూరిటీ!

రాణించిన ఇతివృత్తాలు పదే పదే పేర్లు మార్చుకుని ప్రేక్షకులముందుకు వచ్చాయి. నేనే నా కెరీర్‌లో ఓ కథని నాలుగుసార్లు రాశాను. అన్ని పౌరాణిక ఇతివృత్తాలకీ సాంఘికమయిన నమూనాలు వచ్చాయి. అవి రాణించాయి. ఉమ్మడి కుటుంబం, భర్త పోయిన పతివ్రత కథ, పట్టెడన్నం తిన్న స్వామి భక్తి, దేశభక్తి, త్యాగం - ఇవన్నీ సేఫ్ కథలు.

పతివ్రత శ్రీలక్ష్మమ్మ కథని ఇద్దరు నిర్మాతలు ఒకేసారి తీశారు. రైతుల కథలు కోకొల్లలు. పీడిత వర్గ విజయాల మీదే కొందరు బాంకు ఎకౌంట్లు పెంచుకున్నారు. కమ్యూనిస్టు నిర్మాతలు కూడా వేంకటేశ్వర స్వామి మీదే ముహూర్తం షాట్ తీశారు. నిజానికి వేంకటేశ్వరుడు సినిమా వారికి కొంగు బంగారం. ఇది వారికి హిపోక్రసీ కావచ్చు. కానీ ప్రేక్షకులకి అలవాటయిన ప్రపంచం.

పౌరాణిక ఇతివృత్తాలను దాటి సాంఘికాల వైపు నడిచిన రోజుల్లో కూడా రచనలో పౌరాణిక ఇతివృత్తాల ఛాయలు మిగిలాయి. 1940 ప్రాంతాల్లో వచ్చిన కాశీమజిలో కథ గొల్లభామ. ఓ రాజుగారు గుర్రం మీద పోతూంటే ఆమె చల్లకుండ పగిలి ఆయన మీద చిందింది. కోపంగా చూశాడు.

రచయిత అక్కడ పద్యం రాశాడు

భూపతి చంపితిన్ మగడు భూరి భుజంగము జేత చిక్కెనే<br>
ఆపద చెంది చెంది ఉదయార్కుని పట్టణ మేగి వేశ్యనై<br>
పాపము గట్టుకొంటి, అట పట్టి విటుండయి రాగజూచి<br>
తాపము జెంది అగ్నిబడి దగ్ధముగా కిటు గొల్లభామనై<br>
ఈ పని కొప్పుగొంటి, నృపతీ వగపేటికి చల్ల చిందినన్

ఆ రోజుల్లోనే కథంతా ఫ్లాష్‌బాక్‌లో చెప్పారు. అదీ అప్పటి పురోగతి.

ఇవాళ ప్రేక్షకులకు చెప్పు తీసి కొట్టినట్టు హత్తుకోవాలని 'నా సెల్యూలర్ ఫోనా, లేడీస్ టాయిలెట్ సోపా' అని రాస్తున్నారు గానీ - ఆ రోజుల్లో - అంటే ఛందస్సు నడుం విరగ్గొట్టమని కవులు రొమ్ములు విరుచుకున్న రోజుల్లో సాంఘిక ఇతివృత్తంలో పద్యం పాడితే రాణించింది. ఆ సినీమా ముమ్మరంగా వసూళ్ళు చేసింది.

మరీ 'ఘటోత్కచ అనే సినీమాలో రాక్షసులు 'పిబ మధురం, మనోహరం - పిబ జడితి పిబ పిబ' అని పాడారు.

ఈ రోజుల్లో ప్రేక్షకులను రంజింపజేయడానికి దేబిరింపు ఎక్కువయింది. అభిరుచి దారిద్ర్యం చేసుకుంది. బాడ్ టేస్టుకి సినిమావాళ్ళు సాకులు వెదుకుతున్నారు గానీ, ఈ దేశంలో 1940 ప్రాంతంలో పై పల్లవిని ప్రేక్షకులు చూశారు. ఆనందించారు.

ప్రేక్షకులకి అవసరమయిన ఇతివృత్తాన్ని గర్వంగా అలంకరించే దశనుంచీ ప్రేక్షకుల ఆనందానికి ఇతివృత్తాన్ని దొంగ తోవలు పట్టించే దశకి సినిమా జారిపోయింది. సినిమా కూడా క్రమంగా వినియోగవస్తువయిపోయింది.

టెక్నిక్ ఊహించనంత గొప్పగా పెరిగిపోయింది. సాంకేతిక నిపుణులు ఏ దేశం వారికీ తీసిపోనంత స్థాయిని సాధించారు. కథ గ్లోబలైజ్ అయింది. స్విట్జర్లాండులో పాట పాడతాడు. పాడాలని ప్రేక్షకులు ఎదురుచూస్తారు. టెక్నిక్, డబ్బు, అలరించాలనే ఆతృతా కారణంగా ఇతివృత్తం అయింది. Idealistic hero మారి dialectical hero వచ్చాడు. ఇతివృత్తంలో మెలోడ్రామాకి బదులు అట్టహాసం పెరిగింది. సమస్యలు వెనకబెంచీలోకి పోయాయి. ప్రజల ఆదర్శాల్లోంచీ ఆలోచనల్లోకి, అక్కడినుంచీ వారి కలల్లోకి, వారి ఊహాగానాలలోకి ఇతివృత్తం పరకాయ ప్రవేశం చేసింది. తత్కారణంగా వాస్తవికతని పోగొట్టుకుంది. అయినా గిల్టు నగకి మెరుగులు దిద్దినట్టు టెక్నిక్ సినిమాని అలంకరించి బుకాయించాలని చూస్తోంది.

టెక్నిక్ సహకారం లేని రోజుల్లో బలమయిన generalised themes నుంచీ, టెక్నిక్ మాత్రమే కాపాడే అవాస్తవికత దాకా సినిమా ప్రయాణం చేసింది. ఇది మన దేశానికీ, భాషకీ మాత్రమే కాదు ప్రపంచ సినిమాకీ - ముఖ్యంగా హాలీవుడ్‌కీ వర్తిస్తుంది. అయితే నలుగురితో చావు పెళ్ళితో సమానమని చంకలు గుద్దుకునే దురదృష్టమిది.

ఓ అన్నగారు తమ్ముడు ప్రేమించిన అమ్మాయినే ప్రేమించాడు. తమ్ముడు ప్రేమిస్తున్న కారణంగా అతని మీద ఈర్ష్యనీ, అసహనాన్నీ పెంచుకున్నాడు. ఆ పిల్లను అనుభవించబోయాడు. గ్రహించి ఎదిరించబోయిన తమ్ముడిని చంపాడు. తెలుసుకున్న ఆ అమ్మాయి అతన్ని చంపింది. ఈ కథని తమిళ ప్రజలు ముమ్మరంగా చూశారు. డబ్బింగ్ చేసిన తెలుగు చిత్రాన్ని తెలుగు ప్రజలూ చూశారు. పాదుకా పట్టాభిషేకం నుంచీ మనం ఎంత దూరం ప్రయాణం చేశామో గుర్తుచేసుకోడానికి ఇది ఒక సైన్ పోస్ట్.

భార్య పురిటికి వెళ్ళింది. భర్త ఓ అందకత్తె వ్యామోహంలో పడ్డాడు. సుఖాల్లో మునిగితేలాడు. భార్య తిరిగి వచ్చింది. అందకత్తెని వదిలించుకుందామనుకున్నాడు. ఆమె వదలలేదు. వెంటబడింది. వేధించింది. చివరికి ఆమెని చంపవలసి వచ్చింది. ఇదీ ఓ అక్రమమైన డ్రామేయే. దుర్మార్గం నశించింది కనుక. ఇందులో సెక్సుని అలంకరించారు అద్భుతమైన టెక్నిక్‌తో. ఆ సినిమా పేరు బేసిక్ ఇన్‌స్టింక్ట్.


సినిమా అందమైన కత్తి. అతి క్రూరమైన కత్తి. అప్రమత్తంగా ఉండకపోతే పీకని కత్తిరిస్తుంది. టెక్నిక్ 'చెడు'నీ గ్లామరస్‌గా తీర్చిదిద్దగలదు. Good technique, more often than not, over emphasizes the idea. If you cannot qualify the idea, it hits the moral fibre of the society.

ప్రేక్షకుడి మీద ఈ ధోరణుల ప్రభావం ఏమిటి? ఈ ప్రశ్న ఎవరు వేసుకుంటున్నారు? ఎవరు వేసుకోవాలి?

Camera narates truth 24 times per second అన్నాడు గొదార్డ్. సినిమానే నమ్ముకుని అమ్ముకుంటున్న టీవీ ఛానళ్ళు truth distort అయి distoretion glamorize అయి, అమ్మకదారుడి చేతిలో పడినప్పుడు సమాజం గతి ఏమిటి?

ఏమో, ఈ ప్రశ్నకు ఎవరు సమాధానం చెప్పాలో తెలీదు!

## ఆశీస్సులు
## కీ.శే.శ్రీ.డి.వి.నరసరాజు



మారుతీరావు - నటుడు - రచయితగానే చాలా మందికి తెలుసు.

అతను 'వ్రాయసగాడే' గాక - 'వ్రాయించే' వాడని - నాలాంటి - కొద్దిమందికే తెలుసు.

అతను - ఆకాశవాణి మదరాసు కేంద్రంలో పనిచేస్తుండగా - ఎంతో మంది రచయితలు, కవులచేత తన చాకచక్యమూ - తెలివితేటలు ఉపయోగించి - నాటకాలు - కవిత్వాలూ - వ్రాయించేవాడు.

ఏ రచయిత మీద ఏ అస్త్రం వేస్తే పనిచేస్తుందో అతనికి బాగా తెలుసు.

శ్రీశ్రీకి డబ్బు ఎప్పుడూ అవసరమేనని తెలిసిన మారుతీరావు - చెక్కు ముందుగానే తయారు చేయించి జేబులో పెట్టుకుని - శ్రీశ్రీ రికార్డింగ్ కాగానే ఆయన అడక్కుండానే చెక్కు చేతిలో పెట్టి పంపేవాడు. అది శాపమో ఏమో గానీ - రచయితల్లో చాలా మందికి

డబ్బు అవసరం తప్పనిసరిగా వుంటుంది. అటువంటి వాళ్ళచేత నాటకమో, కవిత్వమో వ్రాయమని ప్రోత్సహించి ఉభయతారకంగా తనపని సాధించుకుని వాళ్ళకు ఆర్థికంగా సహాయపడేవాడు. ఈ రెండూ అస్త్రాలు పని చేయని నాబోటి వాళ్ళ దగ్గర వేరే మార్గం అనుసరించేవాడు. కనబడినప్పుడల్లా "రేడియోకి ఒక నాటకం వ్రాసి పెట్టండి" అని స్నేహపూర్వకంగా అడిగేవాడు. అదేపనిగా కనపడినప్పుడల్లా అడుగుతుంటే నాకు విసుగు పుట్టి చనువుగా "పోవయ్యా! నీ రేడియో నాటకం రాస్తే - నాకు కూలి కూడా గిట్టదు! గంట నాటకం రాయాలంటే కనీసం 60 పేజీలన్నా రాయాలా? ఇంకో 60 పేజీలు రాస్తే ఒక సినిమా స్క్రిప్టు పూర్తవుతుంది. కొన్ని వేలు వస్తాయ్! నీకు రాస్తే ఏమిస్తావ్? ముష్టి మూడు వందలు చేతిలో పెడతావ్" అనేవాణ్ణి. నవ్వి ఊరుకునేవాడు.

1963 ప్రాంతంలో అనుకుంటాను. ఒకరోజు నుంగంబాక్కం లేక్ ఏరియాలో మా ఇంటికి వచ్చాడు.

"నరసరాజుగారూ! సొంత ఇల్లు ఒకటి ఏర్పాటు చేసుకోవాలని ఉంది. అందుకు కావలసిన సొమ్ము కూడా కూడబెట్టుకున్నాను. మీరయితే సరైన సలహా ఇస్తారని వచ్చాను. స్థలం కొని ఇల్లు కట్టుకోమంటారా? లేక కట్టిన ఇల్లే కొనుక్కోమంటారా?" అని అడిగాడు.

"రెండూ వద్దు" అన్నాను.

"అదేమిటి?" అని విస్తుపోయాడతను?

నేను చెప్పాను. "చూడు మారుతీరావు! స్థలం కొనడం తేలికే. కానీ ఇల్లు కట్టడం పూర్తి అయ్యేసరికి నీకు బ్లడ్ ప్రెషర్ పెరుగుతుంది. ముందు తాపీ మేస్త్రితో నీ ప్రోబ్లం ప్రారంబమవుతుంది. వాడు చెప్పినవాడితోనే నువ్వు ఇసుక తోలించుకోవాలి. ఇటుకలు, సిమెంటు కొనుక్కోవాలి. ఎందుకంటే వాళ్ళందరి దగ్గర అతనికి కమీషన్ వస్తుంది. అతను చెప్పిన వాళ్ళ వద్దకాక వేరే చోట నుండీ తెప్పించుకున్నావనుకో 'ఈ ఇసుక రివర్ శాండ్ కాదండి! సీ శాండ్! పనికిరాదంటాడు. సిమెంటులో కల్తీవుందంటాడు. ఇటుకలు నాణ్యమైనవి కావని విరగ్గొట్టి చూపుతాడు. అంతటితో ఆగదు వాడితో సమస్య. నీ ఇల్లు కట్టడం మొదలు పెడతాడు. కాస్త కట్టి, ఆపి; మరో నాలుగు చోట్ల కట్టడాలు ఒప్పుకుంటాడు. ఎప్పుడు వస్తాడో తెలియదు! నువ్వు వాడి చుట్టూ తిరగాలి. వాడు రాడు, ఇంకొకణ్ణి రానివ్వడు! నీ ఇల్లు ఎప్పుడు పూర్తి అవుతుందో నీకు తెలియదు. ఇదే కథ - దర్వాజాలు, కిటికీలు చేసే వడ్రంగి మేస్త్రితో. వాడు కొనమన్న షాపులోనే నీవు కొనాలి! షరా మామూలే! ఇల్లు కట్టడం పూర్తయి ఫ్లోరింగ్ కోసం మరొకడు వస్తాడు. ఆ తరువాత ఎల్క్ట్రికల్ ఫిట్టింగ్స్. ఆ తరువాత ప్లంబర్. వీళ్ళందరిదీ ఒకటే ధ్యేయం! నీకు హైపర్ టెన్షన్ వచ్చేదాకా వదలరు. ఇల్లు కట్టుకోవాలంటే ఇన్ని బాధలు పడాలి!

పోనీ ఈ బాధలన్నీ ఎందుకని - కట్టిన ఇల్లే కొనుక్కున్నావనుకో! ఇన్నాళ్ళకు సొంత ఇల్లు లభించిందన్న ఆనందంతో ఇల్లాలు ఉన్న కాస్త స్థలంలో ఒక ములగచెట్టు, ఒక కరివేపాకు చెట్టు, ఒక జామచెట్టు, ఒక సపోటా, ఒక దానిమ్మ, ఒక మామిడి, ఒక బొప్పాయి, ఇలా చెట్లు పెంచుతుంది. నువ్వు ఆఫీసుకు పోతావ్! పిల్లలు స్కూలుకు పోతారు! ఇల్లాలు మధ్యాహ్నం కాస్త నడుం వాలుస్తుంది. దోవన పోయే కుర్రాడు బంతి కోసం వచ్చానంటాడు. లేకపోతే చెట్ల కాయలతోపాటు ఉతికి ఆరేసిన బట్టలుకూడా పట్టుకు పోతాడు. ఒక వేళ ఇల్లాలు లేచి వాణ్ణి పట్టుకుందనుకో - 'అమ్మో! బాబోయ్' అని బిగ్గరగా ఏడుస్తాడు. దోవనపోయే నలుగురూ పోగవుతారు. నన్ను కొట్టిందని వాడు బావురుమంటాడు. "ఏమమ్మా! పసివాడు! పండుకోసం ఆశపడ్డాడే అనుకో అంతమాత్రాన కొడతావా? నీది కన్న కడుపు కాదూ!" అని నోటికివచ్చినట్లు - తిడతారు!

నేను చెప్పేదంతా మారుతీరావు శ్రద్ధగా విని "నరసరాజుగారూ! నేను ఇల్లు కడతానో, కొంటానో అదలా వుంచండి. ఇప్పుడు మీరు చెప్పినదంతా శ్రమ అనుకోక కాస్త కాగితం మీద పెట్టి ఇవ్వండి. నాకు ఒక నాటకం లభిస్తుంది అన్నాడు.

నిజమే! అతను చెప్పినట్టే రాసి ఇచ్చాను - రేడియోకి - నాటకం - "సొంత ఇల్లే స్వర్గం".

అంతకంటే చాలా మంచి నాటకం రేడియోకి రాయించాడు మారుతీరావు. "బస్తీలో బహు కుటుంబీకుడు" నా చేత ఆ నాటకం రాయించడానికి మరోఅస్త్రం ప్రయోగించాడు మారుతీరావు. "ఇంతవరకూ ఆరువారాల సీరియల్స్ రాశారు గానీ ఎవరూ ఎనిమిది వారల సీరియల్ వ్రాయలేదు. అది అందరికీ సాధ్యం కాదు మీలాంటి చేయి తిరిగిన రైటర్స్‌కి తప్ప!" అని నా 'ఇగో'ని టికిల్ చేశాడు. ఓల్డ్ ఏజ్ ప్రోబ్లమ్స్ మీద రాశాను. దానిని బాగా శ్రద్ధగా రికార్డ్ చేసాడు మారుతీరావు. సాక్షిరంగారావు, రావికొండలరావు ప్రధాన పాత్రలు. ఆ తరువాత ఒక సందర్భంలో ఆ నాటకం యన్.టి.ఆర్‌కి చదివి వినిపించాను. ఆయన చాలా ఇంప్రెస్ అయి "సినిమాకి అడాప్ట్ చేయండి! మనమే తీద్దాం" అన్నారు. 'పుణ్య దంపతులు' అనే పేరుతో సినిమాకి అడాప్ట్ చేసి ఇచ్చాను. ఇచ్చిన మూడునెలలకి ఆయన రాజకీయరంగ ప్రవేశం చేశారు. ఆ తరువాత కథ అందరికీ తెలిసిందే!

ఇప్పుడు ఆ (పుణ్యదంపతులు) స్క్రిప్టు ఎక్కడ వుందో! ఎవర్ని అడగాలో తెలియదు. మారుతీరావుగారికంటే వయసులోనైనా పెద్దవాణ్ణి గనక అతన్ని నిండా నూరేళ్ళు ఆరోగ్యంగా ఐశ్వర్యంతో వర్ధిల్లమని ఆశీర్వదిస్తున్నాను. అంతేకాదు! అతని నూరేళ్ళ పండగ ఎంతో వైభవంగా జరగాలనీ ఆ పండగకు కూడా ఇలాగే ఒక సావనీర్ ప్రచురించాలనీ ఆ సావనీర్‌లో కూడా ఇలాగే అతన్ని ఆశీర్వదిస్తూ నేను నాలుగు ముక్కలు రాయాలనీ (నా వయసిప్పుడు 80 ఏళ్ళు) చాలా చిన్న కోరికకదూ!

***రచనాకాలం: 2001***

*అవినీతికి సాకు కావాలి. అభిరుచికి అవకాశం కావాలి. మందు తాగేవాడు మనస్తాపం నుంచి ఆటవిడుపు కావాలంటాడు. సిగరెట్టుకాల్చేవాడు చికాకుల ముడులు విప్పుకుంటున్నానంటాడు. మహా సంగీత విద్వాంసుడు కావల్సిన వాడికిమంచి గురువు అవకాశం. ఉత్తమ ప్రవర్తనకి మహాత్ముడి దర్శనం అవకాశం..!*

***సాయంకాలమైంది నవల నుంచీ గొల్లపూడి మారుతి రావు***




# రేచకుడు

## అనుభవాల కలంనుంచీ అనేక విషయాలు

*ఈ దశాబ్దంలోనే కాక బహుశా గత కొద్ది దశాబ్దాలలోనూ ఉత్తమ నవలగా పేర్కొనదగిన గొల్లపూడి మారుతీ రావు గారి 'సాయంకాలమైంది' నవలనుంచీ ఒక అధ్యాయాన్ని 'కౌముది' పాఠకులకి ప్రత్యేకంగా అందిస్తున్నాం. ఈ అధ్యాయం ఒక్కటే విడిగా చదివినా మనసుల్ని కదిలించే కథగా నిలిచిపోతుంది. ప్రధాన కథలో ఇది ఒక ఉపకథమాత్రమే. ప్రధాన కథలోని అంశానికి సమతుల్యంగా ఉండడానికి గాను ఈ రేచకుడి పాత్రని సృష్టించినట్లు శ్రీమారుతీ రావుగారు చెప్పారు. "మొత్తం నవల ఒక ఎత్తైతే ఈ ఒక్క అధ్యాయం ఒక ఎత్తు " అని మాజీ ప్రధాని స్వర్గీయ పి.వి.నరసింహారావు గారు అన్నా, ఈ నవలలోని ఒక్కో అధ్యాయం చదివిన ప్రతిసారీ కన్నీళ్ళు వరదలయ్యేవని శ్రీకె.వి.గోపాలస్వామి గారు అన్నా, ఈ నవల వ్రాతప్రతిని తీసుకునేందుకు వచ్చిన ప్రతికాప్రతినిధి ఈ అధ్యాయం చదివి గొల్లపూడి గారి కాళ్ళకి నమస్కరించారన్నా - ఏమాత్రం అతిశయోక్తి కాదని ఈ అధ్యాయం చదివిన ప్రతివారూ అంగీకరిస్తారని మా నమ్మకం..! ముందుకి పదండి..*



డిట్రాయిట్‌లో తనతో పని చేస్తున్న స్నేహితుడు విష్ణుమూర్తి తల్లిదండ్రుల్ని చూడటానికి శ్రీకాకుళం దగ్గర రణస్థలానికి కారులో వెళ్ళాడు తిరుమల. అందుకు ప్రత్యేకమైన కారణం ఉంది. అమెరికా వెళ్ళినప్పటినుంచీ బిడ్డల్ని దూరం చేసుకున్నామని బాధపడే తండ్రులు, కుటుంబానికి దూరమయ్యామని బాధపడే కొడుకులూ ఏ కొద్దిమందయినా ఉండి ఉంటారు. కానీ వాళ్ళందరికీ భిన్నమయినావారు విష్ణుమూర్తి తల్లిదండ్రులు. ఈ విషయాన్ని పదే పదే తిరుమలకి చెప్పి గర్వపడేవాడు విష్ణుమూర్తి. తిరుమల ఇండియాకు వెళుతున్నాడనగానే తల్లికి అత్యాధునికమైన గ్రైండర్, తండ్రికి కాళ్ళకి కీళ్ళనొప్పులు పోయేలాగా రబ్బరు కణుపులున్న రెండు చెప్పుల జతలూ ఇచ్చి పంపాడు విష్ణుమూర్తి. ఈసారి ఇండియా ప్రయాణంలో బాధ్యతగానే కాక, ఆసక్తికరంగా ఎదురు చూస్తున్న కార్యక్రమం కోసం రణస్థలం ప్రయాణం. హైవేకి తూర్పుగా ఎనిమిది మైళ్ళలోపున గిరగాం అనే చిన్నపల్లె. అక్కడ ఉంటున్నారు విష్ణుమూర్తి తండ్రి బత్తుల రేచకుడు, ఆయన భార్యా. ఆయన అరవై ఎకరాల మోతుబరి. చదువు తప్ప అన్నీ ఉన్నవాడు. ఆయన కుటుంబంలో అటు ఏడు తరాలూ, ఇటు ఏడు తరాల్లో చదువుకున్నవాడు విష్ణుమూర్తే.

గిరిగాం వచ్చాక రేచకుడి గురించి కనిపించిన మొదటి వ్యక్తే దారి చూపించాడు. కానీ అంతా తిరుమలని చూసి నిర్ఘాంతపోయారు.

"తమరొస్తున్నట్టు ఆరికి తెలుసా బాబూ?" అనడిగాడు ఓ రైతు సైకిలాపి ఆశ్చర్యంగా.

"ఏం?"

"ఎవర్నయినా ఇంటికి తీసుకెళితే నరికేస్తారు బాబూ... ఆరు ఎవరినీ చూడరు. ఎవరినీ ఇంటికి రానివ్వరు."

"మరి వ్యవసాయం ఎలా?"

"ఆరికి వ్యవసాయం ఓ లెక్కేంటి బాబూ! పాతికెకరాల్లో జీడిమామిడి, మరో పదెకరాలు మామిడీ ఉంది. నామాటిని వెనక్కి ఎళిపోండి బాబూ!" అన్నాడు.

రేచకుడిని కలుసుకోవాలనే ఆత్రం మరింత ఎక్కువయింది తిరుమలకి. "ఆయనిల్లు ఎక్కడ?"

"నేను చెప్పానని చెప్పకండి. బాబూ! ఆరిది ఇల్లు కాదండి - దివాణం. ఆరి ముత్తాతగోరు రెండెకరాల్లో డిప్పపెంకు వసారా లోగిలి ఇల్లు కట్టారు. ఆ తాటితోపు దాటి 'రేచుబాబు ఇల్లు' అని గట్టిగా అరవండి బాబూ! కనిపించిన కాకి దారి సూపిత్తాది! " అని సైకిలు తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు రైతు.

తాటితోపు దాటాకా ఆ అవసరం లేకపోయింది. కనిపించినంతమేరా చెట్లూ, వాటి మధ్య పెద్ద పెంకుటిల్లూ కనిపించింది. విష్ణుమూర్తి గర్వపడే, గిరిగాం రైతులు భయపడే, విచిత్రమైన పేరున్న రైతు ఎలా ఉంటాడు?

తను ఏం చూడబోతున్నాడు?

ఇల్లు దగ్గరవుతున్న కొద్దీ సన్నటి గొంతు సాగదీస్తూ సాగుతున్న పల్లెపదం వినిపించింది. ఆ గొంతులో బాధ లేదు, ఆర్తిలేదు, ఆవేదన లేదు, ఆనందం ఉంది, తృప్తి ఉంది.

ఎత్తరుగులు మెట్లు ఎక్కి పాతకాలం దర్వాజాని తెరిచాడు తిరుమల. ఎదురుగ్గా విశాలమయిన మడత కుర్చీలో బత్తుల రేచకుడు కనిపించాడు. అతన్ని చూస్తూనే శిలాప్రతిమలాగా నిలబడిపోయాడు తిరుమల.

మిలటరీ కుర్చీలో కాళ్ళు బారజాపుకుని కూర్చుని ఉన్నాడు బత్తుల రేచకుడు. వాక్యం తప్పు: **కాలు** బారజాపుకుని కూర్చున్నాడు. ఒక కాలు మోకాలి వరకు లేకపోవడం స్పష్టంగా తెలుస్తోంది. నోట్లో రెండువేళ్ళ మందాన చుట్ట వెలుగుతోంది. తలుపుతెరుచుకోవడం చూసి తుళ్ళిపడ్డాడు. అంతకుమించి నున్నటి గుండు, సూటుతో వచ్చిన వ్యక్తిమీద స్పష్టంగా అమెరికా ముద్ర కనిపించడంతో కంగారుపడిపోయాడు.

"ఎవడ్రా, లంజకొడుకు; ఈయన్ని నా ఇంటికి తీసుకు వచ్చింది?" అని తిరుమల వెనక్కి చూస్తూ గర్జించాడు.

"నేనే దారి వెతుక్కు వచ్చా"నన్నాడు తిరుమల. చాలా సేపటిదాకా కోపం శాంతించలేకపోయాడు. విచిత్రం. కోపం పూర్తిగా పోయాక పసిపిల్లవాడయిపోయాడు.

"నీకు మా బుల్లిబాబు తెలుసా?" అనడిగాడు. ఓ వెదురు కర్ర చంక కింద ఊతం చేసుకుని గెంతుతూ లేచి తిరుమల ముందు పండి మగ్గిన సపోటా పళ్ళుంచాడు.

"ఆడెలా ఉన్నాడు బాబూ? పెద్ద ఉద్యోగం చేస్తున్నాడా? ఆడెలా ఉంటాడో కాస్త సెప్పు బాబూ! నీలాగ సూటేత్తాడా? నీలాగా నల్ల కళ్ళద్దాలెడతాడా? ఆడి కారు ఏ రంగులో ఉంటాది? ఓడలాగుంటాదా? నా కొడుకు సీమ మందు తాగుతాడా? ఆడి పెళ్ళాం అమెరికా దొరసాని...?" ప్రశ్నల వర్షం కురిపించాడు. ప్రతి ప్రశ్న వెనకా ఆసక్తే కానీ, ఆర్తి లేదు. ఉత్సాహమే కానీ ఉద్విగ్నత లేదు.

తిరుమల అన్నీ చెప్పాడు తీరిగ్గా. "ఆడి ఫోటో నీ దగ్గరుందా బాబూ?" అనడిగాడు. ఇటీవల టొయోటా కారు దగ్గర నిలబడి నయాగరా దగ్గర విష్ణు, అతని భార్య, అమెరికన్ దొరల్లాగా ఉన్న ఇద్దరు పిల్లలూ తీయించుకున్న ఫోటో తీసి ఇచ్చాడు. ఆ ఫోటో చూసి మరీ పిల్లాడయిపోయాడు రేచకుడు.

"ఈడు పెద్దోడు. ఆడిపేరు రే. అద్దేటా సింగిల్ అక్షరం అన్నాను బుల్లోడితో. అది నీ పేరన్నాడు. ఆడు నన్ను ఫోన్‌లో తాతా అంటాడు. ఈ రెండోవాడు అదేటి ఆఁ...టెడ్ ఈడు నక్కజిత్తులోడు. పిలిత్తేనే పలుకుతాడు."

"ఇవన్నీ మీకెలా తెలుసు? వాళ్ళనెప్పుడైనా చూశారా?"

"అమ్మో! అంత పనే! మా బుల్లెబ్బాయి ఉత్తరాలు రాత్తాడు. పూర్ణయ్య పంతులుగారి చేత సదివించుకుంటాను. టెడ్డుగాడు ఫోన్‌లో వందేమాతరం పాడతాడు. ఆడి గొంతు గంటశాల గొంతులా ఉంటాది!"

అంత ఆనంద పడుతున్న తండ్రిని ఎప్పుడూ చూడలేదు తిరుమల. బిడ్డల్ని చూడాలని బెంగపెట్టుకునే తండ్రుల్ని తెలుసు. కానీ ఈయన? ఆలోచనల్లోనే ఆనందాన్ని జుర్రుకుంటున్నాడు.

"మీకు కాలు లేదని మీ అబ్బాయి నాకు చెప్పలేదే?"

రేచకుడు నవ్వాడు. "నాక్కాలు లేకపోతే ఆడికేమయింది బాబూ! గిరిగాం రైతు నాకొడుక్కి కాలుంటేనేం పోతేనేం? నా కొడుకు దొర. సీమలో పెద్ద ఉద్యోగం సేత్తున్నాడు అది చాలు నాకు."

"అసలు కాలు ఎలా పోయింది?"

"మనకి ఒంటినిండా సక్కెరే బాబూ! తీపి తినక్కరలేదు. సిన్నప్పట్నుంచీ నేను ఇమాంపసందు అంటే పీక్కోసుకుంటాను. అలా బయటికి సూడు, కనిపించే మేరలో అయిదెకరాల మామిడి తోపు నాదే ఆరు వేలు పళ్ళు దింపుతాను. ఎండలు ముదిరి, తొలకరిదాకా ఎంత లేదన్నా రెండొందల పళ్ళు తింటాను. నీయవ్వ... పోతే దొరబిడ్డలాగా పోవాలి కానీ, ఏడుత్తూ బతికితే ఏం లాభం? మా డాక్టరు పద్మనాభయ్య 'ఒరే రేసునాకొడకా! తింటే సత్తావురా!' అన్నాడు. నేను నవ్వి, 'అయితే తినే సత్తాను!' అన్నాను. రెండురోజులు పనికట్టుకుని తిన్నాను. పండొదిలితే ఒట్టు!.

"మరి విష్ణుకి తెలియజెయ్యలేదేం?"

"తెలిస్తే ఆడేటి సేత్తాడయ్యా? అన్నీ తెలిసిన మూర్ఖుణ్ణి నేను. ఇప్పుడు ఒక్క పండు కూడా తినలేను!"

"ఏం?"

ఆ ఊపులో చెప్పబోయాడు కానీ అంతలో "నువ్విలా రాడం నాకిష్టం లేదు బాబూ!" అని ఆగిపోయాడు.

"ఎందుకని??"

"నావల్ల నా కొడుకు మనస్సు పాడుకాకూడదు. ఆడు అమెరికాలో సల్లగా ఉండాల!"

"ఎప్పటికయినా ఈ నిజం తెలిస్తే అతని గుండె పగులుతుంది కదా!"

"అందుకే ... అందుకే.... ఆడికి తల్లిదండ్రుల్ని మరచిపోవడం అలవాటు సేత్తున్నా!" మరో చుట్ట వెలిగించాడు.

"ఎందుకని? ఎందుకా అవసరం వచ్చింది?"

ప్రశ్నకు సమాధానం వెంటనే చెప్పలేదు. కాస్సేపయ్యాక తలెత్తి "నువ్వు అమెరికా వెళ్ళి ఎన్నాళ్ళయింది బాబూ?" అనడిగాడు.

"రమారమి మూడేళ్ళు".

"ఆడు ముప్పయి ఏళ్ళ కిందట ఎళ్ళాడు. అప్పుడు ఈ సుట్టూ ఉన్న ఏభై ఎకరాల మాగాణీ, మెరకా నాది. మా పక్క రైతు వీధిబడిలో ఆరో క్లాసు చదివి, వేలిముద్ర ఏసే నన్ను ఎగతాళి చేస్తే ఆ నా కొడుక్కి బుద్ధి సెప్పాలని నా కొడుకుని శికాకుళంలో పెట్టి

సదివించా. ప్రతీ వారం వెన్నపూస, జున్నూ సాయంగా తీసుకెళ్ళేవాడిని. ఆడిచేత ఇంగ్లీషు పాఠం చదివించుకు పొంగి పోయేవాడిని. ఆడు కాలేజీ సదువుకొచినప్పుడు ఊళ్ళో గొర్రెపోతుని కోసి పండగ సేసా! మా బుల్లిగాడు సదువు మాని పొలంలో నాకు సాయపడతానన్నాడు. ఎదిరించి, గొడవపెట్టి ఆడ్ని అమెరికా పంపించాను."

"ఆ తర్వాత ఎన్నిసార్లు అతన్ని చూశారు?"

"అయిదు సార్లు, ఆఖరిసారి చూసింది ఆరేళ్ళనాడు."

"మరి కొడుకుని దూరం చేసుకున్నానని బాధగా ఉండదా?"

"సచ్చి కాటికెల్లేనాడు మనకెవడు దగ్గర బాబూ? మనకి సేవలు సెయ్యలేదని ఆల్ల బతుకెందుకు పాడుసెయ్యాల. ఆడు నాకెందుకు సేవ సెయ్యాల? ఆడి బతుకు ఆడు బతకాల."

ఆశ్చర్యంగా చూశాడు రేచకుడిని. ఈ మారుమూల గ్రామంలో ఈ చదువురాని రైతు, ముప్ఫై ఏళ్ళు తను పాటించి ఓ సందేశాన్ని ఈ తరం తల్లిదండ్రులకి ఇస్తున్నాడా అనిపించింది.

"ఆడికోసం, నా రోగం కోసం, నా పెళ్ళాం వైద్యం కోసం నలభై ఎకరాలు అమ్మేశాను. అయిదెకరాలు తాకట్టులో ఉంది. మరో అయిదెకరాలు మామిడి పండించుకు తినేత్తారా అన్నాను మా బుల్లోడితో. 'తినేయ్ నాన్నా. కావాలంటే సెప్పు, మరో పదెకరాలకి డబ్బు పంపిత్తా!' అన్నాడు" అని చెపుతూ పసిపిల్లాడికి కితకితలు పెట్టినట్టు నవ్వాడు.

రేచకుడిలో ఎక్కడా పశ్చాత్తాపం లేదు, వేదన లేదు. ప్రతి కష్టాన్నీ 'తృప్తి'గా తర్జుమా చేసుకునే అద్భుతమయిన సంకల్పబలం ఏదో ఉంది.

"ఆడికి నేను ఉత్తరాలు రాయను. నెలకోసారి పంచాయితీ ఆఫీసుకెళ్ళి మాట్లాడతాను. ఆడు ఈ పాతికేళ్ళలో పంపించిన వస్తువులన్నీ సూత్తావా బాబూ!"

లోపలికి తీసుకెళ్ళి ఓ గది తెరిచాడు. కళ్ళు తిరిగిపోయాయి తిరుమలకి. దసరాకి ఊళ్ళల్లో బొమ్మల కొలువు తీర్చినట్టు గదంతా రకరకాల వస్తువులున్నాయి. అందులో హవానా చుట్టల పాకెట్లు, సబ్బుల పాకెట్లు, సిగరెట్ లైటర్లు, బ్యాటరీ లైట్లు, ఖరీదైన ఇరానీ తివాచీలు, చీరెలు, సూటు గుడ్డలు, చిన్న రేడియో సెట్లు; ఒకటేమిటి? వాడకం లేక అవి క్రమంగా పాడవుతున్నాయి. సియర్స్ టవర్, లిబర్టీ విగ్రహం, వాషింగ్టన్‌లో లింకన్ మెమోరియల్ బొమ్మలూ అన్నీ అంతటా ఉన్నాయి.

గెంతుకుంటూ వెళ్ళి ఓ శాలువా తీసి " ఈ సిల్కు గుడ్డ ఆళ్ళమ్మ కోసం పంపించాడు ఆరునెలల కిందట!" అన్నాడు గర్వంగా.

"మరి ఆవిడ వాడుకోలేదేం?"

నవ్వాడు రేచకుడు అదేదో జోక్‌లాగా. "ఎలా వాడుతాదయ్యా! ఈ లోకంలో ఉంటేగా వాడుకోటానికి!"

పిడుగుపడ్డట్టు తుళ్ళిపడ్డాడు తిరుమల.

"మీ ఆవిడ...?"

"సచ్చిపోయి నాలుగేళ్ళయింది."

"వాట్!? మరి ఆవిడ కబుర్లు చాలా చెప్పాడే! ఆవిడ కోసం చాలా..."

"సెప్పాడా! మరి సచ్చిపోయిన ఆడి తల్లిని నాలుగేళ్ళు ఆడి మనస్సులో బతికించాను. నేను గొప్పోణ్ణా, కాదా సెప్పు బాబూ!" అన్నాడు గర్వంగా.

తిరుమలకి ఈ మనిషి బొత్తిగా అర్థం కావడం లేదు. కానీ ప్రతిమాటకీ రేచకుడి వ్యక్తిత్వం రానురానూ విశ్వరూపం దాల్చేస్తోంది.

"అమెరికానుంచి వస్తే కాలుపోయిన నాన్ననీ, సచ్చిపోయిన తల్లినీ తల్చుకు ఏడుత్తాడని పూర్ణయ్య పంతులుగారితో చెప్పి అవాకులూ చెవాకులూ రాయిత్తాను. ఉత్తరాల్లో నేను రెండు సార్లు యాత్రలకెళ్ళాను. ఒకసారి కాశీ ఎల్లాను. నిజానికి గిరిగాం దాటి ఎక్కడికీ పోలేదు!" అన్నాడు రేచకుడు.

తిరుమలకి నోటమాట రావడంలేదు. "అసలు మీ ఆవిడెలా పోయింది?

"అది కొడుక్కోసం మనేద ఎట్టుకుంది. మజ్జిగైరమ్మ జాతరకీ, నూకాలమ్మ జాతరకీ తిప్పా. దాని కళ్ళల్లో పువ్వులేశాయి. నా దగ్గర దాచి వండుతూ సెయ్యి కాల్చుకునేది. ఓసారి నాతో తోటకొచ్చింది. దిగుడు బావిలో పడిపోయింది. వెన్నెముక విరిగిపోయింది. దాన్ని మంచం మీదుంచి నేను వంటచేసి పెట్టాను. దగ్గరుండి ఉచ్చా, దొడ్డీ తీశాను. నీళ్ళు పోసి చీర కట్టాను. సచ్చిపోయాక మా బుల్లోడు సెయ్యాల్సిన పని - తల కొరివి ఎట్టాను. అంతా ఈ సేతి క్రతోనే!" ఏడుస్తాడేమోనని అతన్ని చూశాడు. అటువంటి ఛాయలేమీ అతనిలో లేకపోగా, ఏ కొద్దిపాటి గర్వమో కనిపించింది.

మనిషి స్థితప్రజ్ఞుడు కావడానికి చదువు సంధ్యలతో సంబంధం లేని సంస్కారమేదో కావాలి. దాన్ని సాధించాడు రేచకుడు.

"ఇక్కడ జరిగేదేదీ ఆడ్ని బాధపెట్టకూడదు. ఆడి సుకాన్ని పాడు సెయ్యకూడదు. అందుకే ఆళ్ళమ్మ బతికున్నట్టు దొంగ ఉత్తరాల్ని మా పూర్ణయ్య పంతులు రాత్తాడు. సంవత్సరం పొడగునా ఆరికి పదిబస్తాల ధాన్యం, అపరాలు, పచ్చడి మామిడీ అన్నీ నేను పంపుతాను!" అన్నాడు.

"మరి మీ సంగతి ఎవరు చూస్తారు?"

"మన సంగతి మరోడు సూసేదేంటయ్యా! రోడ్డు మీద కుక్కపిల్ల సంగతెవరు సూత్తున్నారు? సెరువులో సేపపిల్ల సంగతెవరు సూత్తారు? నీకోపిక ఉందా వండుకు తిను. లేదా, నాలుగు పళ్ళు తిను. ఇంకా సేతకాదా? సచ్చిపో!" పగలబడి నవ్వాడు.

"మరి బాగా నచ్చిన ఇమాంపసందు ఎలా మానేశారు?"

ఇప్పుడు అతని మొహంలో చెప్పరాని దిగులు కనిపించింది.

"ఈ ఆడలంజలమీద పేమ పెంచుకుంటే గోతిలో పడిపోతామయ్యా! మా యావిడి నాసేత అన్నీ సేయించుకుని నా ముందు కాళ్ళకి లంకేసేసింది. సచ్చిపోతూ పండు తిననని నాసేత ఒట్టేయించుకుంది!" అన్నాడు.

తిరుమల నవ్వాడు. "తల్లి చావునే కొడుకు నుంచీ దాచి మోసం చేస్తున్న మీరు మీ ఆవిడకిచ్చిన మాటని తప్పలేరా?" అన్నాడు. కత్తితో పొడిచినట్టు గింజుకుపోయాడు రేచకుడు ఆ మాటకి. "కొడుకుని మోసం సేసేది ఆడిని బాధపెట్టే హక్కు నాకు లేదని, నా పెళ్ళాన్ని మోసం సెయ్యనిది దాని సుఖపెట్టే అవకాశం ఇంక రాదని!" ఈ మాటంటున్నప్పుడు రేచకుడి కనుకొలకుల్లో చిన్న మంచి ముత్యం లాంటి నీటి చుక్క తళుక్కుమంది.

నిట్టూర్చి లేచాడు తిరుమల. "మీ బుల్లయ్యకి ఏమయినా చెప్పమంటారా?" అన్నాడు.

గెంతుతూ వచ్చి "నువ్వు ఇక్కడ విన్నదీ, సూసిందీ ఏమీ చెప్పకు. తల్లి కుక్క, పిల్ల పుట్టగానే దాన్ని తినేత్తాది. కారణం తెలుసా? తన ప్రేమనుంచీ ఆ పిల్ల దూరమయిపోతాదేమోనన్న భయంసేత. నా భయానికి ఆడి పీక కొరికికుండా ఇన్నాళ్ళూ జాగ్రత్త పడుతున్నాను. రెక్కలొచ్చాక పిల్ల గూడులోంచీ ఎగిరిపోకపోతే తప్పు తల్లిది కానీ, పిల్లది కాదయ్యా! పెపంచకాన్ని అలవాటు సేసి గూడులోంచి తోసెయ్యాల. నే నా పనే సేత్తున్నాను!"

అప్రయత్నంగా రేచకుడి ఒక్క కాలికీ వొంగి నమస్కారం చేశాడు తిరుమల. పాముని చూసినట్టు ఒక్క గెంతు వెనక్కి గెంతాడు.

"తప్పు బాబూ! పెద్దింటి బిడ్డలాగున్నావు. నీ సేత దండమెట్టించుకునేంత సెడిపోలేదు నేను. ఉండు..." అని ఓ బస్తా ఇమాంపసందు నింపి, పాలేరునిచ్చి కారులో పెట్టించాడు రేచకుడు.

కారెక్కేముందు తిరుమల భుజం మీద చెయ్యేసి ఆపాడు. "వచ్చినప్పటి నుంచీ సూత్తున్నాను. నువ్వు తొడుక్కునే కోటు ఎంతుంటాది?"

నవ్వాడు తిరుమల. "కనీసం మూడువేలు."

బొడ్డులోంచి మడతలు పడ్డ నోట్ల కట్టలోంచీ మూడువేలు తీసి "ఈ రంగు మా బుల్లోడికి శానా బాగుంటాది. ఈ అయ్యకొనిచ్చాడని ఆడికి నువ్వు కొనియ్యి!" అన్నాడు.

కారు కదిలింది.



# ఆయన ఒక ఆగని వర్షం

## శ్రీ అజయ్ శాంతి

ప్రపంచం చాలా పాతది - పద్దు రాసేసి ఉతకడానికి వెయ్యాలనిపిస్తుంది. ప్రపంచం చాలా కొత్తది. పాట్నీ సెంటర్ చందనా బ్రదర్స్‌లో అప్పుడే కొన్న పట్టుపంచెలా ధగధగా మెరిసిపోతూ 'అబ్బ... ఎం...త...బావుందో" అనిపిస్తుంది.

అప్పటికి నాకు పదమూడో, పద్నాలుగో ఏళ్ళు....

ఇంకా హైస్కూల్లో చదువుకుంటున్న రోజులు... అది గొప్పేముందులెండి... ఆ వయసుకి ఎవరైనా హైస్కూల్లోనే చదువుకుంటారు. కాకపోతే 'రోజూ బడికి పోవాలా... ఎగ్గొడితే భలే బావుంటుందే' అని మనసు పీకేస్తూ ఉండేది అప్పట్లో... ఇందులోనూ పెద్దగొప్పేముందిలెండి... ఈ మాత్రం ఛండాలపు బుద్ధి చాలామంది పిల్లలకి ఆ వయసులో కలుగుతూనే ఉంటుంది... కాకపోతే ఆ కోర్కె పైకి చెబితే మాత్రం మా బాబు (మేం నాన్నగారిని అల్లానే పిలిచేవాళ్ళం) కళ్ళెర్ర చేసేవారు. ఇందులో మాత్రం అస్సలు గొప్పేముంది లెండి. పిల్లాడు బడి ఎగ్గొడుతానంటే 'మా నాయనే... అల్లానే మానేసి మాగాయ పెరుగు పచ్చడి వేసుకుని వేళకి భోంచేసి, మంచం మీద ముసుగు పెట్టి పడుకోరా మైడియర్ బంగారు కొండా' అని ఏ తండ్రి మాత్రం అంటాడు చెప్పండి?

కాకపోతే నాకో ఎగ్జంప్షను...

మా పెరట్లో పూల మొక్కల పక్కన పడక్కుర్చీలో వాలిపోయి, కృష్ణకాలవ మీంచి వచ్చే చల్లటి గాలి పీలుస్తో, కొబ్బరి చెట్టు తెలిసీ తెలియకుండా చేసే చప్పుడు వింటో, అమ్మ మందలింపుల్నీ, అగరొత్తు సువాసల్నీ ఆస్వాదిస్తో, మబ్బుల నీడల్లో ఆదమరచి మురిసిపోతో ఓ మాంచి పుస్తకాన్ని ఆరింటికి మొదలెట్టి ఆ బడి టైమేదో అయ్యిందాకా తెగ సీరియస్‌గా చదివేస్తో... "పుస్తకం చాలా బావుంది. మధ్యలో ఉన్నాను. ఇవ్వాల్టికి బడి మానేసైనా పూర్తి చేసేస్తే బావుంటుంది" అని ప్రపోజలు పెడితే మాత్రం మా బాబు అన్నీ తెలిసినట్టు చిన్నగా నవ్వేవారు. పుస్తకం వంకా, నావంకా ఓ సారి తేరిపార చూసి సర్లే అన్నట్టు తలూపేవారు.

అట్లాంటి 'ఎగ్జంప్షను' రచనల్లో ఓ తెలుగు పేరు తరచూ తారసపడేది.

తొమ్మిదక్షరాల ఆ రైటరుగారి స్మైలింగు ఫేసు, షార్పునోసు, వాక్యంలోని పవరు, వ్యంగ్యంలోని విసురు, మాటల వాడుకలో పొదుపు, గురిచూసి కొట్టడంలో ఒడుపు... అన్నీ మీకూ, నాకూ, మనందరికీ చిరపరిచితమే...

ఆ పేరే.. గొ - ల్ల - పూ - డి - మా - రు - తి - రా - వు

అప్పటికి నాకు ఇరవై ఎనిమిదో, ఇరవై తొమ్మిదో ఏళ్ళు...

1995 జూన్ నెల... మంచి ఎండాకాలం... 'ఈనాడు టెలివిజన్' ప్రారంభానికి మూడు, నాలుగు నెలలు ముందు...

ఓ సాయంకాలం...

ఈటీవీ మేనేజింగ్ డైరక్టర్, రచయిత: సుమన్‌గారు "అనోన్య దాంపత్యానికి అద్దం పట్టేలా ఓ ప్రోగ్రాం డిజైన్ చేద్దా"మన్నారు. అందరికీ ఉత్సాహంగా అనిపించింది. 'మరి వ్యాఖ్యాతగా ఎవరైతే బావుంటారు' అన్నది నెక్ట్స్‌క్వశ్చను...

'హాయ్ ఎవ్రీబడీ' అంటూ ఎడమకీ - కుడికీ తాను ఊగుతూ, తన ముందు ఊగే కెమేరాని ఊపిపారేసే మ్యాడ్రన్ యాంకర్లు చాలామందే దొరుకుతారు.

కానీ ఈ కార్యక్రమం అల్లాంటిది కాదే!

మనసులోని ప్రేమ మంగళసూత్రమైతే, గుండెలోతు అభిమానం కొంగుముడిగా మారితే, నునువెచ్చటి ఆశల సెగ అగ్ని సాక్షిగా ఆశీర్వదిస్తూ మంత్రంతో మాథ్స్‌ని చేదించి, ఒకటి ప్లస్ ఒకటి ఈజీక్వల్‌టూ ఒకటి అని నిరూపించి, మురి'పాల'ల్లో కాసిని మిరియాలు కలిపి, కాసిని కోపాలు, కాసిని తాపాలు, కాసిని అల్లరులు, కాసిని అలకలు, కాసిని యుద్ధాలు, కాసిని శాంతి ఒడంబడికలూ కలగలిపి, కాపురమనే తాంబూలాన్ని కమనీయంగా పండించుకునే భార్యాభర్తల అనురాగాన్ని, అంతరంగాన్ని ఆవిష్కరించాల్సిన కార్యక్రమం...

కాబట్టే పెద్దగా ఛాయస్ చూడాల్సిన పనిలేకపోయింది. ఇంతటి బరువునీ, బాధ్యతనీ సజావుగా సొగసుగా, సహజంగా, అందంగా ఆహ్లాదంగా ఇంకెవ్వరు అందించగలరు చెప్పండి... మారుతీరావుగారు తప్ప!

అనుకోవడమే తరువాయి ఈటీవీ జనరల్ మేనేజరు బాపినీడుగారు ఓ మీటింగు ఏర్పాటు చేశారు.

కాన్సెప్టు వినగానే 'ఆహా.. అదరగొట్టేయచ్చు' అన్నారు మిస్టర్ మారుతీరావు తన స్టయిల్లో కాస్త వంగుని చూస్తూ..

అదిగో... అల్లాగ... అప్పుడు కలిశాం మేము.. "మనసున మనసై..."

రేడియోలో మారుతీరావు గారేమిటో నేను చెప్పాలనుకుంటే మీరు 'మాకు తెల్సులే' అని గర్వంగా నవ్వుతారు... పోనీ పత్రికల్లోనూ, సినిమా తెరమీదనా మారుతీరావుగారేమిటో చెప్పనా అంటే "పోదూ... మాకు తెలీదా.." అని కోప్పడతారు...

కానీ నిజంగా మీకు తెలియనిది ఒకటి చెప్పాలి.. అదేమిటంటే టెలివిజన్‌లోకి ఎక్కని మారుతీరావుగారి 'విజన్' గురించి...

ఒకటా రెండా..

దాదాపు నూటముప్ఫై, నూట నలభై ఎపిసోడ్లు రికార్డు చేశాం. 'మనసున మనసై' కార్యక్రమాన్ని వేలకొలద్దీ జంటలు... అందులో మళ్ళీ సినిమా తారలు, రచయితలు, రాజకీయ నాయకులు... ఇంతమంది భావాల్నీ, అనుభవాల్నీ, అహాల్నీ, ఆదర్శాల్నీ, కలహాల్నీ, కవ్వింపుల్నీ తెరమీదకు తెచ్చే ముందు చాలా చాలా ఎక్సర్ సైజు చెయ్యాల్సివచ్చేది. అందులోనూ మొగుడూ పెళ్ళాల సొంత విషయాల్లో ఓ మూడో మనిషి ముక్కుదూర్చి ఎడాపెడా ప్రశ్నలడిగేస్తూ ఏవేవో స్టేట్‌మెంట్లు ఇచ్చేయడమంటే అదో టాస్కు... కైకలూరు అనుకుని కరాచీకో, కొలంబోకో పోయినంత రిస్కు...

కానీ ఈ అతి ప్రయాసా పనిని అరక్షణంలో ... అగస్త్యుడుగా ఎగసిపడే గంగాప్రవాహాన్ని బుడుంగున పట్టేసినట్టు చటుక్కున కంప్లీటు చేసేవారు మారుతిరావుగారు...

అటు భర్తగారు, ఇటు భార్యగారు కూడా తమ సొంత బాబాయ్‌కో, మావయ్యకో మనసు విప్పుకుని చెప్పుకున్నట్లు గలగలా మాట్లాడేసేవారు ఆయనముందు.. నేను ఇప్పటికీ బల్లలూ గ్రటా గుద్ది మరీ చెప్పగలను.... ఈ కార్యక్రమాన్ని ఆయన ఎంత బాగా

నడిపారంటే అటు అనంతపురం నుంచీ ఇటు శ్రీకాకుళం దాకా తెలుగు నేలమీద చాలా ఊళ్ళల్లో, తమ కుటుంబ సభ్యుల లిస్టు చెబుతూ మారుతీరావుగారి పేరుని కూడా అప్రయత్నంగానే చెప్పేసారంటే మీరు నమ్మాలి.

ఆయన ప్రభావం అలాంటిది.

ఇంతమందికి ఇంత ఆత్మీయుడు కాగలిగాడంటే అది ఆయన చేసుకున్న అదృష్టం టూది పవరాఫ్ అదృష్టం...

అంతమాత్రాన ఈయనగారు అజాతశత్రువు అని కన్‌క్లూజన్‌కి వచ్చేస్తే మాత్రం ష్యూర్.. అది పొరపాటే! యూనో.. చాలామందికి ఈయనంటే పీకలు దాటి పెదవులదాకా కోపం... రీజను అడగండి.. పర్లేదు... 'ప్రతిధ్వని' కార్యక్రమానికి కొన్నాళ్ళపాటు మారుతిరావుగారు వ్యాఖ్యాతగిరీ చేశారు.

ఈటీవీ కథ విభాగాధిపతిగా నేనూ రికార్డింగులకి హాజరయ్యేవాణ్ణి. పెద్ద పెద్ద మంత్రులు, ఐ.ఎ.ఎస్. అధికార్లు, రాష్ట్ర, జాతీయ స్థాయి రాజకీయ ప్రముఖులు ఎందరో ఈ ప్రోగ్రాం కోసం వచ్చేవారు. ఈయనేమో వాళ్ళ పెద్దతనాన్ని కూడా చూడకుండా ఎడాపెడా ప్రశ్నలు వేసేవారు. అసలా దెబ్బకి ఓ చాలా పేరున్న డాక్టరుగారు ఓ సారి ప్రోగ్రాం మధ్యలోనే జారుకున్నారు కూడా! ఎంచుకున్న అంశంలోకి తన్ని తాను అవాహన చేసుకుని నిలదీసి నిగ్గదీసి కార్యక్రమాన్ని నిర్వహించే సమయంలో ఆయన్ని చూడాల్సిందే.. 'ఎందుకయ్యా అంత ఆవేశం' అని ఆవేశం లేకుండా అడిగి చూడండి... 'న్యాయం తరపున నల్లకోటు వేసుకోని వకీలుని నేను... అవతలి వ్యక్తి ఎవరన్నదానికికన్నా అక్కడ చర్చించే విషయాలే నాకు ముఖ్యం' అంటాడాయన ఆత్మవిశ్వాసంతో...

మీకు తెలుసా...

స్నానం చేశాక పైన వేసుకునే తెల్లలాల్చీకన్నా, లోపల వేసుకునే బనీను శుభ్రంగా ఉందో లేదో తెగ ఛాదస్తంగా చూస్కోవడం మారుతీరావుగారి పూటవారీ అలవాటు. నిజం... పై మనిషి కన్నా లోపలి మనిషి 'క్లీన్'గా ఉండాలి. ఉండితీరాలి.

ఇది ఆయన రాయని ఆయన వాక్యం.. క్లాప్స్ కొట్టండి!

అప్పుడెప్పుడో పేపరు... తర్వాత స్టేజి, రేడియో, ఈ తర్వాత్తర్వాత సినిమా డైలాగులు, ఆపైన యాక్టింగులు.. అవీ అయిపోయాయ్ అనుకుంటే టీవీలో అన్‌కంపారబుల్ యాంకరింగులు...

అ...బ్బ!...

ఏమిటీయన?

అలుపులేదా? సొలుపులేదా?

ఊహూ౦....

ఆయన ఆగని వర్షం!

మారుతిరావుగారు చాలా పాతవాడు. ఇప్పటివాడా... అరవైఏళ్ళనాటివాడు...

ఇన్ని సన్మానాలు చేసి, ఇన్నిన్ని శాలువాలు కప్పినా ఇంకా రిటైర్మెంటు ముసుగుపెట్టి పడుకోలేదా అని ఆశ్చర్య పోవాలనిపిస్తుంది.

మారుతీరావు చాలా కొత్తవాడు. నిన్నిటికన్నా రేపటి మీద చూపున్నవాడు. సంప్రదాయం గారెల్ని మోడ్రన్ చిల్లీసాస్‌తో పంచి పెట్టగలవాడు... 'సాయంకాలమైనా' ఇంకా తీర్పుకోసం, మార్పుకోసం కలంపట్టగలవాడు. ఆవేశాన్నీ - అభ్యుదయాన్నీ పంచి పెట్టగలవాడు.. ఏం చేసినా, ఏం రాసినా, ఏం వేసినా 'దటీజ్ మారుతిరావ్' అనిపించుకోగలవాడు.

(ఈ పెద్ద గొప్పాయనకి చిన్నప్పుడు బడి ఎగ్గొట్టడానికి ఛాన్సులు కల్పించినందుకు గాను.. బోలెడు థాంక్సులతో...)




# యశస్వి ఎస్పీ



## అనుభవాల కలంనుంచీ అనేక విషయాలు



1960 ప్రాంతాల్లో ననుకుంటాను - సినిమా పనుల మీద నేను మద్రాసు సుధారా హోటల్లో ఉండేవాడిని. నాతో తరచుగా అక్కడ ఉండే మరో రచయిత సి.నారాయణ రెడ్డిగారు. ఆ రోజుల్లో అనునిత్యం నా గదికి వచ్చే మిత్రుడు, రచయిత కె.వివేకానంద మూర్తి. అతనితో కలిసి బాలూ నా గదికి వచ్చారు. కదిపితే ఆప్యాయంగా పలకరించే వ్యక్తి. అలవోకగా పాడే గాయకుడు. గంటల తరబడి గాన మాధుర్యాన్ని మా గదినిండా ఒలకబోసేవాడు, సంవత్సరాలు గడిచి ఇంత దూరం రచయితగా ప్రయాణం చేసినా - గాయకుల్నీ - ముఖ్యంగా ఎస్పీని చూస్తే నాకు ఈర్ష్య. పసివాడి దగ్గర్నుంచీ, పామరజనం దగ్గర్నుంచీ, మేధావి వర్గం వరకూ - హృదయాన్ని రంజింప చేసే బాషని గొంతులో నిలుపుకున్న 'రచయిత' ఎస్పీ. ఇది సుకృతం. ఆయనకి పారంపర్యం కూడా.

కాలేజీ రోజుల్లో నా "ఆశయాలకు సంకెళ్ళు" నాటిక వేశానని సభలో చాలా గర్వంగా చెప్పుకున్నారు. నిజజీవితంలో నేను రెండే రెండు కార్యక్రమాలకు ప్రయోక్తగా ఉన్నాను. అమితాబచ్చన్ ప్రభృతులు క్రిక్కిరిసిన "అంధాకానూన్" రజితోత్సవ సభకి ఇంగ్లీషులో. డాక్టర్ ముద్దుకృష్ణారెడ్డిగారి మొహమాటంతో అప్పటి కళాసాగర్ ఉత్సవంలో బాలూ కచ్చేరీకి తెలుగులో. రెండూ రెండు మధురమైన అనుభూతులు.

వ్యక్తిగా బాలూ గొప్ప సంస్కారి. ఎదిగిన కొద్దీ వంగిన వినయ విధేయతలు అతనికి వారసత్వం. ముందటి గాయకుల వలె కాక బహిముఖీనమైన ప్రజ్ఞ అతని సొత్తు. మంచి నటుడు. డబ్బింగ్ ఆర్టిస్ట్. మేమిద్దరం కలిసి 'ప్రేమ' సినిమాలో; ఆయనా దాసరీ తోడుదొంగలుగా నటించిన సినిమాలో (పేరు గుర్తులేదు) నటించాం. కేవలం గొంతుతో పాత్రని ఒడిసి పట్టుకోవడమే ఆయన గడుసుదనం.

నావి చాలా పాటల్ని రేడియోలోనూ, ఒకే ఒక్క పాటని సినిమా (చల్ మోహన రంగ)లోనూ పాడారు. ఆయన నిర్మించిన రెండు సినిమాల్లో నటించాను - ఆదిత్య 369, శుభసంకల్పం. రెండో సినిమాకి రచయితని. ఫోన్ చేసి పిలిపించుకుని, ఆప్యాయంగా పాదాభివందనం చేసి వ్రాయించుకున్నాడు. దాదాపు 40 రోజులు నేనూ, కె.విశ్వనాథ్ గారూ ఆయన ఆతిథ్యాన్ని స్వీకరిస్తూ ఆయన ఇంట్లోనే కథా చర్చలు జరిపాం. సాంకేతిక నిపుణులకూ, నటులకూ ఇవ్వాల్సిన మర్యాదనీ, సౌకర్యాలనీ గంభీరంగా ఏర్పరచిన నిర్మాత. ఈ మాట ప్రత్యేకంగా చెప్పటానికి కారణం ఆ విషయమై ఆయన తీసుకున్న శ్రద్ధ. నిజానికి ఒక హద్దు మీరి - నలుగురినీ సంతోషపెట్టడమే ధ్యేయంగా పెట్టుకున్న షావుకారు.

ఆయన హ్యూమిలిటీకి గొప్ప నిదర్శనం - పద్మశ్రీ వచ్చినప్పుడు నేను అభినందిస్తే "అది నా అదృష్టం. కానీ నాకంటే అర్హత ఉన్న సీనియర్లున్నారు - సుశీలగారు" అన్నారు. తనకి దక్కిన గుర్తింపును చాలా తక్కువ మంది పక్కవారికి దక్కని అదృష్టం పక్కన కుదించుకుంటారనుకోను.

మా కుటుంబానికి ఆత్మబంధువు. మా వాసూ దగ్గర ఉండి తన తొలి సినిమా పాటలన్నీ ఆత్మీయంగా పాడించుకున్నాడు. బతికి ఉన్న ఆ కాస్త రోజులూ బాలూ పాటలు పదే పదే విని - వాటిలో తన 'రేపు'ని ఊహించుకుని మురిసిపోయాడు. అది మా వాసూకి బాలూ ఆఖరి రోజుల్లో సమకూర్చిన ఆత్మ తృప్తి. ఇది మా కుటుంబం బాలూకి తీర్చుకోలేని ఋణం.

వాసూ పోయాక మేం ప్రారంభించిన ట్రస్టుకి తొలినాటినుంచీ మాతో నిలచిన సానుభూతిపరుడు. మొదటి సభకి ఆయన వ్యాఖ్యాత. రెండో ఉత్సవంలో కచ్చేరీ చేశాడు. పంకజ్ ఉదాసీని స్వయంగా ఫోన్ చేసి రప్పించాడు. లతామంగేష్కర్ పని వత్తిడి రాలేకపోయారు. మరో సంవత్సరం రఫీ పాటల కచ్చేరీ చేసే ముందు తొలి వాక్యం "నేను గొల్లపూడి కుటుంబానికి ఎంత సన్నిహితుడునంటే - వారు ఈ వేదికని చీపురుతో శుభ్రం చేయమన్నా ఆనందంగా చెయ్యగలను" అన్నారు. సభికులు ఒక్క క్షణం నివ్వెర పోయి, తేరుకుని ఆనందంతో హర్షధ్వానాలు చేశారు. అది ఆయన ఆత్మీయతకి పరాకాష్ఠ.

మా ఇంటిల్లపాదీ ఆయన అభిమానులం. ముఖ్యంగా మా పెద్దబ్బాయి. మెర్సిడిస్ కొని సరాసరి తీసుకెళ్ళి ఆయన ఇంటి ముందు నిలిపాడు - ఆయన్ని నడపమని. కొన్న ప్రతీ కారులోనూ విధిగా బాలూ తొలి సంవత్సరం పాడిన కచ్చేరీ కాసెట్ ఉంటుంది.

కాలు విరిగి, ఇంకా పూర్తిగా కోలుకోక పోయినా షష్టిపూర్తికి విశాఖపట్నం వచ్చాడు. మా సుబ్బారావుకి ఆయనంటే గురుభావమయితే, ఆయనకి మావాడంటే అమితమయిన గౌరవం, ప్రేమ. వారి ఆత్మీయత పరస్పరం. ఆయన కొడుకు తీసిన సినిమాలో మొదటి కార్డు - సుబ్బారావుకి కృతజ్ఞత.

కావాలనే దేశానికంతటికీ తెలిసిన బాలూ గురించి ముచ్చటించడం లేదు - అది పునరుక్తి అవుతుందని బాలూ విజయానికి వెన్నెముక - గతాన్ని మరిచిపోని అతని సంస్కారం, కృతజ్ఞత. ఆయన రికార్డింగు థియేటరులో ఇప్పటికీ ఆయన అనుంగు మిత్రుడూ, సినిమాలో మొదటి అవకాశాన్ని కల్పించిన కోదండపాణి చిత్రాలు నిలుస్తాయి. నిజానికి ఆ థియేటర్ పేరే కోదండపాణి థియేటర్.

భారత దేశం గర్వించదగ్గ - చాలా మంది తెలుగు వెలుగుల్లో బాలూ పేరు ఉంటుంది. దానికి కారణాల జాబితాలో ఆయన సామర్థ్యంతో పాటు ఆయన సంస్కారం, వినయం, సౌశీల్యం, వెనక్కి తిరిగి చూసుకునే విచక్షణ, స్నేహశీలత, ఆత్మీయుల కోసం రూపాయిని ఆనందంగా నష్టపోయే వితరణ ఇవన్నీ ఉంటాయి.

బాలూని పొగడడం నా పనికాదు, ఉద్దేశం కాదు. కానీ ఏ వ్యక్తయినా బాలూతో తన అనుభవాలని సజావుగా ఉట్టంకిస్తే - అది తప్పని సరిగా ఒక అభినందన పత్రమవుతుంది. ఆ గుణం వక్తది కాదు. వ్యక్తిది.

అది తెలుగు దేశం అదృష్టం.



# మైత్రి

## కీ.శే.శ్రీ.అల్లు రామలింగయ్య

ఓ నటుడి ప్రతిభనో, రచయిత సామర్థ్యాన్నో ప్రశంసించడానికి వారితో ప్రత్యక్ష పరిచయం అక్కర్లేదు. ఆ సదరు నటుడు, రచయితతో పరిచయ స్నేహాలున్నప్పుడు వారిని గురించి ముచ్చటించడానికి ప్రత్యేకంగా

ప్రయత్నం చేయనవసరం లేదు. కొన్ని దశాబ్దాల సహచర్యం, సహవాసం ఉంటూ ఏ కొన్ని మలుపులలోనైనా మరచిపోలేని కొంత ప్రయాణాన్ని పంచుకున్న వ్యక్తుల గురించిన జ్ఞాపకాలను ఏర్చి కూర్చాల్సి వచ్చినప్పుడు ఏమంత నేర్పరితనం కూడా ముఖ్యం కాదు. గడచిన జీవన పర్వాలలో ఒదిగి ఉన్న సంఘటనలు, సన్నివేశాలూ వాటంతటవే - మేఘం కురిసినట్టుగా - ఆర్ద్రత తాకిడికి ఝల్లుమని జాలువారిపోతాయి. మారుతీరావుగారి విషయంలో నాకిదే అనుభవం ఎదురైంది. ఏనాటి పరిచయం మాది... ఎప్పుడో 'ఆత్మగౌరవం' చిత్రం నాటి అనుభవాల వగరుతో గుండె పొలమారుతోంది. జీవితానికి దిక్సూచి కాగల, వృత్తికి దస్తూరి నేర్పగల పాత్రల కోసం తపన పడే నేనున్నూ, చిత్రసీమకు రచయితగా వచ్చి వెండి తెర వేదిక పైకి ఎక్కుతున్న మారుతిరావుగారున్నూ 'ఆత్మగౌరవం' చిత్రంతో ఒకరితో ఒకరం విడదీయలేనట్టుగా ముడిపడిపోయాం. అందుకు వృత్తికన్నా మా ఉభయుల ప్రవృత్తే అత్యంత ప్రాధాన్యం వహించిందన్న విషయం ఆ తర్వాత ఎన్నాళ్ళకో గానీ నాకు బోధ పడలేదు. భవిష్యత్తు విలువ వర్తమానం చెబుతుంది. వర్తమానంలో వెలుగు గతం నుండీ చిమ్ముతోంది. సమర్థుడైన రచయితగా ఆయన అందుకోబోతున్న లేదా అందుకున్న పటిష్టమైన స్థితిని నేను లీలగా చూడగలిగాను. ఎందుకంటే 'అన్నపూర్ణ' సంస్థలో ఆనాడు అడుగు పెట్టిన ఎవరికైనా వృత్తి ఆయుర్దాయం గట్టిది. అది వెలుగులు విరజిమ్ముతూ సాగేది. ఆ ప్రాప్తాన్ని అందిపుచ్చుకున్న వారిలో సగర్వంగా, సగౌరవంగా నేనూ ఒకణ్ణి కాబట్టీ - ఆ అడుగుల జాడలలో మారుతిరావుగారి అడుగులకు కూడా అద్భుతమైన గమ్యం ఉందని అనిపించిన నా ఆ నాటి ఊహ - ఈ నాటికి నాకు చెరగని గురుతు. ఆయన రాసిన చిత్రాలన్నిటిలోనూ దాదాపు నటించాను. ఆయన సృష్టించిన పాత్రలన్నింటినీ ఎంతగానో అనుభవించాను. మారుతిరావుగారి పోకడ వేరు. నాటక రంగం నుండీ సినిమా రంగానికి వచ్చిన ఆయనలో ప్రేక్షకుణ్ణి ఆకట్టుకునే స్పష్టమైన బాణీ ఇదమిద్ధంగా కనపడేది. 'చెల్లెలి కాపురం', 'శుభలేఖ' చిత్రాల్లో పాత్రలు - వాటి సంభాషణ రీతి నేనిప్పటికీ మరచిపోలేని విధంగా నా మనసులో ఉండిపోయాయి.

ఎన్నాళ్ళుగానో పరిచయస్థుడిగా, స్నేహితుడిగా ఎన్నో దశలు దాటి ఇప్పటికీ ఎంతో చక్కటి సంబంధ బాంధవ్యాలను పైనవేసుకున్న వ్యక్తిగా ఆయన పట్ల నాకు ఎనలేని ప్రేమ, గౌరవం ఉన్నాయి. ఆయన మాట్లాడే తీరు చాలా స్పష్టంగా ఉంటుంది. సంభాషణా చాతుర్యాన్ని ప్రతీ మాటలోనూ పొదగగల మంచి చతురుడు. ఎప్పటికప్పుడు మారుతున్న ధోరణులకి అనువుగా మారుతూ ఆయన వెలయించిన 'జీవనకాలమ్'కి నేను ప్రత్యేక అభిమానిని. ప్రత్యక్ష అభిమానిని. ఇలా ఎందుకన్నానంటే జీవన కాలమ్ చదవగానే వెంటనే ఆయనకి ఫోన్ చెయ్యడమో, లేదా కారు ఎక్కి వెంటనే ఆయన్ని కలుసుకోవడమో నాకు బాగా నచ్చే విషయం. అలాటి సమావేశాలలో మరచిపోలేనన్ని ముచ్చట్లు ఇంటికి తెచ్చుకునే వాణ్ణి! చురుకైన మనిషేగానీ, జోరైన వ్యక్తికాదు. మాటగానీ ఆలోచనగానీ చాలా సంయమనంతో, సమతుల్యంతో సాగించడం ఆయన నైజం. ఎన్నాళ్ళో చిత్రపరిశ్రమలో ఉన్న ఆయన నటుడిగా తెరకెక్కడానికి దాదాపు నాకు తెలిసి ముప్ఫై సంవత్సరలు పట్టింది. రచనా వ్యాసంగంలో ఉన్న వ్యక్తిగా ఆయనకి నటుడు కావడానికి ఏ దశ అయినా అంతకష్టమైన పనికాదు. ఆయనలోని పరిపక్వత రచనా వ్యాసంగం పైనే దృష్టిని ఎక్కువ కేంద్రీకరించేట్టు చేసిందని నా ఉద్దేశ్యం. పక్క చూపులు లేకుండా ఏకాగ్రతతో తమ కార్యక్రమం పైన శ్రద్ధ వహించడమన్నది మానసిక క్రమశిక్షణకి ఓ సడలని సంకేతం. ఏ రెండు విషయాలను ఏకకాలంలో జోడించకుండా, గొప్ప నిర్దిష్టతతో జీవితాన్ని అత్యంత విజ్ఞానదాయకంగా నడిపిన వ్యక్తి. చదువుపట్ల ఆయనకున్న మక్కువ నాకు తెలుసు. విద్యని, విజ్ఞానాన్ని ప్రేమించడం ఆయనలోని బలమైన బలహీనత. నటుడిగా సరే - ఓ దశాబ్దం పాటు చాలా బిజీగా ఉన్న మారుతిరావుగారు మీడియాకి, తన వ్యక్తిగత జీవితానికీ మధ్య నున్న వ్యత్యాసాన్ని సమూలంగా చెరిపేసి, ఆద్యంతం మీడియా మనిషిగా తనని తాను తీర్చిదిద్దుకున్నారు. అదీ ఆయనలోని నాకు బాగా నచ్చే అత్యంత ముఖ్యమైన విషయం.

ఈ మాట ఎందుకన్నానంటే - కేవలం మీడియాలో వృత్తే కాకుండా ప్రవృత్తి మేరకూ మీడియాని గురించిన సమగ్రమైన అట్టుపట్టు ఆనవాళ్ళను క్రోడీకరించి - తెలియని ఎన్నో విషయాలను గురించిన తెలిసిన వ్యక్తిగా ఎదగడంలో మారుతిరావుగారు చక్కటి

అభ్యాసాన్ని సాధన చేశారు. ఏదో సంపాదించుకుంటున్నాములే, ఏదో సాగుతోందిలే అని నడుం వాల్చకుండా జీవితాన్ని పండించిన మాధ్యమం గురించి లోతుపాతుల్ని అధ్యయనం చేసినందుకు ఆయన్ని ఈ సందర్భంగా మనసా అభినందిస్తున్నాను.

జీవితానికి సంబంధించిన అన్ని అంశాలలోనూ ఆయన కృషి ఫలించింది. అపశృతుల గురించి ప్రస్తావించను. వెనకనున్న శృతిపర్వమైన కీర్తనే జీవితం. శృతి తప్పదు. అపశృతీ తప్పదు. ఈ రెంటినీ దాటుతూ ముందుకు జరిగినప్పుడే లేదా జరగగలిగినప్పుడే పూర్తి సమగ్రత ఏర్పడుతుంది. అది మారుతిరావుగారు సంపూర్తిగ సాధించారు.

*ఈ సంచికలోనే ప్రచురించబడిన గొల్లపూడి మారుతీ రావు గారు రాసిన అత్యద్భుతమైన కథ 'జుజుమురా '.. చదవడానికి ఇక్కడ క్లిక్ చేయండి..!*

## సరదా..సరదాగా..!

రంగారావ్ హైదరాబాద్ లో వివిధరకాల సంగీత వాయిద్యాలమ్మే షాపు పెట్టినట్లు తెలిసి చూడ్డానికి వెళ్ళాడు నాగేశ్వరావ్.

షాపులో సంగీత పరికరాలతోపాటు తుపాకులు కూడా అమ్మడం చూసి నాగేశ్వరావ్ కి ఆశ్చర్యం కలిగింది.

"సంగీత వాయిద్యాలకూ , తుపాకులకూ సంబంధమేమిటీ? అవెందుకు వుంచావీ షాపులో" అడిగాడతను.

" ఆ రెంటికీ చాలా దగ్గర సంబంధం వుంది.!" అన్నాడు రంగారావ్ నవ్వుతూ..

"ఎలా?"

"ఎలాగేముందీ? ఉదాహరణకి ఇవాళ ఒకడు హార్మోనియమో, తబలానో, తంబురానో ఏదో ఒకటి నేర్చుకోవాలని కొనుక్కెళ్ళాడనుకో..నాల్రోజుల తర్వాత అతనింటి చుట్టుపక్కలాళ్ళందరూ వచ్చి తలో తుపాకి కొనుక్కెళతారు..!"

యర్రంశెట్టి శాయి




# అమ్మ

## అనుభవాల కలంనుంచీ అనేక విషయాలు



బొటన వేళ్ళ మీద నిలబడితే ఆమె ఎత్తు అయిదు అడుగులు. కానీ చాలా ఎత్తయిన ప్రపంచ దేశాల అధినేతలు, సంపన్నులూ, నాయకులూ ఆమె ముందు మరుగుజ్జులుగా కనిపిస్తారు. క్రైస్తవ మతంతో ప్రమేయం లేని ఒక అరబ్ దేశపు ప్రధాని 600 సంవత్సరాల నాటి ఆంక్షని సడలించి ఆమెని తమ దేశానికి ఆహ్వానించారు. జర్మన్ గ్రీర్ అనే ఫెమినిస్ట్ ఆమెని "పేదల పాలిటి గ్లామర్ గర్ల్. పేదరికం ఫేషన్‌గా చేసుకున్న ఓ క్రిమి" అంది. ఆవిడ నవ్వి "ఆమె కోసం నేను దేవుడిని ప్రార్ధిస్తాను" అంది. 70 సంవత్సరాల సుదీర్ఘమయిన జీవితంలో మతాల, ఇజాల, దేశాల, హృదయాల ఎల్లలను కూల్చిన అయిదడుగుల బడుగు ప్రాణి - కానీ ఈ శతాబ్దపు మానవశక్తి - ఆమె పేరు అమ్మ - వెరసి మదర్ థెరీసా.




హిరణ్యకశిపుడు నా ముందు నిలబడి "దేవుడెక్కడున్నాడయ్యా" అంటే స్థంభాలు వెదకను. జీవితాన్ని తల్లకిందులుగా తనిఖీ చేసి బతికే అతలాకుతలంలో దేవుడు ప్రమేయం అక్కర్లేదనే వాళ్ళకీ, దేవుడే ఎందుకు అనే వాళ్ళకీ, దేవుడెలా ఉంటాడు అనే వాళ్ళకీ - ఒక వేపు వేలు చూపిస్తాను - మదర్ వేపు.

కుష్టు వేళ్ళతో నేసిన తెల్ల చీరని కట్టుకుని, ప్రపంచంలో ప్రేమంటే తెలీని మూగ జీవాల్ని పొత్తిళ్ళలో హత్తుకుని, శుభ్రం చేసే కుష్టు చేతిలో కూడా బాధ పడే దేవుడినీ, ఆకలి గొన్న పేదలో ఆకలితో ఉన్న దేవుడనీ, ఆర్తితో ఉన్న దరిద్రుడిలో దరిద్రంతో బాధ పడుతున్న జీసస్‌ని చూసే శక్తి పేరు `దేవుడు'. ఆ దేవుడికి మరో పేరు అమ్మ.

నగరం నడిబొడ్డులో ఆమెకి ప్రభుత్వం ఇచ్చిన భవనానికి నిరసనగా కాళీమాత భక్తులు బైఠాయింపు సమ్మె చేసి ఆమె ఔదార్యానికి తలవంచినప్పుడు - ఆర్తితో ఉన్న ఓ కాళీ భక్తుడిని ఆమె అక్కున చేర్చుకుని - తన ఇంటిలో ఆశ్రయమిస్తే, ఆతను ఆమె కాళ్ళను పట్టుకుని "ముప్పై ఏళ్ళు ఆ అమ్మని కొలిచానమ్మా. ఆ తల్లి ఈ అమ్మ రూపంలో దర్శనమిచ్చింది" అని ఏడ్చాడట. ఇది ఆమె చుట్టూ లతల్లాగా అల్లుకున్న లక్షలాది సందర్భాలలో ఒకటి.

దేవుడికి నేను సేల్స్‌మాన్‌నీ కాదు. ప్రాపగాండా సెక్రటరీని కాదు. ఆయనకా అవసరమూ లేదు. దైవత్వానికి ఆ ప్రమేయమూ లేదు. అయిదు రూపాయలతో దాదాపు 50 సంవత్సరాల క్రితం కలకత్తాలో ఓ మారుమూల ఇంటిలో ఆమె ప్రారంభించిన సేవ ఓసారి ఆమె గుండెకాయ ఒక క్షణం క్రమం తప్పితే - అటు అమెరికా అధ్యక్షుడినీ, ఇటు రష్యా అధ్యక్షుడినీ, అటు బ్రిటన్ ప్రధానినీ, ఇటు

యెమెన్ ప్రధానినీ కలవర పడేట్టు చేసింది. ప్రపంచంలో చాలా బలమయిన ప్రాథమిక శక్తి ఏది? ఆటం? డబ్బు? కీర్తి? ఒక్కటే సమాధానం - ప్రేమ. ఆ సమాధానాన్నీ, ఆయన్నీ నమ్మని వారికి ఈ తరం చూపించిన సజీవమయిన సమాధానం - మదర్.

ఆమె మీద వ్యాసం వ్రాయడానికి కుష్వంత్ సింగ్ రెండు రోజులు ఆమెతో గడిపారట. ఆమె కలకత్తా రోడ్డు మీద వెడుతుంటే - ఎదురుగ్గా కమ్యూనిస్టు పార్టీ ఊరేగింపు వస్తోందట. దేవుడితో ప్రమేయం లేని రాజకీయ సిద్ధాంతాలకు ముడిపడిన చాలా మంది కార్యకర్తలు - ఊరేగింపులోంచి బయటకి వచ్చి - ఆమె పాదాలకి నమస్కరించి మళ్ళీ ఊరేగింపుతో కలిసి పోయారట. ఒక్క ప్రేమ విషయంలోనే ఏ సిద్ధాంతపు తెరలయినా వీగిపోతాయనడానికి మదర్ సాక్ష్యం.

ఆమెని భారత రత్న చెయ్యడానికి ఆమె స్థాయికి రాష్ట్రపతి వంగినప్పుడు ప్రేక్షకుల్లో కూర్చున్న నెహ్రూ, విజయలక్ష్మిగార్ల కళ్ళు చెమర్చినపుడు, నోబెల్ శాంతి బహుమతిని పుచ్చుకున్నప్పుడు జరిగిన విందులో పాల్గొంటూ 'ఈ విందు మానుకుంటే ఎందరి పేదలు కడుపులు నిండుతాయో ఆలోచించండి' అన్నప్పుడు మానవత్వం ఎంత ఎత్తుకు ఎదగగలదో చూడడానికి మనకి చూపు చాలదు.

గర్భస్రావాన్ని ఎదిరిస్తూ "మీరు ఎబార్షన్ ప్రతిపాదిస్తున్నారు. నేను ఎడాప్షన్‌ని ప్రతిపాదిస్తున్నాను, గర్భస్రావంతో రెండు చచ్చిపోతాయి. ఒకటి: కడుపులో ప్రాణీ, రెండు: తల్లి అంతఃకరణ. మీకు బిడ్డ అక్కర లేకపోతే నాకివ్వండి. నాకు కావాలి" అన్న తల్లి - తల్లులకి తల్లి కాక ఏమౌతుంది.

ఓసారి విమానంలో ప్రయాణం చేస్తూ - ఎయిర్ హోస్టెస్‌ని పిలిచి "అందరూ తినగా వదిలేసిన తినుబండారాలన్నీ ఓ సంచిలో వేసి ఇవ్వగలవా?" అని అడిగిందామె. ఆమె ప్రయాణాలకు డబ్బులేక - ఎయిర్ ఇండియాలో ఎయిర్ హోస్టెస్ పనిచేసి తీర్చుకుంటానని చెప్పారు. తర్వాత ఎయిర్ ఇండియా - ఆ మాటకి వస్తే ఏ ఎయిర్ లైన్స్ సంస్థా ఆవిడ ప్రయాణాలకి అభ్యంతరం చెప్పలేదు. తన చుట్టూ జరిగే ప్రతి చిన్న కార్యకలాపంలో పేదవానికి జరిగే ఏ చిన్న సహాయాన్నయినా వెదికేవారు "ఈ లోకంలో అన్ని రోగాలకు అన్ని రకాల మందులూ ఉన్నాయి. కానీ పేదరికాన్ని, ఆపులబాధనీ తీర్చడానికి - ఒకే ఒక మందు అవసరం. అది ప్రేమ, సేవ" అన్నారు.

1985లో అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ అమెరికా ప్రెసిడెన్షియల్ ఫ్రీడం మెడల్‌ని ఆమెకి బహుకరిస్తూ - " బహుశా ఈమె ఈ మెడల్‌ని ఇండియాకి తీసుకెళ్ళి దీన్ని కరిగించి విక్రయించి ఆ డబ్బుని పేదలకోసం ఖర్చు చేస్తుందేమో" అని, (ఆమె స్వభావం తెలిసిన వాడిగా) చమత్కారంగా అన్నారట. ఆయన చమత్కారంలో అర్థం లేకపోలేదు. పోప్ ఆమెకు ఓ చక్కటి, ఖరీదయిన లిమోసీన్ కారుని బహూకరించారు. ఆమె ఆ కారుని అమ్మేసి పేదలకు ఖర్చు చేశారు.

పేదరికాన్ని రూపుమాపడానికి, అనాథల్ని ఆదుకోవడానికి - ఈ లోకంలో అమ్మది చాలా చిన్న ప్రయాణం. 120 దేశాలలో ఈ మాతృత్వపు ఛాయలు విస్తరిల్లినా, ఇంకా ఎందరో ఆర్తులకు అమ్మ కావాలి. 87 ఏళ్ళ జీవితం - ఓ హృదయంలో చిన్న దీపాన్ని - ఎందరో చలికాచుకునే జ్వాలగా మార్చింది. మదర్ ఓసారి అన్నారు. "ఆమధ్య నేను స్వర్గ ద్వారాల దగ్గరికి చేరినట్టు కల వచ్చింది. సెంట్ పీటర్ నన్ను చూసి 'భూలోకానికి తిరిగి వెళ్ళు - ఇక్కడ నీకు పనిలేదు. మురికి వాడలు ఇక్కడ లేవు' అన్నాడు అని" ఆఖరి క్షణం వరకు ఆమె చెయ్యి ఓ బాధాతప్తుడి కన్నీటిని తుడుస్తూనే ఉంది. ఓ అనాథ బాలుడిని ఒడిలోకి ఆహ్వానిస్తూనే ఉంది.

ఆమెని దేవదూత అనడానికి - ఆమె పోయిన చాలా దశాబ్దాలు ఆగాలట. కారణం - ఆమె ద్వారా ఏవో రెండు అద్భుతాలు జరగాలట. అప్పుడు చర్చి ఆమెను దేవదూతగా గుర్తిస్తుంది. అయితే ఆ అద్భుతాలకి అంతకాలం ఆగనక్కర్లేదు. కలకత్తాలో ఆ చిన్ని శరీరంలో ఓ గుండెకాయ అలిసిపోయి, ఆగిపోయిందని తెలిసిన క్షణాలలో - ఎటువేపు తిరిగినా - ఓ హిందూ, ఓ ముస్లిం, ఓ సిక్కు, ఓ అమెరికన్, ఓ బ్రిటన్ - కళ్ళలో ఒకేసారి కన్నీరు తిరగడం కన్న 'అద్భుతం' మరొకటి కనిపించదు. నిర్మల హృదయంతో అనాథలను ఆదరించే అమ్మ పోయిన క్షణంలో, ప్రపంచమంతటికీ మాతృత్వపు పరిమళాన్ని పంచే మూలాధారం జారిపోయింది.